# అమ్మ జ్ఞాపకాలు



కట్టా గోపాల కృష్ణ మూర్తి

*Ann Arbor, MI*

*ISBN: 1-892408-64-3*

*Publication # 74*

# అమ్మ జ్ఞాపకాలు

రచయిత

**కట్టా గోపాలక్రిష్ణమూర్తి**

Email ID : murty@umich.edu

**74వ ప్రచురణ**

**Vanguri Foundation of America, Inc,**

Houston, Texas

# అమ్మ జ్ఞాపకాలు

....కట్టా గోపాలక్రిష్ణమూర్తి, *Ann Arbor, MI*

First Edition: September, 2018

ISBN: 1-892408-64-3

e- Publication # 74

© Author

Published by:
**Vanguri Foundation of America** (Houston, TX)
P O Box 1948
Stafford, TX 77497
Phone: 832 594 9054
E-mail: vangurifoundation@gmail.com

e- book available for free:
Author web site:
http://www-personal.umich.edu/~murty/
Author Contact: murty@umich.edu

డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్ 20వ వార్షికోత్సవ సందర్భంగా ప్రచురించబడిన పుస్తకం

# ఉపోద్ఘాతం

2016లో మా అమ్మగారు చనిపోయినప్పుడు నాకు దీన్ని తయారుచెయ్యాలనిపించింది. దానికి ముఖ్య ఉద్దేశాలు ఇవి.

1. నా చిన్నతనంలో మా అమ్మగారు నాకు నేర్పించిన మంచి గుణాలు, ముఖ్యంగా నా జీవితంలో చెయ్యదలచుకున్న పనులు జరగాలంటే, వాటిని చెయ్యడానికి గట్టి ప్రయత్నం ఎంతో ముఖ్యం అని నేర్పించిన నీతి, ఇవన్నీ నా జీవిత గమ్యం చేరడానికి ఎంత సహాయం చేశాయో చెప్పడం, ఇది మన సంఘంలో అమ్మలందరికీ చెప్పాలనిపించడం.

2. నా జీవితంలో 'కుల మతాల'తో నేను ఎదుర్కొన్న సమస్యలు, వాటిని నేను ఎలా అధిగమించానో చెప్పడం, ముఖ్యంగా ఈ కులాలు, మతాలు అన్నీ కూడా మానవులు తయారుచేసినవే అని అందరికీ నేర్పించడం.

3. పడుచువాళ్ళకు తమ జీవితంలో వాళ్ళు ఎదుర్కొంటున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే వాళ్ళకు మంచి జరుగుతుంది అని నా జీవితం ఒక ఉదాహరణగా వాడి చెప్పడం.

4. దీన్ని తయారుచెయ్యటంలో నా తమ్ముళ్ళు శ్రీరామమూర్తి, సాయి చాలా సహాయం చేశారు, వాళ్ళే దీన్ని చక్కగా టైపు కొట్టించారు. ఇది చదివి, మా ఉద్దేశాలు దీంట్లో నెరవేరాయో లేదో చెప్పండి.

ధన్యవాదాలు...

**– కట్టా గోపాలకృష్ణమూర్తి**

27 జూన్ 2018.

# మా మాట

**డి**ట్రాయిట్ పేరు చెప్పగానే గుర్తుకొచ్చేవారిలో ప్రముఖులు డా. కట్టా గోపాల కృష్ణమూర్తిగారు. మా సంస్థ మొదలుపెట్టిన దగ్గర నుండీ మాకు సహాయం చేస్తూ, ప్రోత్సహిస్తూ పరోక్షంగా సుమారు పాతికేళ్ళ పరిచయం ఉన్నా, నాకు గుర్తున్నంత వరకూ ఇప్పటిదాకా ఆయనని ఒకే ఒక్కసారి కలుసుకున్నాను. 'డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్'వారి పదేళ్ళ వార్షికోత్సవాలలో పాల్గొనడానికి నేను పదేళ్ళ క్రితం డిట్రాయిట్ వెళ్ళినప్పుడు ఆయనని కలుసుకున్నాను. మరో పదేళ్ళు అలా, అలా గడిచిపోయి ఇప్పుడు అదే 'డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్'వారి ఇరవై ఏళ్ల వార్షికోత్సవాల సందర్భంగా డా. కట్టా మూర్తిగారి "అమ్మ జ్ఞాపకాలు" ఆవిష్కరించబడడం చాలా సంతోషదాయకం. ఒక అపురూపమైన, వ్యక్తిగత జీవితానుభవాలతో కన్నతల్లి జ్ఞాపకాలని ఆప్యాయంగా, గౌరవంగా నెమరు వేసుకుంటూ పాఠకులని మమైకం చేసే ఈ అంతర్జాల పుస్తకం ప్రచురించే మహద్భాగ్యం మాకు కలిగించిన డా. కట్టా మూర్తిగారికి మా ధన్యవాదాలు.

డా. కట్టా మూర్తిగారు ఈ "అమ్మ జ్ఞాపకాలు" వ్రాయడానికి తన ఉద్దేశ్యాలు క్లుప్తంగా తన ఉపోద్ఘాతంలో చెప్పిన వాటి కంటే చాలా ఎక్కువ సాధించారు అని ఈ పుస్తకం చదువుతూ ఉండగానే తెలిసిపోతుంది. ఒకటా, రెండా, 50 సంవత్సరాల క్రితం 1968లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్క్లీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకుని, వెనువెంటనే ఏన్ ఆర్బర్‌లోని మిషిగన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా స్థిరపడ్డారు. భారతదేశం, సౌదీ అరేబియా, హాంగ్‌కాంగ్, ఆర్మేనియా, తైవాన్ మొదలైన దేశాల విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు చేసి, పది గ్రంథాలు, వందలాది పత్ర సమర్పణలు, ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్, సీనియర్ స్పెషలిస్ట్ అవార్డ్ లాంటి అనేక పురస్కారాలు పొంది ప్రపంచ ప్రఖ్యాతి పొందిన స్టాటిస్టిక్స్ పరిశోధకులు అయిన డా. కట్టా మూర్తిగారు ఉత్తర అమెరికాలో తొలితరం తెలుగువారిలోనే తొలి తరం ప్రముఖులు. మన "గోడ కుర్చీ"ని వ్యాయామం కోసం పరుగు ప్రక్రియగా మలిచి దానికి "వణుకు" అని పేరు పెట్టి డా. కట్టా మూర్తిగారు రూపొందించిన "డోర్లింగ్" అనే ఇంగ్లీష్ పేరుతో బహుళ ప్రాచుర్యం కలిగించడం మరొక ఆసక్తికరమైన విశేషం. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, ఆయనకి ఉన్న తెలుగు భాషా, సాహిత్యాభిమానాలు మరొక ఎత్తు.

అంతర్జాలంలో ఉచితంగా అందుబాటులో ఉన్న ఈ అసాధారణ రచన "అమ్మ జ్ఞాపకాలు" మా 74వ ప్రచురణ. మాకు ఈ అవకాశం ఇచ్చిన ఆత్మీయులు డా. కట్టా మూర్తిగారికి మా హృదయపూర్వక ధన్యవాదాలు.

**– వంగూరి చిట్టెన్ రాజు**

వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా

జులై 20, 2018 — హ్యూస్టన్, టెక్సస్

# అమ్మ జ్ఞాపకాలు - విషయ సూచిక


1. మా అమ్మ, నాన్నల జననం, చదువులు, వివాహం 6

2. అమ్మ మొదటి కాన్పులో నేను పుట్టడం 7

3. మేము బందరుకి మారి సొంత ఇంట్లో నివాసం మొదలుపెట్టడం 7

4. అమ్మ నా మొదటి టీచర్ 8

5. నాయనమ్మతో నా అనుభవాలు 10

6. పందిళ్ళపల్లి, బందర్‌లలో నా ఎలిమెంటరీ, మిడిల్ స్కూళ్ళ చదువులు 10

7. మా కుటుంబం కైకలూరుకి మారడం 13

8. మా కుటుంబం మళ్ళా బందరుకి మారడం 16

9. నేను కాలేజీ చదువుకి మద్రాసు వెళ్ళడం 22

10. ఐ.ఎస్.ఐ. కలకత్తాలో నా గ్రాడ్యుయేట్ చదువు,
ఐ.ఎస్.ఐ. (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్)
ఎస్.క్యు.సి. (స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్) యూనిట్‌లో మొదటి ఉద్యోగం 26

11. ఫుల్ బ్రైట్ ట్రావెల్ గ్రాంటు మీద నా మొదటి యు.ఎస్. ట్రిప్పు 33

12. నా వివాహం, వివాహ జీవితం మొదలుపెట్టడం 36

13. నాన్నగారి రిటైర్డు జీవితం 39

14. మా అమ్మాయి వాణి పుట్టుక 40

15. మా అమ్మకు మొదటి పుత్రశోకం 40

16. నేను పి.హెచ్.డి. చదువుకి యు.సి.బి.
(యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్క్లీ) వెళ్ళడం 41

17. 1968 తర్వాత అమ్మ జీవిత విశేషాలు 43

18. మతాలతో మరికొన్ని అనుభవాలు 44

19. అమ్మ జీవితం, చివరి 10 సంవత్సరాలు 46

# అమ్మ జ్ఞాపకాలు

## 1. మా అమ్మానాన్నల జననం, చదువులు, వివాహం

పుట్టినప్పుడు మా అమ్మ పేరు "గుత్తి ఆదిలక్ష్మి". జననం 1922 పందిళ్ళపల్లి గ్రామంలో, తల్లిదండ్రులు గుత్తి వెంకట సుబ్బమ్మ, గుత్తి నాగభూషణం. మా అమ్మ ఈ దంపతుల మొదటి సంతానం.

మా అమ్మకు ఇద్దరు చెల్లెళ్ళు – తులసీ నాగమ్మ, రామలక్ష్మి; నలుగురు తమ్ముళ్ళు – వెంకటేశ్వర్లు, యోగానంద సుబ్రహ్మణ్యం, కేదారీశ్వరుడు, రామయ్య.

ఆ కాలంలో మా తాతగారి ఇంట్లో ఆడపిల్లల చదువుకి అంత ప్రాముఖ్యం ఇచ్చేవారు కాదు. మా అమ్మ పందిళ్ళపల్లి గ్రామంలోనే ఎలిమెంటరీ స్కూలులో 5వ తరగతి వరకూ చదువుకుంది. తెలుగులిపి నేర్చుకొని తెలుగులో పుస్తకాలు చదవడం నేర్చుకుంది. తను ఇంగ్లీషు లిపి నేర్చుకోలేదు. చిన్నప్పటి నుంచీ తనకు సంగీతం చాలా ఇష్టం. తన చిన్నాన్న, మా కోటివీరయ్య తాతయ్య, తనకు చిన్న వయస్సులోనే పాటలు పాడడం, వాటికి తగ్గట్టు హార్మోనియం వాయించడం నేర్పించాడు.

మా నాన్నగారి తండ్రిగారు "కట్టా స్వామి కోటయ్య"గారు, ఆయన కొన్నాళ్ళు బాంబే ప్రావిన్సులోని బుసావల్ రైలు స్టేషన్‌కి స్టేషన్ మాస్టర్‌గా ఉద్యోగం చేశారు. అప్పుడు ఆయన జీతం కొంత కేష్‌గానూ, మిగతా బంగారు నాణేల రూపంలోనూ ఇచ్చేవారట. దీనివల్ల మా కట్టా స్వామి కోటయ్య తాతగారు చాలా బంగారం సంపాదించారట. మా నాయనమ్మ కట్టా పందిళ్ళమ్మ గర్భవతి అయినప్పుడు, పురిటికి బుసావల్ నుంచి పందిళ్ళపల్లి వచ్చి కొన్ని నెలలు గడిపిందట. ఆ సమయంలో బుసావల్‌లో మా తాతయ్య జబ్బుపడి అక్కడే చనిపోయారట.

1907లో మా నాయనమ్మకు పందిళ్ళపల్లిలో మా నాన్నగారు పుట్టారు. ఆయన పేరు "కట్టా నారాయణ స్వామి" అని పెట్టారు.

మా నాయనమ్మ, తాతయ్య బుసావల్‌లో ఉంటున్నప్పుడు మా తాతగారు తన సేవింగ్స్‌లో కొంత మొత్తం ఇంటిపక్కన ఉండే పెద్ద మహారాష్ట్ర కుటుంబం దగ్గర దాచిపెట్టమని ఇచ్చారట. మా తాతయ్య అక్కడ చనిపోయినప్పుడు, తన పురుడు తర్వాత తన పుట్టింటివారైన పేరక శంభయ్యగారితో బుసావల్ వెళ్ళి "మేము దాచుకొన్న సేవింగ్స్ తిరిగి ఇవ్వండి" అని అడిగితే ఆ మహారాష్ట్ర కుటుంబంవారు రిక్తహస్తాలతో వాళ్ళను తిరిగి పంపించేశారట. అప్పుడు మా నాయనమ్మ తన పసికొడుకుతో పందిళ్ళపల్లిలో నివసించడం మొదలుపెట్టింది.

మా అమ్మకు తన 8వ సంవత్సరంలో కట్టా నారాయణస్వామిగారితో వివాహం జరిగింది. పెళ్ళి జరిగినప్పుడు ఆయన వయస్సు 23 సంవత్సరాలు, ఎ.సి. కాలేజి, గుంటూరులో బి.ఎ. చివరి సంవత్సరం చదువుతున్నారు. పెళ్ళి తర్వాత, ఇంకా తను చిన్నపిల్లే గనుక మా అమ్మ పుట్టింటిలోనే ఉంది కొన్ని సంవత్సరాలు. ఆ సమయంలో తన అత్తగారు "మీ పిల్ల ఎప్పుడు సమర్త ఆడుతుంది, ఎప్పుడు కాపురానికి వస్తుందీ, మరి నా కొడుకు

ముసలివాడు అయిపోతున్నాడు" అని గుత్తి నాగభూషణం దంపతులని వేధిస్తూ ఉండేదట. ఆమె పోరు విని వినీ విసిగిపోయి నాగభూషణం దంపతులు తను త్వరలో పెద్దమనిషి అవడానికని మా అమ్మకు ఏవో మందులు కూడా ఇప్పించారట, కానీ అవి పని చెయ్యలేదట.

చివరకు తన 13వ ఏట పెద్దమనిషయి, మా అమ్మ అత్తగారింటికి కాపురానికి వచ్చింది. అప్పుడు తన పేరు "కట్టా ఆదిలక్ష్మి" అయ్యింది. అప్పటికి మా నాన్న బి.ఎ. పాసయి, పందిళ్ళపల్లి గ్రామంలో మొట్టమొదటి కాలేజి గ్రాడ్యుయేటు అయ్యారు.

తనకు పెళ్ళి అయిన వెంటనే మా తాతగారు మా అమ్మను స్కూలుకి పంపటం మాన్పించేశారు. తను కాపురానికి వచ్చినప్పుడు మా నాన్నగారు తనకు ఒక హార్మోనియం కొనిపెట్టారు. రోజూ తనకు ఖాళీ దొరికినప్పుడు ఆ హార్మోనియం వాయిస్తూ, పాటలు పాడుకుంటూ గడిపేదట. చాలా ఏళ్ళ తర్వాత బోస్టన్‌లో సెటిల్ అయిన నా చెల్లెలు గీత ఒక విషయం చెప్పింది. 1987లో మా అమ్మ తనను విజిట్ చేసి 6 నెలలు తనతో ఉంది. వాళ్ళకు అప్పుడు ఒక పియానో ఉండేది. అప్పుడు మా అమ్మ ఆ పియానోలోని ఏ కీ నొక్కితే ఏ రాగం వస్తుందో తానే కనుక్కొని, వాళ్ళమ్మాయి హరితకు పియానో మీద 3, 4 తెలుగు పాటలు పాడుతూ వాయించడం నేర్పించిందట.

త్వరలోనే మా నాన్నగారికి విజయవాడ సబ్‌డివిజన్ కోర్టులో గుమాస్తా ఉద్యోగం దొరికింది. అప్పుడు మా నాయనమ్మతో మా అమ్మా, నాన్న విజయవాడలో కాపురం పెట్టారు.

## 2. అమ్మ మొదటి కాన్పులో నేను పుట్టడం

తన 14వ ఏట మా అమ్మ విజయవాడలో ఒక చెరువు నీళ్ళల్లో స్నానం చేస్తున్నప్పుడు ఏదో కాంతిపుంజం తన గర్భంలో ప్రవేశిస్తున్నట్లు అనిపించి తన కళ్ళు మిరుమిట్లు గొలిపాయట. తనకు అప్పుడు తను గర్భవతి అయినట్లు తెలిసిందట. ఆ కాలంలో మా అమ్మకు కృష్ణుడి మీద చాలా భక్తి ఉండేది. ఎప్పుడూ ఒక కృష్ణుడి బొమ్మకి ప్రార్థన చేస్తూ ఉండేదట. ఆ కాంతిపుంజం కృష్ణుడు తన గర్భంలో ప్రవేశించడం అనుకొని, మొగపిల్లాడు పుడితే వాడికి "గోపాల కృష్ణమూర్తి" అని పేరు పెడ్తానని మొక్కుకుందట.

పురుటికి తను పందిళ్ళపల్లిలో తన పుట్టింటికి వెళ్ళిపోయింది. తన 14వ ఏట, 1936 కృష్ణాష్టమి రోజున (9 సెప్టెంబర్ 1936) పందిళ్ళపల్లి గ్రామంలో ఉధృతమైన తుఫాను వడగళ్ళతో పడుతుండగా తన పురుడు మా తాతగారి ఇంట్లో జరిగి నేను పుట్టాను. తను మొక్కుకున్నట్లే నా పేరు "గోపాల కృష్ణమూర్తి" అని పెట్టింది, అందరూ నన్ను "గోపాలం" అని పిలవడం మొదలుపెట్టారు.

నేను పుట్టాక నా ఆలనా పాలనాలో బిజీ అయిపోయి తనకు హార్మోనియం వాయించడానికి టైము దొరికేది కాదు. అందుకని నేను పుట్టిన కొన్ని సంవత్సరాల తర్వాత మా నాన్నగారు అమ్మ హార్మోనియంను అమ్మేశారు.

## 3. మేము బందరుకి మారి సొంత ఇంట్లో నివాసం మొదలుపెట్టడం.

విజయవాడ సబ్‌డివిజన్ కోర్టులో కొన్నాళ్ళు ఉద్యోగం చేసి మా నాన్న బందరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుకి మారారు. అక్కడ కొన్నాళ్ళు పనిచేశాక, 1940కి ముందు కొత్తగా మొదలుపెట్టిన "భాస్కరపురంలో" స్థలం

కొని, రెల్లుగడ్డి కప్పుతో పూరిల్లు కట్టించిన తరువాత దాంట్లో నివసించడం మొదలుపెట్టాము.

అప్పుడు మా నాయనమ్మ పందిళ్ళమ్మ మా స్థలంలో తోటపని మొదలుపెట్టింది. తోటలో చిలగడదుంపలు, దోసకాయ, బీరకాయ, వంకాయ మొదలైన కాయగూరలు పండించేది. వినాయకచవితి తర్వాత రోజున "ఋషిపంచమి" అంటారు. ఆ పండుగ రోజున మా నాయనమ్మ మార్కెటులో దొరికే (జంతు సహాయంతో పండించిన) పంటలేవీ తినకుండా, మా తోటలో మేమే పండించుకున్న కాయగూరలనే తినేది.

దీన్ని చూసి నాకు తోటపని బాగా అలవాటయ్యింది. గార్డెనింగుమీద చాలా ఆసక్తి నాకు ఆ కాలంలోనే అబ్బింది.

మా నాయనమ్మకు మడిమీద చాలా నమ్మకం, మ,డి ఆచారాలను పాటించాలని తన కోడలికి చెప్తూ ఉండేది. అప్పటికే మా నాయనమ్మ విధవ. తన భర్త ఫోటో లేదు, అందుకని ఆయన జ్ఞాపకార్థంగా 2 గుప్పిళ్ళ బియ్యం మా అమ్మచేత శుభ్రం చేయించి, తర్వాత తను బాగా మళ్ళీ శుభ్రం చేసి, అప్పుడు ఆ శుభ్రమైన బియ్యాన్ని నేలమీద భర్త పాదాల రూపంలో అమర్చి, ఆ పాదాలకు పూజ చేసేది. ఋషిపంచమి రోజున పూజ అయ్యాక, ఆ బియ్యాన్ని పక్షులకు పెట్టేది.

మేము భాస్కరపురంలో నివసించడం మొదలుపెట్టినప్పుడు, అక్కడ రాత్రుళ్ళు నక్కలు తిరిగేవి. అందుకని ఆ ప్రాంతాన్ని "భాస్కరపురం" అని కాక, అందరూ "నక్కలతోట" అని పిలవడం మొదలుపెట్టారు. నక్కలనుంచి రక్షణ కొరకు మా నాన్న మా ఇంటి సరిహద్దు చుట్టూరా మేపాళం మొక్కలు నాటించారు. ఆ మొక్కలు చాలా త్వరగా పెరిగి, స్థలానికి ఫెన్స్‌లాగా తయారయ్యాయి. దాన్ని ఇంకా దట్టంగా చెయ్యడానికి నేను వాటి కొమ్మలు నరికి ఆ కొమ్మలను ఖాళీ ఉన్న చోటుల్లో నాటి, అవి బాగా పెరగడానికి రోజూ బావిలో నీరు తోడి పోసేవాడిని. నేను ఆ మేపాళం కొమ్మలు నాటుతున్నప్పుడు పక్క ఇళ్ళ నుంచి పిల్లలు "గోపాళం, మేపాళం కొమ్మలని నాటుతున్నాడోచ్" అని పాడేవారు. కొన్నాళ్ళల్లో ఆ నాటిన కొమ్మలకి చిగుర్లు వచ్చి, పెరగడం మొదలుపెట్టినప్పుడు నాకు చాలా సంతోషం కల్గింది. ఇలా చిన్న వయస్సులోనే మొక్కలు ట్రాన్స్‌ప్లాంటింగు, ప్రాపగేషన్ వగైరా గార్డెనింగ్ పద్ధతులు నేర్చుకున్నాను నా అంతట నేనే.

## 4. అమ్మ నా మొదటి టీచర్

నాకు 3, 4 సంవత్సరాలప్పుడే నాచేత తెలుగు అక్షరాలు దిద్దించి నేర్పించింది మా అమ్మ. ఆ చిన్న వయస్సులోనే తెలుగు చక్కగా రాయడం, చదవడం నేర్చుకున్నాను. మా నాన్నగారు కొన్ని తెలుగు పుస్తకాలు తెచ్చి ఇంట్లో ఉంచారు. అవి చదువుతూ ఉండేవాణ్ణి. దీనివల్ల నాకు చిన్నప్పుడే పురాణాలలోని కథలు చదవడం, వినడం చాలా బాగా అలవాటయ్యింది. రోజూ పడుకోబెట్టడానికి మా నాయనమ్మ, అమ్మల్లో ఒకరు కథలు చెప్పేవారు. ఈ కథలు విని ఊ కొడుతూ నిద్రపోయేవాణ్ణి. ఎవరూ కథలు చెప్పకపోతే నేను నిద్ర పోయేవాడిని కాదట.

తను సంసారం పనుల్లో బిజీగా ఉన్నా, వ్యవధి కల్పించుకొని నాకు తెలుగు చక్కగా నేర్పించింది మా అమ్మ ఇలా. "వాడికి చదువుకోవడానికి కొన్ని పుస్తకాలు తీసుకురండి" అని నాన్నను మా అమ్మ అడుగుతుండేది.

అలానే మా నాన్న తెలుగు పుస్తకాలు తెచ్చి ఇచ్చేవారు. ఖాళీ సమయాల్లో నేను ఆ పుస్తకాలు చదువుతుండేవాణ్ణి. దీనివల్ల చిన్నప్పుడే నాకు కాలం వృధా చెయ్యకుండా చదువుతూ ఉండడం అలవాటు అయ్యింది, ఈ అలవాటు నాతో జీవితాంతం ఉండిపోయింది.

తను కత్తిపీటతో కూరగాయలు కోసుకునే సమయంలో నేను ఇంట్లో ఉంటే, అమ్మ నన్ను తన పక్కన కూర్చోబెట్టుకొని, నాతో "పెద్ద చదువులు చదువుకొని గొప్ప ఉద్యోగం సంపాదించాలి గోపాలం" అంటూ చెప్పేది. నేనేమో "ప్రయత్నిస్తున్నాను కదా అమ్మా!" అని చెప్పేవాణ్ణి.

అప్పుడు అమ్మ "చూడు గోపాలం, మానవుడు ఏ పని చెయ్యాలనుకున్నా, గట్టి ప్రయత్నం చేస్తే తప్పకుండా సాధించగలడు. ఉదాహరణకు, ఈ ఉక్కుగొట్టం చూడు" అని తను పొయ్యి ఊదుకునే గొట్టం చూపించి "ఈ గొట్టాన్ని సగానికి విరగగొట్టదలచుకుంటే, మనం మనస్ఫూర్తిగా దాన్ని చూస్తూ 'ఇది మధ్యకు విరగాలి' అనుకుంటే, కొంతసేపట్లో అది అలానే విరుగుతుంది" అని చెప్పింది. నేను అలానే చాలాసార్లు ప్రయత్నించాను, కానీ గొట్టానికి ఏమీ కాలేదు. బహుశా నేను త్రికరణశుద్ధిగా ప్రయత్నించలేదేమో అని అనుకునేవాణ్ణి. కానీ అప్పుడే చెయ్యదలచుకున్న పనులకు వీలైనంత గట్టి ప్రయత్నం చెయ్యడం, పలురకాలుగా సాధించడానికి ప్రయత్నించడం నాకు అలవాటు అయ్యింది.

ఆ రోజుల్లో ఆఫీసుకి వెళ్ళడానికి మా నాన్నగారికి ఒక సైకిలు ఉండేది. తను బందరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో ఉద్యోగం చేస్తున్నప్పుడు, మా నాన్నగారు తన సైకిల్ ముందు నన్ను కూర్చోబెట్టుకొని తనతో ఆఫీసుకి తీసుకువెళ్ళేవారు. ఇలా వెళ్ళడం నాకు చాలా సరదాగా, గర్వం కారణంగా ఉండేది. అక్కడ నేను ఆఫీసు గదులన్నీ తిరిగేవాణ్ణి, ఆఫీసు చుట్టూ ఉండే తోటను చాలా ఆసక్తితో చూసేవాణ్ణి, ఆ తర్వాత ఒక ఆఫీసు గదిలో ఉన్న ఖాళీ కుర్చీలో కూర్చొని నాతో తెచ్చుకున్న పుస్తకాన్ని చదువుతూ కాలం గడిపేవాణ్ణి.

కొన్ని సంవత్సరాలు అలా గడిచాక, తనకు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో గుమస్తా పదవినుంచి ప్రమోషన్ వచ్చే ఛాన్సు చాలా తక్కువ అనిపించడంతో నాన్నగారు ఇంకో ఉద్యోగంలోకి మారే ప్రయత్నం మొదలుపెట్టారు. అప్పుడు మా ఇంటి పక్క కోటానాగయ్యగారు ఉండేవారు. నాన్నగారు ఆయనతో మాట్లాడితే ఆయన బందరు రెవెన్యూ ఆఫీసులో ఒక ఉద్యోగం ఖాళీగా ఉందని చెప్పారు. అది కూడా గుమస్తా ఉద్యోగమే, కాని దాంట్లో మంచి ప్రమోషన్ ఛాన్సు ఉంటుందని తెలిసి నాన్నగారు బందరు రెవెన్యూ ఆఫీసులో గుమస్తా పదవికి మారిపోయారు.

నా వయస్సు 3 సంవత్సరాలప్పుడు, 1940 శ్రీరామ నవమి రోజున ఒక తమ్ముడు పుట్టాడు. సరిగ్గా శ్రీరామనవమి రోజున పుట్టాడు కనుక వాడికి "శ్రీరామమూర్తి" అని పేరు పెట్టారు, అందరూ వాడిని "శ్రీరాములు" లేక "శ్రీరా" అని పిలిచేవారు. తర్వాత 14 ఏప్రిల్ 1944న ఒక చెల్లెలు పుట్టింది, చైత్ర పౌర్ణమి రోజున. ఈ చెల్లెలు పుట్టినప్పుడు ఇండియాలో స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా ఉండేది. ఈ ఉద్యమంలో సరోజినీనాయుడి పేరు తరచూ దినపత్రికల్లో కనపడేది. మా నాయనమ్మ ఆవిడ కృషిని చాలా మెచ్చుకునేది, ఆవిడ పేరుమీద ఈ చెల్లెలుకి "సరోజిని" అని పేరు పెట్టమని మా అమ్మా నాన్నలను కోరింది, అలానే ఆ పేరు పెట్టారు ఈ చెల్లెలికి.

## 5. నాయనమ్మతో అనుభవాలు

పిల్లల పుట్టుకలతో మా కుటుంబం ఖర్చులు పెరిగిపోతున్నాయి. నేను మొదటి సంతానం కనుక, నామీద మా నాయనమ్మ చాలా ఆశలు పెంచుకుంది. నాకు చెప్తుండేది "నువ్వు మగపిల్లవాడివి, మొదటి సంతానం. మీ నాన్నకేమో గుమాస్తా ఉద్యోగం గనుక జీతం తక్కువ, సంసారం గడవడానికి ఇప్పుడే కష్టంగా ఉంది. మరి ఇంకా పుట్టబోయే పిల్లల్ని ఎలా పోషిస్తాడో! కనుక నువ్వు బాగా చదువుకొని, పెద్దయ్యాక మంచి ఉద్యోగం సంపాదించి మీ నాన్నకు చేదోడు ఇవ్వాలిరా" అని.

మా నాన్నగారి రెవెన్యూ ఆఫీసులో టాప్ బాస్ "కలెక్టర్". ఒకసారి మా నాయనమ్మ నాతో ఇలా అంది "నాయనా! కుటుంబం ఖర్చులు పెరిగిపోతున్నాయి. నువ్వు బాగా చదువుకొని పరీక్షల్లో మంచిమార్కులు తెచ్చుకోవడం అవసరం. ఇలా చేస్తే నీ చదువు అయిపోయాక నీకు కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉంటుంది. చదువు అయ్యాక నువ్వు ఎలా ఐనా కలెక్టర్ ఉద్యోగం సంపాదించి మన కుటుంబాన్ని ఆదుకోవాలి". దీని తర్వాత నేను ఎలా ఐనా కలెక్టర్ అయిపోవాలని కలలు గనడం మొదలుపెట్టాను. ఎవరైనా పెద్దవాళ్ళు "నువ్వు పెద్దయ్యాక ఏమి చెయ్యాలనుకుంటున్నావు బాబూ!" అని అడిగితే, "నేను కలెక్టరు అవుతాను" అని జవాబు ఇచ్చేవాణ్ణి.

వయస్సు పెరుగుతున్న కొద్దీ మా నాయనమ్మకు నా భవిష్యత్తు గురించి వర్రీ ఎక్కువ అయ్యేది. నన్ను చూసినప్పుడల్లా "గోపాలానికి ఏమవుతుందో?" అని వాపోతూ ఉండేది.

1944లో ఒక రోజు నేను నిద్రలేచి పడకగది నుంచి బయటకు వచ్చినప్పుడు, పక్కగదిలో అమ్మ, నాన్న, పందిళ్ళపల్లి నుంచి బంధువులు కొందరు, మాట్లాడకుండా విచారాన్ని సూచించే ముఖాలతో కూర్చొని కనపడ్డారు. వాళ్ళ మధ్య మా నాయనమ్మ పడుకొని ఉంది. నాకు ఏమీ అర్థంకాక "నాయనమ్మ ఇంకా పడుకునే ఉందేమి?" అని అడిగాను. మా అమ్మ నన్ను చేరదీసి "నాయనమ్మ రాత్రి చనిపోయింది గోపాలం, అందుకనే మేమంతా విచారంగా ఉన్నాం. ఆవిడ శవానికి అంత్యక్రియలకు (భూమిలో పాతిపెట్టడం) పందిళ్ళపల్లి నుంచి మీ మామయ్యలు ఇంకొందరు రావాలి, వాళ్ళ రాక కొరకే ఎదురుచూస్తున్నాం" అని చెప్పింది. "చావు" గురించి నేను వినడం అదే మొదటిసారి, అంతవరకూ నేను శవాన్ని చూడలేదు. నాయనమ్మ ఇక ఉండదని తెలిసి నాకు విచారం వేసి చాలా ఏడుపు వచ్చింది.

## 6. పందిళ్ళపల్లి, బందర్‌లలో నా ఎలిమెంటరీ, మిడిల్ స్కూళ్ళ చదువులు

1940లో నాకు 4 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు నన్ను పందిళ్ళపల్లిలో మా తాతగారి ఇంటికి దగ్గర్లో ఉన్న ఎలిమెంటరీ స్కూలు (సుబ్బారావు పంతులుగారి బడి)లో చేర్పించారు. స్కూలులో ఒక్కడే టీచరు, ఆయన పిల్లలకు తెలుగు అక్షరాలు నేర్పించి తెలుగు పదాలని బోధించేవాడు. నాకు అప్పటికే మా అమ్మ తెలుగు అక్షరాలు నేర్పించడం మొదలుపెట్టింది మా ఇంట్లో. స్కూలు మా తాతగారి ఇంటికి చాలా దగ్గర్లో ఉన్న తెల్లటి ఇసుక తిన్నెమీద ఉండేది. అప్పుడు మా ఊర్లో అక్షరాలు దిద్దడానికి పిల్లలకు పలకా, బలపాలు ఉండేవి కావు. మేము విద్యార్థులం ఇసకలో వేలితో అక్షరాలు దిద్దేవాళ్ళం.

అప్పుడు నేను తాతగారి ఇంట్లోనే ఉండేవాణ్ణి. మా తాత గుత్తి నాగభూషణంగారిది జాయింట్ ఫ్యామిలీ, వాళ్ళు 5గురు అన్నతమ్ముళ్ళు. అందరూ కలిసి “గుత్తి రామయ్య & సన్స్” అని ఒక కంపెనీ పెట్టి నడుపుతుండేవాళ్ళు. (గుత్తి రామయ్యగారు మా తాత నాగభూషణంగారి తండ్రి, వారికి మొత్తం ఐదుగురు కొడుకులు). ఈ కంపెనీ నూలు పలురంగులలో అద్దకం చేసి, ఆ రంగునూళ్ళతో ఊరిలో బోలెడు చేనేత కుటుంబాలతో రంగుల రంగుల గుడ్డలుగా నేయించి, వాటిని బేల్సులా పాక్ చేసి, ఆ బేల్సుని ఆఫ్రికా మొదలైన ఖండాల్లో పలుదేశాలకు ఎగుమతి చేసే కంపెనీలకు అమ్మేవారు.

తాతయ్యలందరికీ బోలెడుమంది పిల్లలు, అంతా సమిష్టి కుటుంబంగా ఉండేవాళ్ళం. కొందరు తాతయ్యలకు భార్యలు చనిపోతే, రెండవ పెళ్ళిళ్ళు జరిగాయి కూడా. మేము పిల్లలందరం చాలా కలుపుగోలుగా ఉంటూ, కలిసి చదువుకుంటుండేవాళ్ళం. ఆ వయస్సులో నాకు మా తాతగారి ఇంట్లో చాలా బాగా కాలక్షేపం అయ్యింది. ఇప్పుడు గుత్తి రామయ్యగారి మనవళ్ళు, మునిమనవళ్ళు వగైరా సుమారు 250 మంది పైనే ఉంటారు. వీళ్ళందరూ ప్రపంచంలో పలుదేశాలలో నివసిస్తూ, ఇప్పటికీ స్నేహంగా ఉంటున్నారు.

నేను పందిళ్ళపల్లి ఎలిమెంటరీ స్కూలులో చదువుకుంటున్నప్పుడు (నా వయస్సు అప్పుడు 5 సంవత్సరాలు ఉండవచ్చు) జరిగిన ఒక సన్నివేశం నాకు ఇంకా గుర్తుంది. ఆ కాలంలో పందిళ్ళపల్లికి దగ్గర్లో సినిమా థియేటర్లు ఉండేవి కావు. అప్పుడప్పుడూ టూరింగ్ టాకీస్ ఒకటి వచ్చేది. వచ్చినప్పుడు వాళ్ళు ఊరికి దగ్గర్లో ఖాళీ స్థలంలో ఒక పెద్ద డేరా కట్టి డేరా లోపల రాత్రిళ్ళు సినిమా చూపిస్తూండేవారు. ఆలాంటి సినిమాకు మేము (నాన్న, అమ్మ, నానమ్మ, నేను) ఒక రోజు వెళ్ళాం. అది ఒక పౌరాణిక సినిమా. ఒక సీనులో కృష్ణుడు మురళీగానం చేస్తూ కనిపించాడు. ఆ రోజుల్లో మా అమ్మ ఎప్పుడూ ఒక కృష్ణుడి విగ్రహానికి పూజ చేస్తూండేది గదా. కృష్ణుణ్ణి తెరమీద చూడగానే నిజంగా కృష్ణుడే వచ్చి మా ముందు మురళి వాయిస్తున్నాడనుకున్నాను నేను. కనుక గట్టిగా “అమ్మా, నాయనమ్మా, కృష్ణుడు వచ్చాడు. మన ముందే మురళి వాయిస్తున్నాడు. చూస్తున్నారు గదా! మనం ఆయన దగ్గరకు వెళ్ళి దణ్ణం పెట్టుకుందాం రండి” అంటూ అరుస్తూ గోల చేశాను. అమ్మా, నాన్న “అది కృష్ణుడి బొమ్మే బాబూ, గోల చెయ్యకుండా కూర్చో” అంటూ గదమాయించారు. “అదేమిటమ్మా, చూడు మురళి వాయిస్తున్నాడు, మీకు కనపడటం లేదా?” అని నేను అరిచాను. మా నాన్న నన్ను ఒళ్ళోకి తీసుకొని, తన చేతులతో నా నోరు మూసేశారు. వాళ్ళు అలా ఎందుకంటున్నారో నాకు అర్థం కాలేదు, కానీ నేను ఏమీ చెయ్యలేకపోయాను. సినిమా అయిపోతుండగా చివరి సీనులో నన్ను “నీకు చూపెడ్తాను రారా” అంటూ స్క్రీను వెనక్కు తీసుకువెళ్ళారు నాన్న. అక్కడ కూడా స్క్రీనుపై కృష్ణుడు కనపడతున్నా, నిజం మనుషులు ఎవరూ లేరు. మా నాన్నగారు “అవి కదిలే బొమ్మలే బాబూ, సినిమా అంటే కదిలే బొమ్మలతో నాటకంలా కథని చూపించడమే” అని వివరంగా చెప్పారు, నాకు అర్థమయ్యేలా. దీన్ని గురించి ఇప్పుడు గుర్తు తెచ్చుకుంటే నాకు ఇంకా నవ్వు వస్తుంది.

ఆ రోజుల్లోనే జరిగిన ఇంకొక్క విషయం గురించి చెప్తాను. ఒక రోజు గాంధీగారు మద్రాసు నుంచి ఢిల్లీకి రైలులో ప్రయాణం చేస్తారని తెలిసింది. ఈ రైలు వెళ్ళే ట్రాక్ మా పందిళ్ళపల్లి గ్రామం పక్కనే ఉంది, అది మా ఊరి ప్రాంతాన్ని మధ్యాహ్నం సుమారు 1 గం॥కు పాసు అవుతుందని తెలిసింది. మేమంతా 12.30 ని॥కు ముందే వెళ్ళి ఆ ట్రాక్ పక్కన నుంచున్నాం. గాంధీగారు కిటికీ గుండా చూస్తూ కనిపిస్తారని మా ఆశ. ట్రాక్‌కి

ఎటువైపు నుంచి గాంధీగారు చూస్తుంటారో మాకు తెలియలేదు. కొందరు అటూ, కొందరు ఇటూ నుంచొని చూస్తున్నాం. ట్రైన్ చాలా స్పీడుగా వెళ్ళిపోయింది. నాకు గాంధీగారు కనపడలేదు. అవతలివైపు నుంచున్నవారు కొందరు గాంధీగారులాంటి ఆయన కనపడ్డారని చెప్పారు.

పందిళ్ళపల్లి ఎలిమెంటరీ స్కూలులో చదువు అయ్యాక, 1942 జులైలో నన్ను బండ్ల బాపయ్య సెకండరీ స్కూలు, వేటపాలెంలో చేర్పించారు. అప్పుడు మా తాతగారి ఇంటి నుంచి చాలామంది పిల్లలు ఆ స్కూలులో చదువుకునేవారు. మా తాతగారి ఇంటి నుంచి ఆ స్కూలు 2 మైళ్ళు పైనే దూరం. పందిళ్ళపల్లి నుంచి వేటపాలానికి ఒక రోడ్డు ఉంది, రోడ్డుకి రెండు వైపులా చాలా పెద్ద మర్రి, అత్తి, జువ్వి, రావి చెట్లు ఉండేవి. ఆ అత్తి చెట్లకు కింది భాగంలోనే బోలెడు అత్తికాయలు గుత్తులు గుత్తులుగా కాసి ఉండేవి. ఈ చెట్ల తర్వాత రోడ్డుకి రెండువైపులా జీడిమామిడి, మామిడి తోటలు ఉండేవి. అందమైన ఈ చెట్లని చూసుకుంటూ మేము హాయిగా పొద్దున్న స్కూలుకి నడిచి, మళ్ళీ సాయంత్రం ఇంటికి నడుచుకొని వచ్చేసేవాళ్ళం. స్కూలులోనే మాకు భోజనం పెట్టేవారు. సాయంత్రం పూట ఇంటికి నడుచుకొని వచ్చేటప్పుడు, దారిలో పెద్ద సైజు అత్తికాయలు కొన్ని కోసుకొని ఇంటికి తెచ్చేవాణ్ణి. అమ్మమ్మలు వాటితో చాలా రుచికరమైన కూర చేసేవారు.

ఈ స్కూలులో విద్యార్థులు ఒకసారి ఒక నాటకం వేశారు. దాంట్లో నాకు ఒక చిన్న పాత్ర ఇచ్చారు. నాకంటే పెద్దవాడు అయిన ఒక మామయ్య, గుత్తి రామమూర్తి (మా పెద తాతయ్య కొడుకు)కి చాలా మేజర్ రోల్ ఇచ్చారు. నాటకం పేరు "జామాతా దశమగ్రహః". దీంట్లో రామమూర్తి చాలా పొడుగాటి సంభాషణ చెయ్యాలి. అతను తన సంభాషణలన్నీ చాలా రోజుల ముందరే బట్టీ పట్టడం మొదలెట్టాడు. మా ముందు చాలాసార్లు తన సంభాషణలను వల్లించి చెప్పాడు. కనుక మాకు కూడా అతని పొడుగాటి సంభాషణ కంఠతా వచ్చేసింది.

చివరకు నాటకం రోజు వచ్చేసింది. నాటకం మొదలయ్యింది. రామమూర్తి పొడుగాటి సంభాషణ వరకూ అంతా బాగానే జరిగింది. రామమూర్తి ఆ సంభాషణ మొదటి రెండు వాక్యాలు బాగానే చెప్పాడు. దాని తర్వాత భాగం అప్పుడు గుర్తు తెచ్చుకోలేకపోయాడు, అందుకని కాసేపు నిశ్శబ్దంగా నిల్చున్నాడు. ఇది గ్రహించి, తన పక్క నటుడు తర్వాతి వాక్యాన్ని రామ్మూర్తికి గుర్తుచెయ్యడానికి (ప్రాంప్టింగు) ప్రయత్నించాడు మెల్లగా, కానీ రామ్మూర్తి అది గ్రహించలేదు. కాసేపు నిశ్శబ్దంగా నిల్చొని, ఇంకేం చెయ్యడానికి తోచక రామమూర్తి తర్వాతి పోర్షన్ మాట్లాడడం మొదలెట్టాడు. మిగతా నాటకమంతా బాగానే జరిగింది అందరూ నాటకం బాగుందని మెచ్చుకున్నారు.

బండ్ల బాపయ్య సెకండరీ స్కూలు తర్వాత, 1945 ఏప్రిల్‌లో నేను బందరు తిరిగి వచ్చేశాను. 1945 జూలైలో నేను బందరు హిందూ కాలేజీ మిడిల్ స్కూలు, రామానాయుడు పేటలోని ఆర్. బ్రాంచిలో మిడిల్ స్కూలులో చదవడం మొదలుపెట్టాను. అది నక్కలతోటలో మా ఇంటి నుంచి సుమారు మైలు దూరంలో ఉంది. రోజూ నడకతోనే స్కూలుకి వెళ్ళి వస్తుండేవాణ్ణి.

ఆపాటికి మన పూర్వీకుల కల్చర్‌ని గురించి నేను కొంత తెలుసుకున్నాను, ఇంకా ఆ కల్చర్‌ని గురించి బాగా తెలుసుకోవాలనే ఉత్సాహం కల్గింది. దీనివల్ల మిడిల్ స్కూలు కరిక్యులంలో తెలుగు భాష బదులు,

సంస్కృతం తీసుకోవచ్చు అని తెలిసినప్పుడు, మా అమ్మను "అమ్మా, తెలుగు బదులు నేను సంస్కృతం తీసుకోవచ్చా?" అని అడిగాను. మా అమ్మ "తప్పకుండా బాబూ, సంస్కృతమే తీసుకో" అని చెప్పింది.

మా నాన్నగారికి నామీద ఎప్పుడైనా కోపం వస్తే నన్ను "మల్లప్పా" అని సంబోధిస్తూ తిట్టేవారు. ఈ పదం ఇంకెవ్వరూ వాడడం నేను వినలేదు.

1945 చివరన మా నాన్నగారిని ప్రమోషన్ మీద కైకలూరు రెవెన్యూ ఆఫీసులో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా పోస్టు చేశారు. అప్పుడు నేను బందరు హిందూ కాలేజి సెకండరీ స్కూలు ఆర్. బ్రాంచిలో మొదటి ఫారం చదువుకుంటున్నాను. కుటుంబం కైకలూరికి మారినప్పుడు, నేను ఏమి చెయ్యాలి అనే సమస్య వచ్చింది మా నాన్న అమ్మలకు. అందుకని ముందు మా నాన్నగారు తనే కైకలూరు వెళ్ళి అక్కడ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా జాయిన్ అయ్యి, మా కుటుంబం ఉండడానికి మంచి ఎపార్ట్‌మెంటు కొరకు వెదకడం మొదలుపెట్టారు. ఆయన కైకలూరులో ఎపార్ట్‌మంటు తీసుకునేటప్పటికి ఆర్–బ్రాంచిలో ఆ టర్మ్ పూర్తయిపోయి, సంవత్సరంకి చివర ఉండే సెలవులు మొదలయ్యాయి. అప్పుడు అమ్మ, నేను మిగతా పిల్లలతో బాటు కైకలూరికి మారిపోయాం. నేను నా చదువుకని కైకలూరు మిడిల్ స్కూలులో చేరాను.

## 7. మా కుటుంబం కైకలూరుకి మారడం

కైకలూరులో మొదట మా కుటుంబం ఊరుకి పక్క కొంచెం దూరంలో, కొద్ది ఎత్తులో కట్టిన ఒక పెద్ద భవనంలో అద్దెకు ఉండేవాళ్ళం. దానికి దగ్గర్లో ఇంకేవీ ఇళ్ళు ఉండేవి కావు, చుట్టూతా పొలాలే. కొద్ది దూరంలో రైల్వే ట్రాకు ఉండేది. ఆ ట్రాకుమీద రోజుకి ఒకటో, రెండో రైళ్ళు మాత్రం వెళ్తుండేవి. ఇల్లు దూరంగా ఉంది కాబట్టి, అందరూ దాన్ని "దెయ్యాలకొంప" అని పిలిచేవారు. దగ్గర్లో ఇంకేవీ ఇళ్ళు లేకపోవడం మూలానా, మా నాన్నగారు బయట ఊళ్ళకు కేంపులో ఉద్యోగరీత్యా తరచూ వెళ్ళాల్సి వచ్చేది గనుకా, మా అమ్మకు ఆ ఇంట్లో ఉండడం భయంగా ఉండేది. అందుకని తనకు తోడుగా ఉండడానికి తన సొంత చెల్లెలు తులసీ నాగమ్మను పుట్టింటి నుంచి తెచ్చుకుంది మాతో ఉండడానికి.

తులసీ నాగమ్మను అందరూ "నాగమ్మ" అని పిలిచేవారు. వయస్సులో తను నాకన్నా 3, 4 ఏళ్ళు పెద్ద. తనకు అప్పుడే పెళ్ళయిపోయింది, కానీ ఇంకా కార్యం కాలేదు. ఆ దెయ్యాలకొంపలో, పిల్లలైన మాతో తను బాగా కలిసిపోయింది. నాకు పెద్దక్కలా ఉండేది. వంటగదిలో మా అమ్మకు బాగా సహాయం చేసేది, వంటగదిలో పని లేనప్పుడు తను మాతో చక్కగా ఆడుకునేది.

నాగమ్మ భర్త పేరు "కర్ణ బాలగంగాధర్ తిలక్". మేమంతా ఆయన్ను "తిలక్ బాబాయి" అని పిలిచేవాళ్ళం. ఆయన మిలటరీ ఇంజనీరింగ్ సర్వీసులో, ఇండియాకు ఉత్తర సరిహద్దు ప్రాంతం, భూటాన్‌లో పని చేస్తుండేవాడు, భారత ప్రభుత్వం చేస్తున్న రోడ్ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్ట్‌కి.

మేము ఆ దెయ్యాలకొంపలో ఉంటున్నప్పుడు, తిలక్ బాబాయి ఒకసారి వచ్చి మమ్మల్ని విజిట్ చేశాడు. అప్పుడు ప్రొద్దున్న ఆయన ముందు గదిలో కూర్చొని ఉన్నాడు, మేము పిల్లలందరం కింద కూర్చొని, ఆయన చెప్తున్న భూటాన్ ప్రాంతపు విశేషాలు వింటున్నాం. కానీ నాగమ్మ మాతో ఆ గదిలో లేదు. తను ఎక్కడుందా

అని నేను చూస్తే, తను వెనకాల ఉన్న తలుపు చాటుగా దాక్కొని చూస్తోంది. తనని కూడా రమ్మని నేను చేత్తో సైగ చేశాను, కానీ తను రాలేదు. అప్పుడు నేను తన దగ్గరకు వెళ్ళి రమ్మని అడిగాను. దానికి తను "నీకు అర్థం కాదు లేవోయ్ గోపాలం, నేను నీతో రాలేను ఇప్పుడు" అని గుసగుసలాడింది. తను తిలక్ బాబాయి ముందు ఎందుకు రావడం లేదో నాకు అర్థంకాక ఆశ్చర్యపడ్డాను అప్పుడు.

దెయ్యాల కొంపలో ఆడుకోడానికి బోలెడు స్పేసు ఉండడం, రోజూ వచ్చేపోయే 2, 3 రైళ్ళు పిల్లలమైన మాకు చాలా నచ్చింది. కానీ దగ్గర్లో ఇంకేవీ ఇళ్ళు లేకపోవడం మూలాన, మా అమ్మకు మరీ ఒంటరిగా ఉన్నట్లనిపించడం వలన నచ్చలేదు. అందుకని మేము ఊళ్ళో ఒక చిన్న ఎపార్ట్‌మెంటుకి మారాం. అది రెండు ఎపార్టుమెంట్లు పక్క పక్కన ఉన్న ఒక భవనంలో ఉంది. మా పక్క ఎపార్ట్‌మెంట్‌లో ఒక రాజుల కుటుంబం ఉండేవారు. దగ్గర్లో ఒక పెద్ద చెరువు ఉండేది. చెరువు చుట్టూరా ఒక వెడల్పైన ఎత్తు గట్టు. గట్టు మీద చాలా చెట్లు ఉండేవి, ఆ గట్టుమీద చెరువు అంచుకి పైన ఒక రోడ్డు ఉండేది, ఆ అంచుకి కుడి, ఎడమవైపుల చెరువుకి రేవులుండేవి, ప్రజలు ఈ రేవుల్లో బిందెలతో నీళ్ళు తీసుకొని వెళ్తుండేవారు. రేవులో దిగితే చెరువు బాగా లోతుగా ఉంటుందని తెలుస్తుంది. నేను తరచూ రేవులో దిగి చెరువు నీళ్ళలో కొంతసేపు నిల్చొని వస్తుండేవాణ్ణి.

చెరువులో చాలా చేపలు ఉండేవి. వలలు వేసి చెరువులో చేపలు పట్టడం నేను చాలాసార్లు చూశాను. ఇలా పట్టిన చేపలు, గిలగిలా కొట్టుకుంటూ ఉండడం చూస్తే నాకు చాలా బాధ కల్గేది.

కైకలూరుకి దగ్గర్లో ఇలాంటి చెరువులు చాలా ఉండేవి. ఆంధ్రప్రదేశ్‌లో అన్నిటికంటే పెద్దదైన "కొల్లేరు సరస్సు" కైకలూరుకి దగ్గర్లో ఉండేది. కనుక కైకలూరులో చేపలు విరివిగా దొరికేవి. మా కుటుంబంలో నేను శాకాహారిని, కానీ మిగతా అందరూ మాంసం తినేవారు. మా నాన్నగారికి చేపల పులుసు చాలా ఇష్టం కనుక మా ఇంట్లో మా అమ్మ చేపల పొలుసులు తీసి, శుభ్రం చేసి వండడం తరచూ చూసేవాణ్ణి.

ఒకసారి మా కుటుంబం కొల్లేరు సరస్సు మీద విహారయాత్రకు వెళ్ళాం. మా నాన్నగారు ఒక హౌస్‌బోట్‌ని మా యాత్రకు అద్దెకు తీసుకున్నారు ఒక పడవ నడిపేవాడితో. దాంట్లో మా కుటుంబం బయలుదేరాం. సరస్సు మధ్య ఒక ద్వీపం ఉండేది. ఆ ద్వీపంలో కొల్లేరు దేవత గుడి ఉండేది, ఆ గుడికి వెళ్ళి కొల్లేరు దేవత దర్శనం పొందడం మా గమ్యం. సరస్సులో కొద్దిగా వెడల్పుగా ఉండే పొడుగాటి ఆకులతో రెల్లుగడ్డిలాంటివి పెరుగుతూ ఉన్నాయి. ఈ రెల్లు పొదలగుండా దూసుకుంటూ మా పడవ చాలా వేగంగా వెళ్ళింది, ఆ రెల్లుపొదల్లో నీటికొంగలు, బాతులు బోలెడు చూశాం. మా పడవను చూసి అవి భయంతో ఎగిరిపోయేవి, దారిలో మేము పిల్లలం రెల్లు ఆకులని కోసుకొని, వాటిని ఒకవైపు చేత్తో పట్టుకొని, రెండోవైపు సరస్సు నీటిలో పెడితే, పడవ వెంట అవి చిన్న కెరటాలు లేపుతూ ఉండేవి. ఇలా రెల్లుగడ్డితో పడవ ప్రయాణం పొడుగూతా పిల్లలం చాలా రకాల ఆటలు ఆడుకుంటూ ఆనందించాం. సాయంత్రం ద్వీపం చేరుకున్నాక కొల్లేరు దేవత దర్శనం చేసుకొని, అక్కడ దొరికిన భోజనం భోంచేసి, రాత్రి అక్కడే పడుకొని, మర్నాడు పడవ మీద తిరుగు ప్రయాణం మొదలెట్టి కైకలూరు వచ్చేశాం.

మా పోర్షన్ పక్క పోర్షన్‌లో ఉన్న రాజుల కుటుంబానికి ఒక టీనేజ్ కొడుకు ఉండేవాడు. నాకు అప్పుడు 10 లేక 11 సంవత్సరాలు, ఆ అబ్బాయికి 16-17 సంవత్సరాలు ఉండేవి. రోజూ ఆ అబ్బాయికి వాళ్ళ

నాన్నగారు “నువ్వు బాగా చదువుకొని మీ క్లాసులో అందరికంటే ఎక్కువ మార్కులతో పాసు అవ్వాలిరా” అంటూ తెగ చెప్పేవారు. అతన్ని బయటకు వచ్చి మిగతా పిల్లలతో ఎప్పుడూ ఆడుకొనిచ్చేవారు కాదు. నేను, చుట్టూ ఉండే మిగతా పిల్లలూ చెరువు దగ్గరా, ఇతర చోట్లా తిరుగుతూ ఆడుకునేవాళ్ళం. కానీ ఆ రాజుల అబ్బాయి ఎప్పుడూ బయటకు వచ్చి తిరగడం నేను చూడలేదు.

ఒకసారి మిడ్ టర్మ్ పరీక్షల పేపర్లు తిరిగి ఇచ్చారట. ఆ అబ్బాయికి ఆ పరీక్షలో ఎక్కువ మార్కులు రాలేదట. వాళ్ళ నాన్నకు అది చూసి చాలా కోపం వచ్చింది. ఆ అబ్బాయిని లోపల గదికి తీసుకువెళ్ళి బెత్తంతో కొట్టడం బయటనుంచి నేను చూశాను. ఆ సాయంత్రం ఆ అబ్బాయి బయట వరండాలో పడకకుర్చీలో విచారంగా కూర్చొని ఉండడం చూస్తే, అతని మీద నాకు చాలా జాలి కల్గింది. నేను చిన్నవాణ్ణి అయినా, అతనితో పోల్చుకుంటే నా తల్లిదండ్రులు ఎప్పుడూ నన్ను పరీక్షల్లో మార్కుల గురించి అడగనూ లేదు, వేధించనూ లేదు.

అప్పుడు మా నాన్నగారు తరచూ కేంపులకి వెళ్తుండేవారు. అలా వెళ్ళినప్పుడు, వెళ్ళిన ఊరునుంచి అక్కడ ఏవైనా కొత్త కాయగూరలూ అవీ కనపడితే వాటిని తెచ్చేవారు. ఒకసారి కేంపు నుంచి దట్టమైన ఊదారంగు దుంపలు పట్టుకొచ్చారు. “అవేంటి నాన్నా”అని అడిగితే, ఆ దుంపపేరు “బీట్‌రూట్” అంటారు అని చెప్పారు. అలానే ఇంకోసారి, లేత ఆకుపచ్చ రంగులో ఉన్న కాయగూరలను తెచ్చారు.“ఇవి బెంగుళూరు వంకాయలు” అని చెప్పారు. ఈ కాయగూరలను చూడడం అదే మొట్టమొదటిసారి నాకు.

1946, 47 సంవత్సరాలలో కైకలూరు మిడిల్ స్కూలులో నేను 2వ, 3వ ఫారమ్ చదువులు పూర్తి చేసాను. 1947 జూలైలో నేను హైస్కూలు చదువు (4వ, 5వ ఫారమ్ & ఎస్.ఎస్.ఎల్.సి.) మొదలెట్టాలి. ఈ హైస్కూల్ చదువు నేను ఎక్కడ సాగించాలి అనే సమస్య వచ్చింది అప్పుడు. మా నాన్నగారికి త్వరలో కైకలూరు నుంచి ట్రాన్స్‌ఫర్ అవుతుందని తెలుసు. అందుకని నన్ను బందరు హిందూ కాలేజి హైస్కూల్‌లో చదివించడానికి మా నాన్నగారు నిశ్చయించారు. నేను మా బందరు ఇంట్లోనే ఉండేట్లు ఏర్పాటుచేసి, పక్కన ఒక ముసలమ్మ నడిపిస్తున్న మెస్‌లో నా తిండికి ఏర్పాటు చేసారు. నేను బందరులో చదువుకుంటూ, సెలవులు వచ్చినప్పుడల్లా రైలులో కైకలూరు వెళ్ళి వస్తుండేవాణ్ణి. కైకలూరికి, బందరుకీ మధ్య గుడివాడలో రైలు మారాలి. ఈ ప్రయాణాలు నాకు ఇప్పటికీ బాగా గుర్తున్నాయి.

1946 జనవరి 13 భోగిపండగ రోజున మా అమ్మకు ఇంకొక అబ్బాయి ఒక వంకర కాలితో పుట్టాడు. మా నాన్న తండ్రిగారి పేరు “స్వామి కోటయ్య”. ఆ తాతయ్య పేరుమీద, నక్కలతోటలో సాయిబాబా గుడి పేరుమీదా, ఈ తమ్ముడికి “సాయి స్వామికోటయ్య” అని పేరు పెట్టారు. అప్పటికి కుటుంబంలో మేము నలుగురు పిల్లలం అయ్యాం (నేను, శ్రీరాములు, సరోజిని, ఈ కొత్త తమ్ముడూ). ఈ కొత్త తమ్ముణ్ణి అందరం “సాయి” అని పిలవడం మొదలుపెట్టాం.

డాక్టర్ల సలహామీద సాయికి నెలల వయస్సులోనే వంకర పాదం మామూలుగా చేసే సర్జరీ కైకలూరికి దగ్గర ఆకువీడు ఆస్పత్రిలో చేయించారు. సర్జరీ తర్వాత ఆ కాలుకి కట్టు కట్టారు. ఆ కట్టుతో కొన్ని నెలలు ఆ చిన్ని తమ్ముడు చాలా బాధపడ్డాడు, కాని అది హీల్ అయ్యాక, పిల్లవాడు మామూలుగా నడక నేర్చుకోవడం

చూసి మా అందరికీ చాలా సంతోషం కల్గింది. చంటి వయస్సులోనే ఈ సర్జరీ చేయించడం మా అమ్మా నాన్నల చాలా మంచి నిర్ణయం.

## 8. మా కుటుంబం మళ్ళా బందరుకి మారడం

1948లో మా నాన్నగారికి కైకలూరు నుంచి మళ్ళీ బందరుకి ట్రాన్స్‌ఫర్ అయ్యింది, అప్పుడు మా కుటుంబం అంతా మళ్ళీ బందరుకి మారిపోయాం. 1948-49లో బందరులోని మా పూరిల్లు తీసేసి, డాబా వేయించారు మా నాన్న.

బందరు తిరిగి వచ్చాక మా అమ్మకు దైవభక్తి బాగా ఎక్కువైంది. ఆ సమయంలో తనకు మా ఇంటికి దగ్గర్లో నివసించే హిందూ కాలేజి లెక్చరర్ కృష్ణస్వామిగారి భార్య కనకలక్ష్మిగారి పరిచయం అయ్యింది. మా అమ్మ ఆవిడను "అమ్మగారూ" అని పిలిచేది. కనకలక్ష్మమ్మగారికి మా బందరులోనూ, చుట్టుపక్కల ఉన్న చిలకలపూడి వగైరా ఊర్లలోనూ చాలామంది శిష్యురాళ్ళు ఉండేవారు. వీళ్ళు తరచూ కలుసుకొని ఆవిడ ఆధ్యాత్మిక సందేశాలను వింటుండేవారు. వీళ్ళ చర్చలు సాధారణంగా మధ్యాహ్నం లంచ్ తర్వాత జరుగుతూండేవి, ఆ టైములో భర్తలు ఆఫీసులో ఉంటారు, పిల్లలు స్కూళ్ళల్లో ఉంటారు గనుక. అప్పుడు వీళ్ళంతా ఎవరో ఒకరి ఇంట్లో కలుసుకొని ఆధ్యాత్మిక చర్చలు కొనసాగించేవారు.

బందరులో ఉన్న రోజుల్లో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో మా అమ్మ నోములు నోచుకునేది. నోముకి మెత్తటి శ్రావణమాసపు కొబ్బరి బూరెలు చేసేది. ఇవి నాకు చాలా నచ్చేవి. అవి తింటూంటే నాకు చాలా హాయిగా ఉండేది.

ఆ రోజుల్లోనే మా అమ్మ కజిన్ బ్రదర్, తాతాచార్యులు మామయ్య, అద్భుతంగా తెలుగు సినిమా పాటలు పాడేవాడు. ఆయన మా ఇంటికి వచ్చినప్పుడల్లా అమ్మ, పిల్లలందరం కూర్చొని ఆయన చేత పాటలు పాడించుకునేవాళ్ళం.

నక్కలతోటలో చిన్న సాయిబాబా గుడి ఉండేది. ఈ గుడికి చిద్ఘనానంద స్వామివారు వచ్చి, పురాణ కాలక్షేపాలు చేసేవారు. కొన్ని సంవత్సరాలపాటు ఆయన బందరు వచ్చినప్పుడు, మా ఇంటికి భోజనానికి వచ్చేవారు. ఆ గుళ్ళో బావికి మా నాన్నగారు తన డబ్బుపెట్టి నానమ్మ పేరున చట్రం కట్టించారు.

నేను బందరు హిందూ హైస్కూల్లో చదువుకునే రోజుల్లో నా క్లాసుమేటు పైనూరి హరిప్రసాద్‌తో పరిచయం అయ్యింది. వీళ్ళు తమిళులు, ఇంట్లో తమిళం మాట్లాడుకునేవారు, కానీ తెలుగు ప్రాంతంలో చాలా కాలం నుంచి ఉండడం మూలాన తెలుగు బాగా నేర్చుకున్నారు, అతను తెలుగు క్లాసు తీసుకునేవాడు. అందరూ అతన్ని "హరి" అని పిలిచేవారు. వీళ్ళు నక్కలతోటలోనే మా వీధికి పక్క వీధిలో ఉండేవారు. హరి, అతని తల్లి పాండురంగ విఠలుడి భక్తులు. నక్కలతోటకు 2 మైళ్ళ దూరంలో ఉండే చిలకపూడిలో పెద్ద పాండురంగడి గుడి ఉంది. ఆ గుడి కట్టిన మహాభక్తుడు భక్త నరసింహంగారు. హరి వాళ్ళ అమ్మకు భక్త నరసింహంగారు గురువు. అందుకని ప్రతిరోజూ వీలు చూసుకొని హరి పాండురంగడి గుడికి వెళ్ళి, ఆ విఠలుడిని, భక్త నరసింహంగారినీ దర్శనం చేసుకునేవాడు. నక్కలతోటకూ, చిలకలపూడికీ మధ్య రోడ్డుకి రెండువైపులా ఆ

కాలంలో చక్కటి అడవి ప్రాంతం, ఎన్నో రకాల పెద్ద పెద్ద చెట్లు పెరుగుతుండేవి, వాటిమీద ఎన్నో పిట్టలు ఎప్పుడూ కిలకిలారావాలు చేస్తుండేవి. ఆ దృశ్యాలు నాకు ఎంతో నచ్చేవి, కనుక నేను కూడా ప్రతి రోజూ హరితో పాండురంగడి గుడికి వెళ్ళడం మొదలుపెట్టాను. దారిలో హరి తను తెలుగు క్లాసులో నేర్చుకున్న తెలుగు పద్యాలు చక్కగా చదివి వినిపించేవాడు. నేను కొత్తగా విన్న కబుర్లు, చదివిన కథలూ హరికి చెప్పేవాణ్ణి.

భక్త నరసింహంగారికి ముగ్గురు అబ్బాయిలు, కొందరు అమ్మాయిలు, ఆయనకు మొత్తం 9 మంది పిల్లలని నాకు గుర్తుంది. పెద్దబ్బాయి ఏదో బిజినెస్ చేస్తుండేవాడు. కానీ మిగతా ఇద్దరు అబ్బాయిలూ గుళ్ళో దేవుడు విగ్రహాల దగ్గర పూజారిల్లాగా కూర్చొని, దర్శనానికి వచ్చిన భక్తులకు సహాయకులుగా పని చేస్తుండేవారు. భక్త నరసింహంగారి పిల్లలందరికీ అప్పుడే పెళ్ళిళ్ళయిపోయి వాళ్ళ సంసారాలు వాళ్ళు గడుపుతున్నారు.

భక్త నరసింహంగారు మాకు భక్తతుకారాం, నామ్‌దేవ్ మొదలైన పాండురంగడి భక్తుల చరిత్రలు చెప్పి, మమ్మల్ని కూడా పాండురంగడి భక్తులు కమ్మని బోధించేవారు. ఈ బోధనలతో క్రమేపీ నేను కూడా గొప్ప పాండురంగడి భక్తుణ్ణి అవ్వాలని కలలు కంటుండేవాణ్ణి.

కనకలక్ష్మమ్మగారి శిష్యబృందానికి గూడా భక్త నరసింహంగారి బోధనలు అందాయి. మా అమ్మ కూడా కొందరు శిష్యులతో కలిసి తరచూ వీలు చూసుకొని పాండురంగడి గుడికి వెళ్ళి వస్తుండేది. గుళ్ళో భక్త నరసింహంగారు వీళ్ళకు భగవద్గీత 2వ అధ్యాయంలోని శ్లోకాలు వాటి అర్థాలు బోధించేవారు. దానిలో మా అమ్మ పూర్తిగా లీనమైపోయేది, తన కంటి నుండి కారే అశ్రుధారల స్పృహ కూడా ఉండేది కాదు తనకు అప్పుడు.

ఒక రోజు హరి, నేను పాండురంగడి గుడికి వెళ్తున్నప్పుడు హరి తను వాళ్ళమ్మతో కలిసి రచించిన ఒక పద్యం వినిపించాడు.

**చంద్రభాగా తీర నివాసాయ**

**పండరీపుర వాసినే**

**భక్త నరసింహ ప్రియ దైవాయ**

**పాండురంగ విఠ్ఠలాయ నమో నమః**

నాకు చాలా నచ్చింది, నా స్నేహితుడు తల్లి సహాయంతో అంత చక్కటి పద్యం రచించాడని నేను చాలా మెచ్చుకున్నాను అతన్ని.

పండరీపురం మహారాష్ట్రలో ఉంది. పాండురంగడి భక్తులు ముఖ్యంగా ఆ రాష్ట్రంలోనే ఉండేవారు. గుడికి నిధులు సేకరించడానికి భక్త నరసింహంగారు అక్కడ నుంచి భక్తులను ఇక్కడకు తీసుకువచ్చి, వాళ్ళ చేత పూజలు, ప్రవచనాలు జరిపిస్తూ, వాటికి బాగా డబ్బున్న ధనవంతులని ఆహ్వానించేవారు. ఇలా వచ్చినప్పుడు ఆ మహారాష్ట్ర భక్తులు చాలా రోజులు గుళ్ళోనే ఉండేవారు. వాళ్ళ మొదటి ప్రోగ్రాం త్వరగా తెలుగు నేర్చుకోవడం, తెలుగులో చక్కటి ప్రవచనాలు ఇవ్వగలగడం. ఒకసారి ఇలా వచ్చిన భక్తుడు ఒకతను నాతోనూ, హరితోనూ

వీలు చూసుకొని మాట్లాడేవాడు. మాట్లాడడానికి నాకు అప్పుడు తెలుగు మాత్రమే తెలుసు, హరికి తెలుగు, తమిళం మాత్రమే తెలుసు. మేము ఆయనతో తెలుగులో సంభాషించి, ఆయనకు చాలా తెలుగు పదాలు, పలుకులూ నేర్పించాం.

ఇలా భక్త నరసింహంగారు స్వయంకృషితో నిధులు సేకరించి ఇంత మంచి, పెద్ద గుడిని కట్టించి, దాన్ని చాలా బాగా నడపడం చాలా మెచ్చుకోదగ్గ విషయం.

పాండురంగ విఠలుడి విగ్రహం ముందు తరచు సామూహిక ప్రార్థనలు జరిపేవారు. అలాంటప్పుడు గుంపులో కొందరు భక్తి పారవశ్యంతో పూనకం వచ్చినట్లు ఊగిపోయేవారు. ప్రార్థన అయిపోయాక అలా పూనకం వచ్చినవాళ్ళను భక్తి నరసింహంగారు, ప్రార్థన చేస్తున్న మిగతా భక్తులూ చాలా మెచ్చుకునేవారు. అప్పుడు నాకు కూడా అలాంటి పూనకం వచ్చి నన్ను అందరూ మెచ్చుకోవాలి అని కోరిక ఉండేది. హరి తనకెప్పుడు పూనకం రాలేదని చెప్పాడు. ఎన్నోసార్లు ఈ గుంపు ప్రార్థనలో పాల్గొన్నాను, నాకు ఒకే ఒక్కసారి కన్నీరుతో ఏడుపులా వచ్చేసింది కానీ పూర్తి పూనకం మాత్రం రాలేదు.

హరితో కలిసి రోజూ పాండురంగడి గుడికి వెళ్ళడం 1952లో నేను మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకి వెళ్ళేంతవరకూ కొనసాగింది.

కనకలక్ష్మమ్మగారికి కూడా పాండురంగడి మీద భక్తి కొన్నాళ్ళు కొనసాగింది. తర్వాత ఆవిడకు రామకృష్ణ పరమహంస మీద భక్తి, ఆయన బోధామృతం మీద గురి కుదిరాయి. అప్పటినుంచీ ఆవిడ తన శిష్యబృందానికి రామకృష్ణ పరమహంస బోధామృతం, దాని గొప్పదనం బోధించేది. అప్పుడు మా అమ్మకు అదే తన జీవిత పరమావధి అనే గట్టి నమ్మకం కుదిరింది. తెలుగులో రామకృష్ణ పరమహంస బోధించిన విషయాలను గురించి పుస్తకాలు తెప్పించుకొని, వాటిని చదవడంలోనూ, ధ్యానంలోనూ తన ఖాళీ సమయం గడపడం మొదలుపెట్టింది.

నక్కలతోటలో మా ఇంటి నుంచి చిలకలపూడి వెళ్ళే దారిలో బ్రిటీష్‌వాళ్ళు పెట్టిన ఒక క్రిష్టియన్ మిషన్ ఉండేది. ఈ మిషన్ నుంచి ఒక తెలుగావిడ అప్పుడప్పుడూ కనకలక్ష్మమ్మగారి శిష్యబృందం కలుసుకునే చోటుకి వచ్చి క్రిష్టియన్ మతం గురించి బోధించడానికి ప్రయత్నించేది. ఆవిడ చెప్పేదాని సారాంశం ఇది. “ఏసుక్రీస్తు మీ కొరకై 1950 సంవత్సరాల క్రితం శిలువపై తన ప్రాణాలను అర్పించాడు. ఆయన మీ శ్రేయస్సు కొరకే చనిపోయాడు. మీరు క్రైస్తవ మతానికి మారిపోయి ఆయన్ను పూజించండి. మా మిషన్ నడపడానికి ధనసహాయం చెయ్యండి”.

కనకలక్ష్మమ్మగారి శిష్య బృందంలో ఎవ్వరూ ఆవిడ మాటలను పట్టించుకోలేదు, దాని బదులు ఆవిడనే రామకృష్ణ పరమహంస బోధామృతం చదవమని చెప్పబోయారు.

దీని తర్వాత ఆవిడ మా ఇద్దరు పిల్లలను (నన్ను, హరిని) పట్టి మమ్మల్ని క్రైస్తవమతానికి మార్చడానికి ప్రయత్నించింది. మేము ఆవిడకు చెప్పాము “అమ్మా, ఏసుక్రీస్తు మా కొరకు 1950 సంవత్సరాల క్రితం చనిపోయాడని చెప్తున్నావు. మరి ఆయనకు మేమెవరమో తెలియదే! మా కొరకు ప్రాణాలర్పించాడని ఎలా చెప్పగలవు? ఆయన మా కొరకు చనిపోయాడని చెప్పడానికి ఋజువేమిటి?” దానికి ఆవిడ “ఇదంతా బైబిల్ పుస్తకంలో రాసి ఉంది చూడండి” అని చెప్పింది. మేము ఆవిడతో వాదించాం. “అమ్మా, ఎవరో ఏదో రాసి

పుస్తకాన్ని ప్రచురించినంత మాత్రాన దాంట్లో రాసినవన్నీ నిజమని ఎలా నమ్మమంటావ్? సుమారు 5000 సంవత్సరాల క్రితమే కృష్ణుడి ప్రవచనాలతో రచింపబడిన భగవద్గీతలో ఇంతకన్నా ఎన్నో మంచి విషయాలు ఉన్నాయి చూడమ్మా" అని. చివరకు ఆవిడ మాతో వాదించి నెగ్గలేనని గ్రహించి మా ఇళ్ళకు రావడం మానేసింది.

హిందూ కాలేజి హైస్కూలులో నా చదువు ఇలా 1950 వరకు కొనసాగింది. ఆ తరువాత మా నాన్నగారికి గుడివాడలో రెవిన్యూ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ జరిగింది, దానికి కుటుంబాన్ని బందరులోనే ఉంచేసి తను ఒక్కరే వెళ్ళారు.

1950 వేసవికాలంలో మా కుటుంబం బందర్‌లో ఉండగా ఒక సెలవు రోజున మా కుటుంబం అంతా (నాన్న, అమ్మ, నేను, శ్రీరా, సరోజిని) కలిసి, బందరుకి దగ్గర పెడనలో ఒక బంధువుల ఇంటికి భోజనానికి వెళ్ళాము. భోజనం తర్వాత పెద్దవాళ్ళంతా కూర్చొని మాట్లాడుకుంటుండగా, నా 6 ఏళ్ళ చెల్లెలు సరోజినికి బయట కొంతమంది తన వయస్సు పిల్లలు ఆడుకుంటూ కన్పించారు. వాళ్ళతో కాసేపు ఆడుకుంటానని చెప్పి సరోజిని బయటకు వెళ్ళింది. కొంతసేపు తర్వాత మేము ఇక మా ఇంటికి తిరిగి వెళ్దామని చూస్తే సరోజిని కనపడలేదు. బయట ఆడుకుంటానని చెప్పింది కదా అని బయట చూస్తే అక్కడ పిల్లలెవరూ కనపడలేదు. దగ్గర్లో వెతికాం, సరోజిని కానీ, తను ఆడుకుంటున్న మిగతా పిల్లలు కానీ కనపడలేదు. సరోజినిని వెదుక్కుంటూ నలుగురు పెద్దవాళ్ళు బయట వీధుల్లో వెదకడం మొదలెట్టారు. సరోజిని కనపడ లేదని తెలిసి మా అమ్మ ఏడవడం మొదలుపెట్టింది.

చివరకు సాయంత్రం చీకటి పడుతుండగా ఒకాయన ఏడుస్తున్న మా సరోజిన్ని వెంటబెట్టుకొని వచ్చి "ఈ పిల్ల ఎవరో మీకు తెలుసా అండీ" అని అడిగాడు. ఆయనకు ధన్యవాదాలర్పించి, సరోజిని మళ్ళీ దొరికినందుకు మేము భగవంతుడికి దణ్ణాలర్పించుకున్నాం.

1950 జూలైలో నేను బందరు హిందూ కాలేజీలో ఇంటర్‌మీడియట్ చదవడం మొదలెట్టాను యం.పి.సి. (మ్యాథమెటిక్స్, ఫిజిక్సు, కెమిస్ట్రీ) గ్రూపుతో, అది 2 ఏళ్ళ కోర్సు.

నేను ఇంటర్‌మీడియట్ చదువుతున్నప్పుడు జరిగిన ఒక ఉదంతం చెప్తాను. ఈ కోర్సులో నాకూ, హరికీ ఇద్దరికీ చాలా నచ్చిన మోస్ట్ ఫేవరెట్ క్లాసు మా కెమిస్ట్రీ క్లాసు. కెమిస్ట్రీ లెక్చరర్‌గారు పాఠాలు చాలా బాగా చెప్పేవారు. ప్రతి క్లాసులోనూ ఆ లెక్చర్‌లో చర్చించిన ముఖ్య విషయాలు క్లియర్‌గా బోర్డుమీద చక్కటి చేతిరాతతో రాసేవారు, వాటిని మా క్లాస్ నోట్‌బుక్కులో కాపీ కొట్టేవాళ్ళం. పరీక్షలకి తయారవడానికి ఆ క్లాస్‌నోట్సు చదవుకుంటే చాలన్నమాట. అప్పటి నా టీచర్లందర్లోకీ నాకు ఈయన చాలా ఇష్టం. నేను భవిష్యత్తులో టీచర్‌ని అవడం జరిగితే ఈయన్ని రోల్ మోడల్‌గా పెట్టుకొని అంత చక్కగా నేనూ పాఠాలు చెప్పాలి అని నిశ్చయించుకున్నాను.

మిడ్ టరమ్ పరీక్షల తర్వాత మా కెమిస్ట్రీ లెక్చరర్‌గారు ఒక క్లాసులో సగంమంది విద్యార్థుల ఆన్సర్ బుక్కులు తీసుకువచ్చి ఇచ్చారు, వాటిలో నాది వచ్చేసింది, నాకు 96% మార్కులు వచ్చాయి. ఆ రోజు హరిది రాలేదు, మిగతావాళ్ళ ఆన్సర్ పుస్తకాలు తర్వాత క్లాసులో ఇస్తానని చెప్పారు. నాకు 96% మార్కులు రావడంతో నేను చాలా గర్వపడ్డాను అప్పుడు, అది హరి గమనించాడు మిగతా కొందరు స్నేహితులతో కలిసి ఉన్నప్పుడు

హరి అన్నాడు "గోపాలంకి ఇవాళ కెమిస్ట్రీ మిడ్ టరమ్ పరీక్షలో 96% మార్కులు వచ్చినట్లు తెలిసింది, అందుకని అతను మేఘాలలో తేలిపోతున్నాడు చూడండి".

ఆ కెమిస్ట్రీ మిడ్‌టరమ్ ఆన్సర్ పుస్తకం ఇంట్లో అమ్మకు చూపించాను. తను చాలా సంతోషించి మెచ్చుకుంది, ఆ రోజు నాకు నచ్చిన కొబ్బరి బూరెలు చేసి పెట్టింది.

మరుసటి క్లాసులో మిగతావాళ్ళ ఆన్సర్ బుక్కులు వచ్చాయి, క్లాసు తర్వాత హరి తన ఆన్సర్ బుక్కు చూపించాడు, అతనికి 100% మార్కులు వచ్చాయి ఆ పరీక్షలో. అది చూడగానే పూర్వపు నా గర్వమంతా దిగజారిపోయింది.

మా ఇంగ్లీషు లెక్చరర్‌గారి పేరు గోఖలే గారు. నక్కలతోటలో వాళ్ళ ఇల్లు మా వీధికి పక్క వీధిలోనే ఉండేది. ఆయనకు నామీద మంచి అభిప్రాయం ఉండేది. ఫైనల్ ఇయర్‌లో నా చేత ఆయన ఒక చిన్ని ఇంగ్లీషు నాటకం వేయించారు. నేను వేసింది ఆయన ఇంగ్లీషు పాఠంలో చెప్పిన "కేసబియాంకా ఆన్ ది డెక్ ఆఫ్ ది సింకింగ్ షిప్". నా నాటకం చూడడానికి ఈ ఫంక్షన్‌కి మా కుటుంబం వాళ్ళు అంతా వచ్చారు, చాలామంది పొరుగిళ్ళవాళ్ళు కూడా వచ్చారు. గోఖలేగారు, అందరూ నేను చాలా బాగా చేశానని మెచ్చుకున్నారు.

హిందూ కాలేజి ముందు రెండు పెద్ద నేరేడు చెట్లుండేవి. వేసవికాలంలో ఆ నేరేడు చెట్ల నుండి నేరేడుపండ్లు రాలి నేలమీద పడిపోయేవి. నేరేడుపండ్ల మధ్య పెద్దగింజ, వాటి చుట్టూరా తియ్యటి గుజ్జు ఉంటుంది, తినడానికి చాలా బావుంటాయి. మేము కిందపడ్డ పళ్ళు ఏరుకొని తినేసేవాళ్ళం. కొన్ని పళ్ళు ఇంటికి తెచ్చి, అమ్మకు, తమ్ముళ్ళు, చెల్లెలుకీ రుచి చూపించేవాణ్ణి.

ఒక రోజు మా కుటుంబంలో శ్రీరాములు తప్పించి మిగతావాళ్ళం అంతా కలిసి సాయంత్రం మొదటి షో సినిమాకు వెళ్ళాం. శ్రీరాములుకి అప్పుడు 12 సంవత్సరాలు, తను మాతో సినిమాకు ఎందుకు రాలేదో నాకు గుర్తులేదు. మేము తిరిగి వచ్చేటప్పటికి రా॥ 10 గం॥లు దాటుతుంది, తను అంతకుముందు నిద్రపోతే తలుపులన్నీ జాగ్రత్తగా గడియ పెట్టుకోమని చెప్పాం. మేము తిరిగి వచ్చేటప్పటికి తలుపులన్నీ గడియ వేసేసి ఉన్నాయి. మేము తలుపు తట్టాం, కానీ ఏమీ జరగలేదు. తలుపులు ఎన్నిసార్లు, ఎంత గట్టిగా బాదినా, ఏమీ జరగలేదు. శ్రీరాములు లోపల గాఢనిద్రలో ఉన్నాడని తెలిసింది. ముందు వరండా దగ్గర కిటికీ నుంచి లోపలకు చూస్తే, తను ఆ కిటికీకి దగ్గరే చాపమీద పడుకొని నిద్రపోతున్నాడు. తలుపు తియ్యమని కిటికీ గుండా చాలాసార్లు గట్టిగా అరిచాం, కానీ ఫలితం లేదు. చివరకు కిటికీ గుండా ఒక పొడుగాటి కర్ర దూర్చి దానితో అతన్ని అటూ ఇటూ కదిపాం. అప్పుడుగాని అతనికి మెలకువ రాలేదు. అలానే మేమంతా, శ్రీరాములంత గాఢంగా కాకపోవచ్చుగానీ, బాగానే నిద్రపోతాం.

మా బందరు ఇంటికి, ముందు వెడల్పైన వరండా ఉండేది. ఆ వరండాకి మధ్యలో బాగా పాలిష్ చెయ్యబడ్డ తెల్లటి చలవరాళ్ళు వేయించారు. మిగతా భాగమంతా నాపరాళ్ళు వేయించారు. ఇల్లు రెండు పోర్షన్‌లుగా కట్టించారు. మా కుటుంబం ఎడమ పోర్షన్‌లో ఉండేవాళ్ళం. కుడి పోర్షన్‌లో సత్యనారాయణ రాజుగారి కుటుంబం అద్దెకు ఉండేవారు. రాజుగారికి ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి. అమ్మాయి పేరు సుబ్బలక్ష్మి, అప్పుడే ఆవిడకు పెళ్ళి జరిగింది, అల్లుడితో ఏదో సమస్య రావడంవల్ల సుబ్బలక్ష్మి తన అమ్మా నాన్నలతోనే

ఉండేది. తను నా అక్కగా కలిసిపోయి, నాతో తరచూ మాట్లాడుతుండేది. రాజుగారు మా ఇంట్లో అద్దెకుండి, అబ్బాయిలను చదివించుకున్నారు. ఆయన పగటిపూటంతా ముందు వరండాలో ఒక పడకకుర్చీమీద కూర్చొని గడిపేవారు. అప్పుడు నేను మా పోర్షన్ వరండాలో కూర్చొని చదువుకోవటం చూసారు. అక్కడ నున్నటి చలవరాళ్ళమీద సుద్దముక్కతో నేను లెఖ్ఖల హోమ్‌వర్కు చేసుకోవడం కుతూహలంతో చూసేవారు. ఆయనకు చుట్ట తాగే అలవాటు, నస్యం పీల్చే అలవాటూ ఉండేవి. వాటితో తలనొప్పితో బాధపడుతుండేవారు. అందుకని, చప్పుడు చేసి ఆయన విశ్రాంతికి భంగం కలిగించద్దని మా పిల్లలందరికీ నాన్న చెప్పారు. రాజుగారికి తరచూ కఫం వస్తుండేది, దాన్ని మాటిమాటికీ ముందుకే ఊసేసేవారు.

1951 చివర్లో రాజుగారికి మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసులో హెడ్ క్లర్కుగా పోస్టింగు వచ్చి బందరు వదిలి మద్రాసు వెళ్ళిపోయారు. అక్కడే కాలేజీకి దగ్గర్లో ఒక ఎపార్ట్‌మెంటు అద్దెకు తీసుకొని ఉండడం మొదలెట్టారు, మద్రాసు నుంచి రాజుగారు తరచూ మా నాన్నగారికి ఉత్తరాలు రాస్తుండేవారు, సుబ్బలక్ష్మి నాకు ఉత్తరాలు రాసేది.

1952లో హిందూ కాలేజీలో నా ఇంటర్‌మీడియట్ కోర్సు పూర్తయ్యింది, నేను ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యాను. నేను ఇంటర్‌మీడియట్ ఫస్ట్ క్లాస్‌లో పాసయిన విషయం నాన్నగారు రాజుగారికి ఉత్తరంలో తెలిపారు. రెండు వారాల్లో ఆయన జవాబిచ్చారు, గోపాలాన్ని తర్వాత ఏమి చదివిస్తారు అని అడుగుతూ, నేను అప్పటికే కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో బి.ఇ. చదువుదామని నిశ్చయించుకొని అప్లై చేసాను, ఎడ్మిషన్ వచ్చేసింది కూడా, ఈ విషయం రాజుగారికి తెలుపుతూ నాన్న జవాబిచ్చారు. తిరుగు టపాలో ఆయన జవాబు వచ్చింది. “ఇక్కడ డి. పట్నాయిక్ అని ఒక మాథమేటిక్సు ప్రొఫెసర్ ఉన్నారు. ఆయనతో నాకు బాగా పరిచయం ఏర్పడింది. ఈ సంవత్సరం ఆయన బి.ఎస్‌సి. ఆనర్స్ (స్టాటిస్టిక్సు) 3 ఏళ్ళ కొత్త కోర్సు మొదలుపెడ్తున్నారు. స్టాటిస్టిక్స్ మనదేశం యూనివర్శిటీలలో ఈ మధ్యనే బోధించడం మొదలెట్టిన కొత్త సబ్జెక్టు, ఈ కోర్సు తీసుకున్న విద్యార్థులకు చాలా మంచి ఉద్యోగాలు వస్తాయని ఆయన చెప్తున్నారు. మీరు తప్పకుండా గోపాలాన్ని ఈ కోర్సులో చేర్పించండి. నేను ఆయనతో మాట్లాడి సీటు ఎరేంజి చేస్తాను” అని వ్రాశారు. మా అమ్మ నాన్నలకు ఆయన మాటమీద బాగా నమ్మకం కుదిరింది. ఇంజనీరింగు మానేసి ఈ కొత్త కోర్సులో చేరమని బలవంతం చేసారు.

ఇంటర్‌మీడియట్‌లో నా క్లాసుమేట్సు అందరూ, బి.ఇ.లో సీటు వస్తే తప్పకుండా చేరు అని నాకు సలహా ఇచ్చారు, కనుక నాకు ఇంజనీరింగు చదవాలని గట్టి కోరిక ఉంది. హరి తనకు మెడిసన్ చదవాలని ఉందని చెప్పాడు. అతను మెడికల్ కాలేజిలో ఎడ్మిషన్‌కి అప్లై చేసాడు, అతనికి కర్నూలు మెడికల్ కాలేజిలో సీటు వచ్చింది, అక్కడకు వెళ్ళడానికి రెడీ అవుతున్నాడు. మెడిసిన్ చదువులో విద్యార్థులు ఎలుకలు మొదలైన జంతువులను డిసెక్ట్ చేస్తారు. అలా జంతువులను డిసెక్ట్ చెయ్యడం నాకు ఇష్టం లేదు గనుక మెడిసిన్ చదువు నాకు కాదు అని నేను నిశ్చయించుకున్నాను.

మా నాన్నగారు నా చేత మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ బి.ఎస్‌సి. హానర్స్ కోర్సుకి అప్లికేషన్ నింపించి రాజుగారికి మెయిల్ చేసారు. వెంటనే నాకు ఎడ్మిషన్ వచ్చిందని ఆయన జవాబిచ్చారు. అప్పుడు మా నాన్నగారు “సరేలేరా, నువ్వు కాకినాడలో బి.ఇ. విషయం మర్చిపో, వెళ్ళి ప్రెసిడెన్సీ కాలేజీలో ఆ స్టాటిస్టిక్సు కోర్సు చదువు. మంచి భవిష్యత్తు ఉంటుందని అనుభవస్తులు రాజుగారు, ఆ ప్రొఫెసర్ పట్నాయక్ చెప్తున్నారు కదా.

అక్కడ చేరి బాగా చదవరా. ఈ బి.ఎస్‌సి కోర్సు 3 సంవత్సరాలు కదా, నేను ఎలాగో నీకయ్యే ఖర్చులు భరిస్తాను. తర్వాత నువ్వు మంచి ఉద్యోగం సంపాదించుకొని నీకు వచ్చే జీతంతో మన కుటుంబానికి సహాయం చేద్దువుగాని, భయపడకుండా దాంట్లో చేరు, ఇక మద్రాసు వెళ్ళడానికి తయారుగా" అంటూ అది ఫైనల్ నిర్ణయం అన్నట్లు చెప్పారు.

"విధి బలీయం" అంటారు గదా, ఇంజనీరింగు బి.ఇ. చదవాలని ఎంతగానో ప్లాన్ చేసిన నాకు, ఒక కొత్త సబ్జెక్టు, స్టాటిస్టిక్సు చదువులో చేరడం జరగబోతోంది చాలా ఆశ్చర్యకరంగా. కాని దీనికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే చివరకు నేను యూనివర్శిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ ఆర్బర్, కాలేజి ఆఫ్ ఇంజినీరింగులోని ఇండస్ట్రియల్ అండ్ ఆపరేషన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా రాణించడం.

## 9. నేను కాలేజీ చదువుకి మద్రాసు వెళ్ళడం

అప్పుడు మద్రాసులో మా బంధువులు చాలామంది నివసిస్తూ ఉండేవారు. మా అమ్మ వైపు నుంచి పెద్దమామయ్య గుత్తి వెంకటేశ్వర్లు, ఆయన కజిన్ బ్రదర్స్ చాలామంది ఉన్నారు. మా నాన్నగారి వైపు నుంచి పేరక వీరబ్రహ్మం మామయ్య, ఆయన చిన్న తమ్ముడు పేరక కృష్ణమూర్తి ఉండేవారు, వీరబ్రహ్మం మామయ్యకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు, వారిలో పెద్దమ్మాయి సంపూర్ణను నాకు ఇచ్చి పెళ్ళి చెయ్యాలని ఆయన చాలా ఆశపడేవారు, మా నాన్నగారికి కూడా ఈ సంబంధం చాలా ఇష్టం.

కృష్ణమూర్తి మామయ్యకు అప్పటికే పెద్దలు బలవంతం చేసి పెళ్ళి జరిపించారు, ఆయన "నాకు సంసారం చెయ్యడం ఇష్టం లేదని" చెప్తున్నా. కానీ పెళ్ళయిన కొన్ని నెలల్లోనే ఆ దంపతులు విడిపోయారు. అందుకని కృష్ణమూర్తి మామయ్య ఒంటరిగా మద్రాసులో ఒక సింగిల్ బెడ్‌రూమ్ ఎపార్ట్‌మెంట్‌లో ఉంటుండేవాడు. దగ్గర్లో ఇంకో ఎపార్ట్‌మెంటులో ఒక ముసలమ్మ ఉండేది. ఆవిడ వండి పెడ్తే, కృష్ణమూర్తి మామయ్య ఆవిడ ఎపార్ట్‌మెంటుకి వెళ్ళి తింటుండేవాడు.

మా నాన్నగారు నన్ను స్వయంగా తీసుకువెళ్ళి మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చేర్పించారు. ఈ ట్రిప్పుకి నేను, మా నాన్నగారు బందరు రైల్వేస్టేషన్లో రైలు ఎక్కినప్పుడు, ఇన్నాళ్ళు హాయిగా గడచిన బందరులో జీవితం, నా బాల్య స్నేహితుడు హరిని మొట్టమొదటిసారి విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాననే ఆలోచన చాలా బాధ కల్గించింది. రైలు కదిలాక మెల్లగా వెనకపడుతున్న నక్కలతోట దృశ్యాలు, భవనాలు మళ్ళీ ఎప్పుడు చూస్తానో గదా అని విచారం వేసి ఏడుపు వచ్చింది.

ప్రెసిడెన్సీ కాలేజి ట్రిప్లికేన్ మెరీనా బీచ్ దగ్గర ఉంది. మా కృష్ణమూర్తి మామయ్య చాకలిపేటలో ఉండేవాడు. ఆయన గదినుంచి ప్రెసిడెన్సీ కాలేజీకి వెళ్ళడానికి రెండు బస్సులు మారాలి. నేను కృష్ణమూర్తి మామయ్యతో తన గదిలో ఉండేట్లు, మామయ్యతో ఆ ముసలమ్మ మెస్‌లో భోజనం చేసేట్లు ఏర్పాట్లు చేసి, మా నాన్న బందరు వెళ్ళిపోయారు.

కృష్ణమూర్తి మామయ్యకు మా నాన్నగారి మీద చాలా గౌరవం, నేను బాగా చదువుకొని పైకి రాగలనని చాలా నమ్మకం ఉండేది. రోజూ పొద్దున్నే లేచి, మేమిద్దరం త్వరగా తయారయిపోయి ముసలమ్మ మెస్‌లో

బ్రేక్‌ఫాస్టు తిని, మామయ్య తన ఆఫీసుకీ, నేను బస్సులో ప్రెసిడెన్సీ కాలేజీకీ బయలుదేరి వెళ్ళిపోయేవాళ్ళం. మళ్ళీ సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేవాళ్ళం.

ఆ రోజుల్లో ప్రెసిడెన్సీ కాలేజీ చాలా పాష్ కాలేజి, నేను మొట్టమొదటి కార్పెట్ చూసింది ప్రెసిడెన్సీ కాలేజీలోనే. మా క్లాసురూములు 2వ అంతస్తులో ఉండేవి, మొదటి అంతస్తు నుంచి 2వ అంతస్తు ఎక్కడానికి మెట్లు కార్పెట్ లైనింగుతో చాలా వైభవంగా కనిపించాయి నాకు.

1952-55లో నేను ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకునేటప్పుడు, విద్యార్థుల్లో కొంతమంది బాగా ధనవంతుల కూతుళ్లు ఉండేవారు. వీళ్ళు చక్కటి దుస్తులలో రోజూ చాలా అందంగా మెరిసిపోతుండేవారు. మా క్లాసురూముల నుంచి కిటికీల గుండా బయటకు చూస్తే మెరీనా బీచ్, బంగాళాఖాతం కన్పించేవి.

మా బి.ఎస్.సి. కోర్సులో మొత్తం 15 మంది విద్యార్థులుండేవారు, 11 మంది మగవాళ్ళు, నలుగురు విద్యార్థినులు. నలుగురు విద్యార్థినులూ మొదటి బెంచీ మీద కూర్చునేవారు. ఈ విద్యార్థినుల్లో రాజేశ్వరి అనే చాలా అందమైన పిల్ల ఉండేది. తెల్లటి మెరిసే శరీరం, రోజూ ఒక కొత్త తెల్లచీర కట్టుకొని వచ్చేది. రోజూ వాళ్ళ డ్రైవరు ఆవిణ్ణి కారులో డ్రాప్ చేసేవాడు. కొన్ని రోజులు తనే డ్రైవ్ చేసుకొని వచ్చేది.

1955లో ఈ కోర్సు పూర్తిచేశాక నేను అప్పటి క్లాస్‌మేట్స్‌తో కాంటాక్ట్ కోల్పోయాను. చాలా ఏళ్ళ తర్వాత 2005లో నా ప్రెసిడెన్సీ కాలేజీ క్లాస్‌మేట్ ఒకడు ఎలాగో నా ఇ-మెయిల్ సంపాదించి నన్ను కాంటాక్ట్ చేసాడు. అతన్ని రాజేశ్వరి ఎలా ఉంది, ఎక్కడ ఉంది అని అడిగాను. రాజేశ్వరి ఎవరో పెద్ద ఉద్యోగస్తుణ్ణి పెళ్ళి చేసుకొని అతనితో రాంచీలో స్థిరపడిందట. చాలా సంవత్సరాల తర్వాత, ఒక రోజు రాంచీలో వాళ్ళ ఇంటి ముందుండే మురికి కాలువలో ఆవిడ శరీరం కనపడిందనే వార్త తను విన్నానని చెప్పాడు, అప్పుడు నాకు చెప్పలేనంత విచారం కల్గింది.

నేను తరచూ కాలేజీ ఆఫీసుకు వెళ్ళి రాజుగారితో మాట్లాడుతుండేవాణ్ణి, సాయంత్రం కృష్ణమూర్తి మామయ్య గదికి తిరిగి వెళ్ళేముందు రాజుగారితో ఆయన ఎపార్ట్‌మెంటుకి నడిచి, అక్కడ వాళ్ళమ్మాయి సుబ్బలక్ష్మితో కాసేపు మాట్లాడి వెళ్ళేవాడిని. నాకు అప్పుడు 16 ఏళ్ళు, రాజుగారు రిటైర్‌మెంటు వయస్సుకి దగ్గర్లో ఉన్న ముసలివాడులా కనపడేవారు. నా క్లాసుమేట్లు అందరూ ఆ ముసలి ఆయనతో నీ స్నేహం చాలా వింతగా ఉంది అనేవారు.

మా క్లాసులో పాషా అనే ముస్లిం అతను నాతో చాలా స్నేహంగా ఉండేవాడు. నేను వాళ్ళ ఇంటికి చాలాసార్లు వెళ్ళాను. అతని చెల్లెళ్ళిద్దరూ చాలా అందగత్తెలు.

మా బి.ఎస్.సి. స్టాటిస్టిక్స్ ప్రోగ్రాంలో చాలా మాథమెటిక్స్ కోర్సులు ఉండేవి, అవి ఎం.ఎస్.సి, మ్యాథమెటిక్స్ కోర్సులతో కలిసి ఉండేవి. ఆ మ్యాథమెటిక్స్ ప్రోగ్రాంలోని ఇద్దరు తెలుగు విద్యార్థులు, సీతారామశాస్త్రి, విద్యాధరరావు నాకు మంచి స్నేహితులు. సీతారామశాస్త్రి మద్రాసు వాస్తవ్యుడే. విద్యాధరరావు వాళ్ళది గుంటూరు దగ్గర ఒక గ్రామం. అతను మా కాలేజీ దగ్గర్లో ఉన్న విక్టోరియా హాస్టలులో ఉండేవాడు.

విద్యాధరరావు నాకంటే వయస్సులో పెద్ద, చాలా పొడుగు, వాళ్ళది డబ్బున్న కుటుంబం. ఎప్పుడైనా

మధ్యాహ్నం ఖాళీ సమయం దొరికితే, అతనితో నేను విక్టోరియా హాస్టలులోని అతని గదికి వెళ్ళి విశ్రాంతి తీసుకునేవాణ్ణి. 1952–55లో నేను ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకున్నప్పుడు వేసవి సెలవులకు రైలులో ఇంటికి ప్రయాణం మేమిద్దరం కలిసి చేసేవాళ్ళం.

సీతారామశాస్త్రితో నా అనుభవం చెప్తాను. నేను చిన్నప్పటి నుంచీ శాకాహారిని కదా. ఇది అతను గమనించాడు. ముందు మేమిద్దరం చాలా దగ్గర స్నేహితులం. అతను ఒక రోజు నాతో అన్నాడు "మూర్తీ, వచ్చే సోమవారం మా ఇంట్లో మా తాతగారి సంవత్సరీకం జరుపుకుంటాం, దానికి మా ఇంట్లో లంచ్ ఉంటుంది. దానికి నిన్ను పిలుద్దామనుకుంటున్నాను. నువ్వు శాకాహారివని గమనించాను, నువ్వు బ్రాహ్మణుడ వనుకుంటున్నాను, నిజమే కదా?" నాకు వెంటనే ఏమి జవాబు చెప్పాలో తెలియలేదు. స్వతహాగా నాకు కులాలమీద నమ్మకం లేదు. నేను అన్ని కులాలకూ చెందుతానని నేననుకునేవాణ్ణి. ఒక్క క్షణం ఆలోచించి ఇలా జవాబిచ్చాను. "సీతారామ్, చాలా ధన్యవాదాలోయ్. నాకు కులాలమీద నమ్మకం లేదు, కానీ నాకు చిన్నప్పుడు మా నాన్నగారు మాది ఈ కులం అని చెప్పినట్లు గుర్తు" అని ఆ కులం పేరు చెప్పాను. అతను ఇలా జవాబిచ్చాడు "మూర్తీ, మా వాళ్ళకు ఆచారాల పట్టింపు, నిన్ను దీనికి పిలవలేను, సారీ!"

అప్పుడు నేను ఒక నిశ్చయానికి వచ్చాను. భవిష్యత్తులో ఎప్పుడైనా నా కులం ప్రస్తావన వస్తే, అడిగినవారిని "మీది ఏ కులం" అని అడగాలనీ, వాళ్ళ జవాబుని బట్టి, మాదీ అదే కులం అని చెప్పాలనీ.

18 డిసెంబరు 1952 (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిష్కరణకు సూత్రధారులైన పొట్టి శ్రీరాములుగారు చనిపోయిన తర్వాత రోజు) న, నేను మద్రాసులో ఉండగా, నా 2వ చెల్లెలు అమ్మకు పుట్టింది. ఈ పిల్ల తన కడుపులో పెరుగుతున్నప్పుడు, మా అమ్మ భగవద్గీత గ్రంథం మీద భక్తి పారవశ్యంతో ఉండేది, అందుకని ఆ పిల్లకు "విజయ గీతా ప్రభావతి" అని పేరు పెట్టింది, అందరూ ఆ పిల్లను "గీత" అని పిలవడం మొదలెట్టారు. అప్పటికి మా అమ్మా నాన్నలకు ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు.

బి.ఎస్.సి. ఆనర్స్ స్టాటిస్టిక్సు మొదటి సంవత్సరం కృష్ణమూర్తి మామయ్య గదిలో ఉంటూ పూర్తిచేశాక, వేసవి సెలవులకు ఇంటికి వచ్చినప్పుడు నాన్నకు చెప్పాను "కృష్ణమూర్తి మామయ్య గదినుంచి ప్రతిరోజూ ప్రెసిడెన్సీ కాలేజీకి వెళ్ళడానికి చాలా టైము వృధా అవుతుంది" అని, వీలైతే నేను విక్టోరియా హాస్టల్లో ఉండి చదువుకోడానికి ఏర్పాటు చెయ్యగలరా అని అడిగాను. ఆలోచించుకొని కొద్ది క్షణాల తర్వాత "సరేరా అలానే చేద్దాం, నీకు ఇంకా 2 ఏళ్ళు గదా మిగిలింది. ఈ కోర్సులో బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకో" అన్నారు నాన్న. 1953–54, 54–55 ఎకడెమిక్ ఇయర్స్ నా ఖర్చులకు నాన్న నెల నెలా 67 రూపాయలు పంపేవారు.

నేను మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చదువుకుంటున్నప్పుడు, నా విశేషాలు తెలుపుతూ అమ్మా నాన్నలకు ప్రతి వారం ఉత్తరం రాసేవాణ్ణి. అలాగే నాన్న, అమ్మలు నాకు తరచూ ఉత్తరాలు రాస్తుండేవారు. అమ్మ ఉత్తరం ఎప్పుడూ "చిరంజీవి గోపాలంకు మీ అమ్మ దీవించి ఉత్తరం వ్రాయునది" అంటూ మొదలయ్యేది. ఈ ఉత్తర ప్రత్యుత్తరాల వల్ల అమ్మా నాన్నలను రోజు చూడలేకపోయినా, నేను వాళ్ళ మధ్యలో ఉన్నట్లే అనిపించేది. అలానే చదువునుంచి ఖాళీ కుదిరినప్పుడుల్లా చాకలిపేటలోని మా మామయ్యలను, మిగతా బంధువులనూ వెళ్ళి చూసి పలకరిస్తుండేవాణ్ణి.

1953 వేసవికాలం సెలవులకి నేను ఇంటికి వచ్చేముందే మా నాన్నగారు విజయవాడ ఆర్.టి.ఓ. (రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసు)లో చేరిపోయి, కుటుంబాన్ని బందరు నుంచి విజయవాడలో ఒక అద్దె ఇంట్లోకి మార్చేశారు. 1940లోనే మా నాన్నగారు విజయవాడలో ఇల్లు కట్టుకోడానికి స్థలం కొన్నారు. ఇప్పుడు విజయవాడ వచ్చేశాక, అద్దె ఇంట్లో ఉంటూ ఆ స్థలంలో ఒక పెంకుటిల్లు కట్టించడం మొదలెట్టి దాన్ని 1954లో పూర్తిచేసి, మా సొంత ఇంట్లోకి మారిపోయారు.

నేను విక్టోరియా హాస్టల్లో ఉండి చదువుకుంటున్నప్పుడు జరిగిన ఒక ఉదంతం చెప్తాను. ఒక సెలవు రోజున కొందరు స్నేహితులతో కలిసి మధ్యాహ్నం ఒక ఇంగ్లీషు సినిమా మ్యాటినీ చూడడానికి నేను వెళ్ళాను. బస్సుస్టాపు నుంచి సినిమా థియేటర్‌కి ఒక ఖాళీ మైదానం గుండా కొంచెం దూరం నడవాలి. దానిమీద ఎడమవైపు నేను, నాకు కుడివైపు స్నేహితులూ ఉండి నడుస్తున్నాం. మాలాగానే ఇంకొంతమంది నడుస్తున్నారు. సడెన్‌గా నా కాలు ఏదో రాయికి తగలడం మూలాన నేను ముందుకి తూలిపడబోయాను. నాకు ఎడమవైపు నడుస్తున్న ఒకావిడ నేను పడిపోకుండా పట్టుకుంది. ఆవిడ ఎవరా అని చూస్తే నటి సావిత్రి అని తెలిసింది. ఆ రోజుల్లో ఆవిడ కెరియర్ ఉచ్చదశలో ఉంది, నేను ఆవిడ నటించిన సినిమాలు ఎన్నో చూశాను. ఆవిణ్ణి అంత దగ్గరగా చూడడం అలా జరిగింది, చాలా ఆశ్చర్యకరంగా.

నేను ఆవిడకు ధన్యవాదాలు చెప్తుండగా, ఎవరో యువకుడు తన కుటుంబంతో ఆవిడ దగ్గరకు వచ్చాడు. ఆవిడ “ఓ మీరు వచ్చేశారా? మా ఇంటికి వెళ్ళండి. నేను సినిమా కొద్దిగా చూసి త్వరలో ఇంటికి వచ్చేస్తాను, అప్పుడు మాట్లాడుకుందాం” అంటూ థియేటర్ వైపు వెళ్ళిపోయింది.

1953-54, 54-55 ఎకడెమిక్ ఇయర్స్ నేను విక్టోరియా హాస్టల్‌లో ఉంటూ మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎస్.సి. ఆనర్స్ స్టాటిస్టిక్సు కోర్సు 1955లో పూర్తి చేసి ఫైనల్ ఎగ్జామ్స్ రాశాను. ఈ కోర్సుకి ప్రెసిడెన్సీ కాలేజీలో నుండి మొదటి బ్యాచ్ మాది. మా క్లాసులో కె. సుందరరాజన్ అనే తమిళ విద్యార్థికి టాప్ మార్కులు వచ్చేవి పరీక్షల్లో, అతను చాలా తెలివైనవాడు. అతని తర్వాత  నాకు మిగతా అందర్లోకీ ఎక్కువ మార్కులు వచ్చేవి.

మాకు బందరుకి దగ్గర్లో ఉన్న పెడన, కప్పలదొడ్డి గ్రామాలలో చాలా మంది బంధువులుండేవారు. బందరు-విజయవాడ ట్రైన్ రూటులో బందరు, చిలకలపూడి స్టేషన్‌ల తర్వాత పెడన స్టేషన్ వస్తుంది, పెడనకు, బందరుకి మధ్య 8 మైళ్ళు దూరం. కప్పలదొడ్డి, పెడనకు 2 మైళ్ళ దూరంలో ఉండే చిన్న గ్రామం, పెడన నుంచి నడిచి వెళ్ళాలి కప్పలదొడ్డికి. కప్పలదొడ్డిలో మాకు తాతయ్య వరస అయ్యే త్రయంబకేశ్వరుడు ఉండేవాడు. ఆయన భక్తి పాటలు పెద్దగొంతుతో చాలా బాగా పాడేవారు, భజన చాలా బాగా చేసేవారు. మేము నక్కలతోటలో ఉన్నప్పుడు ఆయన ప్రతి గురువారం మా ఇంటికి వచ్చి నక్కలతోటలోని సాయిబాబా గుళ్ళో భక్తి పాటలు పాడేవారు, భజన చేయించేవారు.

1954లో మేము విజయవాడలో మా సొంత ఇంట్లోకి మారినప్పటి నుంచీ, పెడన నుంచి ఒక మామ్మ (ఆవిడని మేము “పెడన మామ్మ” అని పిలిచేవాళ్ళం) మా ఇంటికి తరచూ వచ్చి, అమ్మకు వంటగదిలోనూ, పిల్లలను సాకడంలోనూ సహాయం చేస్తుండేది.

1955లో మా అమ్మ చివరిసారి గర్భవతి అయ్యింది. 1955 మార్చిలో నేను బి.ఎస్.సి. ఆనర్స్ ఫైనల్ ఎగ్జామ్స్ వ్రాసి విజయవాడ ఇంటికి తిరిగి వచ్చినప్పుడు, నాకు ఒక విషయం తెలిసింది. ఆ సంవత్సరం మొదట్లో మా అమ్మ గర్భవతిగా ఉన్నప్పుడు, తనూ, పెదనమామ్మ కలిసి కృష్ణానదిని చూడడానికి నదీ తీరానికి వెళ్ళారట. నది నీళ్ళల్లో కాళ్ళు కడుక్కొని తర్వాత అక్కడ నది ఒడ్డులో బోర్లించి ఉన్న ఒక పడవను చూసి, దానిమీద కూర్చోడానికి ప్రయత్నించిందట అమ్మ. అప్పుడు ఆ పడవ కదిలిపోగా, మా అమ్మ జారి నీళ్ళల్లో పడిపోయిందట. ఆ బోర్లించిన పడవ క్రింద ఊబి ఉందట, ఆ ఊబిలో అమ్మ కూరుకు పోవడం మొదలయ్యిందట. పెదనమామ్మ అమ్మను బయటకు లాగడానికి ప్రయత్నిస్తూనే "సహాయం చెయ్యండని" గట్టిగా అరిచిందట. అమ్మ మెడవరకు ఊబిలో దిగిపోతుండగా ఎవరో వచ్చి అమ్మను బయటకు లాగారట. ఇది విని నాకు అమ్మని గురించి చాలా భయం వేసింది. అమ్మను చాలా జాగ్రత్తగా ఉండమని చెప్పాను.

దీని తర్వాత 1955 వేసవికాలంలో నాన్న గుంటూరుకి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. అక్కడ అద్దె ఇంట్లో ఉండగా అమ్మకు కవలలు, ఇద్దరు మగపిల్లలు, పుట్టారు. ఇది నేను ఇంట్లో ఉండగానే జరిగింది. పిల్లలకు నృపకుమార్, విజయకుమార్ అని పేర్లు పెట్టారు. ఇంట్లో నృపకుమార్‌ని పెద్దా అనీ, విజయకుమార్‌ని బలరామ్ అని పిలిచేవారు, వీళ్ళే అమ్మకు పుట్టిన చివరి సంతానం.

గుంటూరులో ఉండగానే నేను బి.ఎస్.సి. ఆనర్స్ ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యానని తెలిసింది. తర్వాత ఏమి చేద్దామా అని నేను ఆలోచిస్తూండగా నాన్న "మన కుటుంబం ఖర్చులు పెరుగుతున్నాయిరా, నువ్వు ఉద్యోగం సంపాదించి నాకు సహాయం చెయ్యి" అన్నారు.

ఏ ఉద్యోగానికి అప్లై చెయ్యాలా అని ఆలోచిస్తున్నప్పుడు, నాకు ఐ.ఎస్.ఐ. (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్) కలకత్తా వాళ్ల ప్రకటన కనపడింది, ఆ సంవత్సరమే వాళ్ళు 3 సంవత్సరాల ఎడ్వాన్స్‌డ్ ప్రొఫెషనల్ స్టాటిస్టీషియన్స్ కోర్సు మొదలుపెడ్తున్నామనీ, ఇంటరెస్టు ఉన్నవాళ్ళను దానికి అప్లై చెయ్యమనీ, ఎంపికైనవారికి స్టైఫండ్ ఉంటుందని చెబుతూ. నేను వెంటనే దానికి అప్లై చేశాను. నేను బి.ఎస్.సి. ఆనర్స్ స్టాటిస్టిక్సు కోర్సు చేసాను గనుక వాళ్ళు నాకు నేరుగా ఈ కోర్సు 2వ సంవత్సరంలోకి ఎడ్మిషన్ ఇచ్చారు. నాకు నెలకు 400 రూపాయలు స్టైఫండ్ ఇచ్చేట్లు చెప్పారు. అది చదివి మా ఇంట్లో అందరూ చాలా సంతోషించారు.

## 10. ఐ.ఎస్.ఐ. కలకత్తాలో నా గ్రాడ్యుయేట్ చదువూ, స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్‌లో నా మొదటి ఉద్యోగం.

జులై 1955లో నేను కలకత్తా వెళ్ళడానికి ప్రయత్నం మొదలుపెట్టాను. అప్పటికి మాకు కలకత్తాలో ఎవ్వరూ తెలియరు. "నేను కలకత్తా వెళ్ళినప్పుడు ఎక్కడ ఉండాలి" అనేది ముఖ్య సమస్య, దీన్ని గురించి చాలామందిని అడిగాను. అదృష్టవశాత్తూ అప్పుడు మా కృష్ణమూర్తి మామయ్య మా ఇంటికి విజిట్‌కి వచ్చాడు. ఆయన్నూ అడిగాను. ఆయనకు మద్రాసులో గోవిందరాజులు అనే దగ్గర స్నేహితుడు ఉన్నాడు, ఈ గోవిందరాజులుగారు రైల్వేస్‌లో పనిచేశారు, ఆయన ఉద్యోగరీత్యా కలకత్తా చాలాసార్లు వెళ్ళారు. కృష్ణమూర్తి మామయ్య ఆయన్ని అడిగితే, ఆయన తను కలకత్తా విజిట్ చేసినప్పుడల్లా హౌరా రైల్వేస్టేషన్‌కి దగ్గర్లో ఒక వసతిగృహంలో ఉన్నట్లు చెప్పి వాళ్ళతో మాట్లాడి అక్కడే నేను ఉండేట్లు ఎకామొడేషన్ ఎరేంజి చేశారు.

నేను హౌరా స్టేషన్‌లో దిగి ముందు నా సామానుతో ఆ వసతిగృహానికి వెళ్ళాను. కలకత్తా నగరాన్ని మొట్టమొదటిసారి చూడడం నాకు చాలా విస్మయం కల్గించింది. అంత పెద్ద మహానగరం, హౌరా బ్రిడ్జి అంత పెద్ద బ్రిడ్జిని చూడడం నాకు అదే మొదటిసారి. ఎన్నో అంతస్థులుండే ఎత్తైన భవనాలతోనూ, మనుష్యులు, కారులు, బస్సులతో నగరం కిక్కిరిసి ఉంది. ఆ వసతిగృహం ఒక పొడుగాటి భవనంలోని, చాలా పైఅంతస్థులో, ఇరుకు గదులతోనూ, మురికి స్నానాల గదులతోనూ నాకు చాలా చికాకు కల్గించింది. అక్కడ ఉంటే నాకు చదువుకోడానికి వీలుపడదు అనిపించింది. కాలకృత్యాలు ఎలానో పూర్తిచేసి ఐ.ఎస్.ఐ.కి వెళ్ళడానికి బయల్దేరాను.

ఐ.ఎస్.ఐ. నగరానికి 10 మైళ్ళ దూరంలో బారక్‌పూర్ ట్రంకు రోడ్డుమీద, చాలా విశాలమైన స్థలంలో ఉంది. ఐ.ఎస్.ఐ. కాంపౌండ్‌లో ఎన్నో చెట్లు, 3 సరస్సులూ ఉన్నాయి. ఆఫీసులూ, క్లాసురూములూ, 5 అంతస్థుల పెద్ద భవనంలో ఉన్నాయి, పక్కన ఇంకొక కాంపౌండులో 2 అంతస్థుల భవనంలో కొన్ని హాస్టల్స్ అవీ ఉన్నాయి. ఇంత విశాలంగా, హాయిగా ఉన్న ఐ.ఎస్.ఐ. కాంపౌండుని చూసి నాకు చాలా సంతోషం కల్గింది. జాయిన్ అయిపోయిన వెంటనే వాళ్ళు నాకు హాస్టల్ ఎకామొడేషన్ కూడా ఎరేంజి చేశారు. ఇది చూసి నా మనస్సు కుదుటపడింది. ముందు దిగిన ఆ వసతిగృహానికి వెళ్ళి, నా సామాను తెచ్చేసుకొని, ఐ.ఎస్.ఐ.లో సెటిల్ అయ్యాను.

అప్పుడు ఐ.ఎస్.ఐ.కి హెడ్ ప్రశాంతచంద్ర మహాలనోబిస్ (పి.సి.యం) అనే ఆయన. ఆయనే ఐ.ఎస్.ఐ.ని స్థాపించారు. ఈ ప్రయత్నంలో ఆయన సతీమణి రాణి మహాలనోబిస్ ఆయనకు చేయూత నిచ్చేవారు. పి.సి.యం. ఇంగ్లాండులో స్టాటిస్టిక్సు చదువుకున్నారు, ఆ సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ కూడా అక్కడే చదివారు కనుక, పి.సి.యం. నెహ్రూ స్నేహితుడట, స్టాటిస్టిక్సు అప్పుడే డెవలప్ అవుతున్న కొత్త సబ్జెక్టు. దానికి చాలా అప్లికేషన్లు ఉన్నాయి. ప్రశాంతచంద్ర మహాలనోబీస్‌కి స్టాటిస్టిక్సుని ఇండియా అభివృద్ధికని చేస్తున్న ప్రయత్నంలో వాడాలని చాలా ఉత్సాహం. పి.సి.యం. దంపతులు మా హాస్టల్ పక్కనే ఒక భవనంలో ఉండేవారు, హాస్టల్‌లో ఉంటున్న నేను వాళ్ళని తరచూ అక్కడ చూస్తుండేవాణ్ణి. పి.సి.యం.కి నెహ్రూతో మంచి స్నేహం గనుక ఐ.ఎస్.ఐ. (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్)కి ప్రభుత్వం నుంచి ఫండ్స్ లభించేవి.

ఐ.ఎస్.ఐ.లో ముఖ్యంగా 3 డివిజన్లు ఉండేవి. వాటిలో ఒకటి ఆర్.టి.ఎస్. (రిసెర్చ్ & ట్రైనింగ్ సెక్షన్). ఈ డివిజన్ పని రిసెర్చి చెయ్యడం, పలురంగాల్లో స్టాటిస్టిక్సుని వాడడంలో విద్యార్థులను ట్రైయిన్ చెయ్యడం, మా 3 సంవత్సరాల కోర్సుని ఈ డివిజన్‌లోని ప్రొఫెసర్లే నడిపేవాళ్ళు, ఈ డివిజన్‌కి అప్పుడు హెడ్ డా॥ కల్యాంపూడి రాధాకృష్ణరావు అనే తెలుగాయన.

2వ డివిజన్ ఎన్.ఎస్.ఎస్. నేషనల్ శాంపిల్ సర్వేస్. వీళ్ళ పని స్టాటిస్టికల్ శాంప్లింగ్ వాడి, అన్ని రంగాల్లో దేశంలో పరిస్థితులు ఎలా ఉన్నాయో చెప్పే స్టాటిస్టిక్స్ తయారుచెయ్యడం. ఉదాహరణకు, దేశంలో పలురకాల పంటలు ఎన్ని ఎకరాల భూముల్లో పండిస్తున్నారు, వాటి ఉత్పత్తులు ఎంతెంత ఉన్నాయి, వగైరా.

స్టాటిస్టిక్సుని పరిశ్రమల్లో తయారవుతున్న వస్తువుల క్వాలిటీని అభివృద్ధి చెయ్యడానికి వాడే పద్ధతులను ఎస్.క్యూ.సి. (స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్) అంటారు. ఈ 3వ డివిజన్ క్రింద, పలు ఎస్.క్యూ.సి. యూనిట్స్ ఉన్నాయి. వాళ్ళ పని ఎస్.క్యూ.సి. వాడకాన్ని వస్తువులు తయారుచేస్తున్న పరిశ్రమల్లో ప్రమోట్ చెయ్యడం, ఈ

డివిజన్‌లో కంపెనీలలో ఉత్పత్తి అవుతున్న పలురకాల వస్తువుల క్వాలిటీ అభివృద్ధి చేసే కన్సల్టింగ్ యూనిట్లు ఉన్నాయి. వీళ్ళ సహాయానికి కంపెనీలు ఈ యూనిట్స్‌కి కన్సల్టింగ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

నేను చేరిన 3 సం॥లు కోర్సు పేరు కొన్ని సంవత్సరాల తర్వాత, ఎమ్. స్టాట్ (మాస్టర్ ఇన్ స్టాటిస్టిక్స్)కి మార్చేశారు.

ఐ.ఎస్.ఐ.లో నాకు ఎక్కువ ఖర్చు అయ్యేది కాదు, నా స్టైఫండ్ డబ్బు మిగతా భాగం అంతా నాన్నకు పంపించేసేవాణ్ణి, ఇంటి ఖర్చులకు, తమ్ముళ్ళు, చెల్లెళ్ళ చదువు ఖర్చుల గురించి.

నేను కోర్సు 2వ సంవత్సరంలో చేరాను కదా, ఆ సంవత్సరం మా కోర్సులన్నీ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్సు సబ్జెక్టులో థియరీ కోర్సులే. ఈ కోర్సులు ఆ సంవత్సరంతో అయిపోయాయి. 3వ సంవత్సరం స్పెషలైజు చేసే సబ్జెక్టులో ప్రాక్టికల్ ట్రైనింగు.

మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్సులో థియరెటికల్ రిసెర్చి చెయ్యదల్చుకున్నవారు ఆర్.టి.ఎస్. డివిజన్‌లో చేరతారు. శాంపిల్ సర్వేస్ చెయ్యదలచుకున్నవారు ఎన్.ఎస్.ఎస్. డివిజన్‌లో చేరాలి.ఇండస్ట్రియల్ అప్లికేషన్స్ నేర్చుకోదలచుకున్న విద్యార్థులు ఎస్.క్యూ.సి. (స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్) డివిజన్‌లో చేరాలి.

నాకు థియరీ, ప్రాక్టికల్ అప్లికేషన్స్ రెండిట్లోనూ చాలా ఇంటరెస్టు. బి.ఎస్.సి.ఆనర్స్‌లోనూ, ఈ సంవత్సరమూ థియరీ నేర్చుకున్నాను. నాకు అవసరమైన మిగతా థియరీ నేనే స్వయంగా చదువుకొని నేర్చుకొనగలననే ధైర్యం నాకు ఉంది. ఇంతవరకూ ప్రాక్టికల్ అప్లికేషన్స్ మాత్రం చూడలేదు, అందుకని నేను ఎస్.క్యూ.సి. (స్టాటిస్టికల్ క్వాలిటీ కంట్రోల్)లో స్పెషలైజ్ చేస్తానని చెప్పాను. నన్ను ఎస్.క్యూ.సి. యూనిట్ కలకత్తా వాళ్ళు తీసుకున్నారు ప్రాక్టికల్ ట్రైనీగా. ఇలా ఎస్.క్యూ.సి.లో స్పెషలైజ్ చెయ్యదల్చుకున్న నా క్లాసుమేట్సుని కొందర్ని బాంబే, బరోడా, త్రివేండ్రం ఎస్.క్యూ.సి. యూనిట్‌లకు పంపించారు. నేను అప్పటి వరకూ మద్రాసు, కలకత్తా నగరాలనే చూశాను. నన్ను కూడా ఇంకొక నగరానికి పంపించి ఉంటే ఆ నగరం చూసే ఛాన్సు వచ్చేదే, ఆ ఛాన్సు మిస్సవుతున్నానని నాకు కొద్దిగా విచారం వేసింది. కానీ, కలకత్తా యూనిట్‌లో చేరడం నాకు చాలా చాలా అదృష్టకరం అయ్యింది (నా భవిష్యత్తుకి). దీని వివరాలు చెప్తాను.

ఎస్.క్యూ.సి. యూనిట్ కలకత్తా ఉండేది. ఆ కాలంలో ఎస్ప్లనేడ్, కలకత్తా మహానగరం యొక్క డౌన్ టౌన్ సెంటరు. బి.టి. రోడ్డు మీద ఐ.ఎస్.ఐ. (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్) హెడ్‌క్వార్టర్స్ నుంచి వెళ్ళాలంటే అక్కడ నుంచి షాంబజార్‌కి ఒక బస్సు తీసుకోవాలి, అక్కడనుంచి ఇంకొక బస్సులోకి మారి ఎస్ప్లనేడ్ వెళ్ళాలి. సుమారు గంట పట్టేది, కన్వీనియంట్ బస్సులుండేవి. బి.టి. రోడ్డు మీదే ఐ.ఎస్.ఐ. (ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్) హెడ్ క్వార్టర్‌కి దగ్గర్లో నేను ఇంకొంతమంది బ్రహ్మచారులైన ఐ.ఎస్.ఐ. ప్రాక్టికల్ ట్రైనీస్ కలిసి ఒక ఎపార్ట్‌మెంటు అద్దెకు తీసుకున్నాం. అక్కడ ఉంటూ రోజూ ఎస్.క్యూ.సి. యూనిట్‌కి వెళ్ళి వచ్చేవాణ్ణి.

ఎస్.క్యూ.సి. యూనిట్ కలకత్తా ప్రాక్టికల్ ట్రైనింగ్‌లో నేను జ్యూట్, స్టీలు పరిశ్రమల్లో ప్రాక్టికల్ అప్లికేషన్స్ గురించి చాలా నేర్చుకున్నాను, అనుభవం సంపాదించాను.

అప్పుడు ఇండియాలో పరిశ్రమలను అభివృద్ధి చెయ్యడానికి యునైటెడ్ నేషన్సువాళ్ళు ఐ.ఎస్.ఐ.కు ఒక

గ్రాంటు ఇచ్చారు. ఈ గ్రాంట్‌మీద, అమెరికా, ఇంగ్లాండుల నుంచి మా ఎస్.క్యూ.సి. యూనిట్ వాళ్ళకు నేర్పించడానికి ఎక్స్‌పర్టులను పంపడం మొదలెట్టారు. నేను ప్రాక్టికల్ ట్రైనింగులో ఉన్నప్పుడు ఇంగ్లాండు నుంచి డెస్మండ్ అనే ఆయన తన కుటుంబంతో వచ్చి 3 ఏళ్ళపైనే ఉన్నాడు. ఈయన మాతో కంపెనీలకు వచ్చి, పని చేస్తుండేవాడు, మాకు సబ్జెక్టు మీద లెక్చర్లు ఇచ్చాడు. అలాగే అమెరికానుంచి ఒకరి తర్వాత ఒకరు ముగ్గురు వచ్చారు. వీళ్ళతో పని చెయ్యడం నాకు చాలా నేర్పించాయి, చక్కగా లెక్చర్లు ఇవ్వడం కూడా అలవాటయ్యింది.

1956లో వేసవి సెలవుల్లో నేను అమ్మా నాన్నల దగ్గరకు వెళ్ళాను. తర్వాత ఎస్.క్యూ.సి. యూనిట్ కలకత్తాలో ప్రాక్టికల్ ట్రైనింగ్‌కి బయల్దేరే ముందు మా నాన్నకు హైద్రాబాద్‌లో స్టేట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకి ట్రాన్స్‌ఫర్ వచ్చింది. అప్పుడు మా కుటుంబం అంతా గుంటూరు నుంచి హైదరాబాద్‌కి మారాలి. నేను గుంటూరు నుంచే కలకత్తా వెళ్ళాను ప్రాక్టికల్ ట్రైనింగుకి.

ఈ వేసవి సెలవుల్లో నేను అమ్మా నాన్నలను విజిట్ చేస్తున్నప్పుడు నాకు రెండు విషయాలు తెలిసాయి ఇంట్లో.

మొదటిది నా తమ్ముడు శ్రీరాములు బాగా చదువుకోడం లేదని. వాడు ఎస్.ఎస్.ఎల్.సి. పరీక్షలు తప్పి, పరీక్ష మళ్ళీ తీసుకోవలసి వచ్చింది. వాడికి ఎలాగైనా బాగా చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవడం చాలా ముఖ్యం అని చెప్పమని నన్ను అడిగారు సీరియస్‌గా నాన్న. అప్పుడు వాడు ఇంటర్‌మీడియట్ చివరి సంవత్సరం చదువుతున్నాడు.

శ్రీరాములుకి ఎలా చెప్పాలా అని ఆలోచించాను. ముఖాముఖి "బాగా చదువుకోరా" అని చెబితే ఫలితం ఉండదని నాకనిపించింది. దీన్ని గురించి నేను ఏమి చేశానో నాకు ఇప్పుడు గుర్తులేదు, కానీ శ్రీరాములే చాలా సంవత్సరాల తర్వాత నాకు చెప్పాడు. నేను ఐ.ఎస్.ఐ. కలకత్తాకు వెళ్ళిపోయాక, ఒక రోజు వాడు చదువుకోడానికి తన క్లాసు పుస్తకం తెరిచి చూస్తే, దాంట్లో ఒక కాగితం మడతబెట్టి ఉందట. అది తెరచి చూస్తే, ఒక ఉత్తరం అని తెలిసిందట. దాంట్లో ఇలా రాసి ఉందట.

"చిరంజీవి శ్రీరాములుకు దేవుడు దీవించి వ్రాయునది. నువ్వు శ్రద్ధగా చదువుకోవడం లేదని మీ నాన్నగారు ఎంత బాధ పడ్తున్నారో నీకు తెలిసే ఉంటుంది. నువ్వు గ్రహించుకొని నీ కృషి నువ్వు చేస్తే నీ శ్రమకు తగ్గ ఫలితం దక్కుతుందని నేను నీకు హామీ ఇస్తున్నాను, కనుక త్రికరణశుద్ధిగా నీ కృషి మొదలుపెట్టు" ఇట్లు దేవుడు.

దీని తర్వాత శ్రీరాములు పరీక్షల్లో మంచిమార్కులతో పాసు అవడం మొదలుపెట్టాడు. అప్పుడు చెప్పాడు, ఆ దేవుడు ఉత్తరం నా చేతిరాతలో ఉందని తను గ్రహించాడట.

రెండవది, నా పెళ్ళి గురించి, పేరక వీరబ్రహ్మం మామయ్య పెద్దమ్మాయి పుట్టినప్పుడు పందిళ్ళపల్లిలో మా నాయనమ్మ వాళ్ళకు "ఈ అమ్మాయిని నా మనవడు గోపాలంకి ఇచ్చి పెళ్ళి చేస్తాం" అని వాగ్దానం చేసారట. మా నాన్నగారికీ ఈ అమ్మాయిని తన పెద్దకోడలిగా చేసుకోవాలని చాలా కోరికగా ఉండేది. నేను

వేసవి సెలవల్లో ఇంటికి వచ్చేముందే వాళ్ళు మా ఇంటికి వచ్చి "అబ్బాయికి చదువు అయిపోయింది గదా, ఈ పెళ్ళి తర్వగా చేసేద్దాం" అన్నారట.

వాళ్ళకు "మా అబ్బాయి వచ్చే నెల ఇంటికి రాబోతున్నాడు, అప్పుడు వాడితో మాట్లాడి నిశ్చయం చేసి మీకు కబురంపుతాం" అని చెప్పారట నాన్న. నన్ను పెళ్ళి ఎప్పుడు పెట్టమంటావు అని నాన్న అడిగారు.

కలకత్తాలో బెంగాలీ స్నేహితులు చెప్పారు, దగ్గర బంధువులు పెళ్ళి చేసుకుంటే, పుట్టే పిల్లలకు ఏదో లోపం ఉండే ఛాన్సు ఎక్కువని, అందుకని బెంగాలీ ఆచారం ప్రకారం దగ్గర బంధువులకు పెళ్ళి నిషిద్ధం. పేరక వీరబ్రహ్మం మామయ్య మాకు చాలా దగ్గర బంధువు కదా, కనుక ఆయన కూతుర్ని పెళ్ళి చేసుకోవడం నాకు ఇష్టం లేదని మా నాన్నగారికి నేను చెప్పినది నచ్చలేదు. "ఆ పిల్ల పుట్టినప్పుడే తను నీ పెళ్ళాం అవుతుందని చెప్పాముదా. మరి ఇప్పుడు ఆ పిల్లను చేసుకోము అని ఎలా చెప్పగలంరా? ఆలోచించి ఒప్పేసుకో" అని బలవంతం చేసారు నాన్న. మా అమ్మగూడా "ఆ సంబంధం చాలా మంచిదిగా, ఒప్పుకో బాబూ" అని అంది. ఈ చర్చ ఇలా చాలా సంవత్సరాలు సాగింది.

1957 జూన్‌లో ఎస్.క్యూ.సి. యూనిట్ కలకత్తాలో నా ప్రాక్టికల్ ట్రైనింగ్ పూర్తి అవడంతో ఇండియాలో నా విద్యార్థి దినాలు ముగిసాయి. 1952 జులై నుంచి అంతవరకు నేను సంవత్సరంలో చాలా కాలం మా అమ్మ, నాన్న, తమ్ముళ్లు, చెల్లెళ్ళకి దూరంగా గడిపినా, వేసవి కాలం సెలవులకు ఇంటికి తిరిగి వస్తూ ఉన్నాను. ఇక ఇప్పుడు ఉద్యోగం మొదలెట్టాక, అమ్మా, నాన్నలను అంత తరచుగా చూసే అవకాశం లేకపోవచ్చని అనిపించి చాలా విచారం కల్గింది. కానీ నేను ప్రతి వారం అమ్మా నాన్నలకు నా విషయాలు తెలుపుతూ ఉత్తరాలు రాయడం చేస్తూనే ఉన్నాను. వాళ్ళిద్దరూ నాకు తరచుగా అక్కడ కుటుంబంలో జరుగుతున్న విషయాలను వివరంగా ఉత్తరాలలో తెలుపుతుండేవారు. వాళ్ళ ఉత్తరం చదువుతున్నప్పుడు నేకు అక్కడే వాళ్లతో ఉన్నట్లనిపించి చాలా బావుండేది.

ఈ ఐ.ఎస్.ఐ. ఎస్.క్యూ.సి. యూనిట్ వాళ్ళే నన్ను కన్సల్టెంట్‌గా తీసుకొని, నన్ను కలకత్తా ఎస్.క్యూ.సి. యూనిట్‌లో చేరమన్నారు, అలాగే ప్రాక్టికల్ ట్రైనింగు పొందిన నా మిగతా క్లాసుమేట్సుని కొందర్ని బొంబాయి, కొచ్చిన్, బరోడా ఎస్.క్యూ.సి. యూనిట్లలో కన్సల్టెంట్స్‌గా తీసుకున్నారు.

ఈ ఎస్.క్యూ.సి. యూనిట్‌కి హెడ్ ఎస్.సి.సెన్ (సురేష్ చంద్రసెన్) అనే ఆయన.ఆయన బ్రహ్మచారి, ఆయన చెల్లెలు ఒకావిడ ఆయన ఎపార్ట్‌మెంటులో ఉండేది. ఈయన క్వార్టర్స్ ఐ.ఎస్.ఐ. బిల్డింగు దగ్గరే ఉండేది. ఆయన నన్ను తన ఎపార్టుమెంటుకి వచ్చి, నేను చేస్తున్న ప్రాజెక్టుల వివరాలు చెప్పమనేవారు. కొన్నాళ్ళ తర్వాత తనతో ఉంటున్న తన మేనల్లుడు ధ్రువకు మ్యాథమెటిక్సులో ట్యూషన్ చెప్పమన్నారు.

అప్పుడు ఐ.ఎస్.ఐ.కి అమెరికా, ఇంగ్లాండు, యూరప్‌ల నుంచి విజిటర్సు వచ్చి లెక్చర్లు ఇచ్చేవారు. ఆ లెక్చర్లకు నేను వెళ్ళేవాణ్ణి. అప్పుడు నేను ఐ.ఎస్.ఐ.లో పి.హెచ్.డి. చేద్దామని నిశ్చయించుకొని, స్టాటిస్టిక్సులో థీసిస్ టాపిక్ కొరకు వెదుకుతున్నాను. కానీ ఐ.ఎస్.ఐ.లో ప్రొఫెసర్లు చెప్పిన స్టాటిస్టిక్సు టాపిక్స్ ఏవీ నాకు పెద్ద ఉత్సాహకరంగా కన్పించలేదు. ఈ విదేశీ విజిటర్లు తమ లెక్చర్లలో ఏదైనా ఇంటరెస్టింగ్ రిసెర్చి టాపిక్ చెప్తారేమో అని నా ఆశ.

ఈ సందర్భంలో 1959లో ఒక పడుచు అమెరికన్ ప్రొఫెసర్, తన పడుచు భార్యతోబాటు కొన్ని లెక్చర్లు ఇవ్వడానికి వచ్చాడు. ఆవిడ అందాల సుందరి. అందరితోనూ ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ ఉండేది. ఆయన లెక్చరివ్వడానికి కేంపస్ వచ్చినప్పుడల్లా ఆయనతో తనూ వస్తుండేది, ఆయన లెక్చర్ ఇస్తున్నప్పుడు, తను వెనకి బెంచీమీద తన అల్లికపని చేసుకుంటూ కూర్చుండేది.

తన మొదటి లెక్చర్లో ఆయన ఒక కొత్త సబ్జెక్టు ఆపరేషన్ రిసెర్చి గురించి చెప్పారు. ఈ పేరు ఇంతకు ముందు ఎప్పుడూ వినలేదు. ఈ కొత్త సబ్జెక్టులో చాలా ఇంటరెస్టింగ్ రిసెర్చి సమస్యలు ఉన్నాయన్నారు. ఉదాహరణకు "ట్రావెలింగ్ సేల్స్‌మన్ ప్రాబ్లమ్" (టి.ఎస్.పి.) గురించి చెప్పారు.

టి.ఎస్.పి.లో ఒక సేల్స్‌మన్ తన నగరంలో తెల్లవారు ఝామునే బయల్దేరి, కొన్ని నగరాలు ఒకటి తర్వాత ఇంకొకటి చొప్పున విజిట్ చేసి, చివరకు తన నగరానికి తిరిగి రావాలి, ఈ సమస్యకు ఇచ్చిన డేటా, ప్రతి రెండు నగరాల మధ్యా ప్రయాణం చెయ్యడానికి అయ్యే ఖర్చు.

మొత్తం n నగరాలు తిరగాలి అనుకుందాం నగరం i, jల మధ్య ప్రయాణానికి ఖర్చు C-ij $ అనుకుందాం, ఈ C = (Cij) మెట్రిక్సు ఈ ప్రాబ్లంకి డేటా. ఈ డేటా వాడి, తన నగరం నెంబర్ 1 నుంచి బయల్దేరి, మిగతా నగరాలు ఏ ఆర్డర్‌లో విజిట్ చేస్తే అతని మొత్తం ప్రయాణం అతి తక్కువ ఖర్చుతో జరుగుతుందో కనుక్కోవాలి. ఆ ఆర్డర్‌ను ఆప్టిమమ్ టూరు అంటారు. అది ఎఫిషియంట్‌గా కనిపెట్టాలి, ఈ టి.ఎస్.పి.కి ఇంతవరకూ ఎవరూ మంచి పద్ధతి కనుక్కోలేదు అని ఆయన చెప్పారు.

ఇది విన్నాక నేను స్టాటిస్టిక్సులో బదులు, ఆపరేషన్స్ రిసెర్చిలో పి.హెచ్.డి. చెయ్యాలని నిశ్చయించుకున్నాను, టి.ఎస్.పి.ని ఎలా సాల్వ్ చెయ్యాలా అని ఆలోచించడం మొదలెట్టాను.

దాని తర్వాత ఎవరైనా "మూర్తీ! నువ్వు ఏమి చెయ్యబోతున్నావు?" అని అడిగితే "ఆపరేషన్స్ రిసెర్చిలో పి.హెచ్.డి. చేద్దామనుకుంటున్నాను" అని చెప్పేవాడిని. ఆపరేషన్స్ రిసెర్చా, అదేంటి, ఆ పేరు మేము ఎప్పుడూ వినలేదే అని అడిగేవారు. ఆ కాలంలో ఏ ఇండియన్ యూనివర్శిటీలోనూ ఆపరేషన్స్ రిసెర్చి టీచ్ చేసేవారు కాదు.

ఆ సమయంలో ఒక ప్రొద్దున్న ఐ.ఎస్.ఐ.మెయిన్ కేంపస్‌లో నేను ఒక లెక్చర్ అటెండ్ అయినప్పుడు డా॥ సి.ఆర్. రావుగారు నన్ను తన ఆఫీసు గదికి రమ్మని కబురు పంపారు. నేను ఆయన గదికి వెళ్ళాను. అప్పుడు రావుగారి ముందు ఈ విజిటింగ్ ప్రొఫెసర్‌గారి భార్య కూర్చొని ఉంది. రావుగారు చెప్పారు "మూర్తీ, నువ్వు ఇవ్వాళ్టి స్పీకర్‌గారి సతీమణిని కలిసే ఉంటావు. ఇవ్వాళ ఆవిడ కలకత్తా సైట్ సీయింగు వెళ్తున్నారు ఐ.ఎస్.ఐ. కారులో. నువ్వు ఆవిడతో వెళ్ళి, విక్టోరియా మెమోరియల్, కాళీగుడి అవన్నీ ఆవిడకు చూపించగలవా?" అని. నేను ఒప్పుకున్నాను. మేము ఐ.ఎస్.ఐ. కారులో వెంటనే బయల్దేరాం.

దారిలో ఆవిడ అడిగింది "మూర్తీ! నువ్వు ఇప్పుడు ఏమి చేస్తున్నావ్?", నేను "మేడమ్! నేను ఆపరేషన్స్ రిసెర్చిలో పి.హెచ్.డి. చేద్దామనుకుంటున్నాను" అని చెప్పాను. అందరిలాగా "ఆపరేషన్స్ రిసెర్చి" అంటే ఏమిటి? అని ఆవిడ అడగలేదు. ఆవిడ భర్త ఆపరేషన్స్ రిసెర్చి టీచ్ చేస్తారు కదా, దాన్ని గురించి ఆవిడకు తెలిసే ఉంటుంది అనుకున్నాను.

మేము సైట్ సీయింగ్ అంతా పూర్తి చేసుకొని తిరుగు ప్రయాణం మొదలెట్టేసరికి చీకటి పడింది. మేము చిత్తరంజన్ ఎవెన్యూ మీద షాంబజార్ వైపు తిరిగి వస్తుండగా, ఎడమవైపు పెద్ద భవనాలు, లోపల బోలెడు లైట్లతో కనపడ్డాయి. అవి చూసి "మూర్తీ, అక్కడ ఏమున్నాయి" అని అడిగింది. అప్పుడు మా మధ్య సంభాషణ ఇలా సాగింది.

నేను: మేడమ్, అవి కలకత్తా జనరల్ హాస్పిటల్ భవనాలు, ఈ హాస్పిటల్ ఇప్పుడు ఆసియా ఖండంలో అన్నిటికన్నా పెద్దది, వాళ్ళకు 1100 ఇన్ పేషెంటు బెడ్లు ఉన్నాయి.

ఆవిడ: మూర్తీ, నువ్వు ఈ హాస్పిటల్‌లో చాలా టైము గడుపుతుండాలి కదా!

ఆవిడ ఇలా ఎందుకన్నదో నాకు అర్థంకాక "మేడమ్, మీరు అలా ఎందుకు అనుకుంటున్నారు? ఇంతవరకూ అదృష్టవశాత్తూ నా ఆరోగ్యం బాగానే ఉంది" అన్నాను. ఆవిడ "మూర్తీ, మరి నువ్వు ఆపరేషన్ల మీద రిసెర్చి చేస్తున్నానన్నావు కదా!"

నాకు అప్పుడు అర్థం అయ్యింది. ఆవిడకు చెప్పాను "నేను సర్జికల్ ఆపరేషన్స్ మీద రిసెర్చి చెయ్యడం లేదు. మీ భర్త లెక్చరిస్తున్న "ఆపరేషన్స్ రిసెర్చి" సబ్జెక్టులో పి.హెచ్.డి. చేద్దామనుకుంటున్నాను" అని. అప్పుడు ఇద్దరం పగలబడి నవ్వుకున్నాం.

నేను ఇలా టి.ఎస్.పి.ని ఎలా సాల్వ్ చెయ్యాలా అని ఆలోచించుతూ ఉండడం మా డైరెక్టర్ ఎస్.సి.సెన్‌గారు గమనించారు. ఒక రోజు తన ఎపార్ట్‌మెంట్‌కి పిలిచి దాని విషయం తనకు వివరంగా చెప్పమని అడిగారు. నేను ఆయనకు టి.ఎస్.పి.ని గురించి, ఆపరేషన్స్ రిసెర్చిని గురించి చెప్పాను. టి.ఎస్.పి. మీద పని చెయ్యమని ప్రోత్సహించారు. తనకు తెలిసినంత వరకు ఇండియాలో ఏ యూనివర్సిటీలోనూ ఈ రిసెర్చిలో నాకు సహాయం చెయ్యగల్గేవారు దొరకరు, కనుక నువ్వు యు.ఎస్.ఎ.కి వెళ్ళడానికి ప్రయత్నించు అని చెప్పారు. నేను ప్రయాణం ఖర్చుకి స్కాలర్‌షిప్పు సంపాదించుకుంటే, నాకు అక్కడ అయ్యే ఖర్చులకు ఐ.ఎస్.ఐ.కున్న యు.ఎన్. గ్రాంటు నుంచి డబ్బు ఇవ్వగలము అని చెప్పారు. నేను యు.ఎస్.ఎ.కి ట్రావెల్ గ్రాంటు ఎలా సంపాదించాలా అని ఆలోచిస్తున్నాను.

1959లో అదృష్టవశాత్తూ కలకత్తా యు.ఎస్. ఎంబసీ నుంచి ఇండియన్ విద్యార్థులకు యు.ఎస్. యూనివర్సిటీల్లో ఒక సంవత్సరం చదువుకోడానికి ట్రావెల్ గ్రాంట్సుకి అప్లై చెయ్యమని ప్రకటన చూశాను. అది ఎస్.సి.సెన్‌గారికి చూపించాను. వెంటనే అప్లై చెయ్యి, నేను మంచి రికమెండేషన్ లెటర్ ఇస్తాను అంటూ అప్పటికప్పుడే కూర్చొని తన లెటర్‌హెడ్‌పై చేతితో చక్కగా రాయడం మొదలెట్టారు. రికమెండేషన్ చేతి రాతతో పంపితే అమెరికన్లు దానికి ఎక్కువ విలువ ఇస్తారు అంటూ చక్కగా రాస్తున్నారు. కాని చివరి లైనులో ఏదో తప్పు దొర్లింది, సరే నీకు చక్కగా టైపు కొట్టించి రేపు ఇస్తాను, ఈ లోపల నువ్వు అప్లికేషన్ పూర్తి చెయ్యి అన్నారు.

ఇక యు.ఎస్.ఎ.లో ఏ యూనివర్సిటీకి చదువుకి వెళ్ళాలి అని ఆలోచించాను. అప్పుడు నాకు లైబ్రరీలో ఆపరేషన్స్ రిసెర్చి మీద ఒక టెక్స్ట్ బుక్కు కనపడింది, అది ఈ సబ్జెక్టు ఆపరేషన్ రిసెర్చిలో మొదటి టెక్స్ట్ బుక్, దాన్ని కేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, క్లీవులాండులో ముగ్గురు ప్రొఫెసర్లు కలిసి తయారుచేశారు. ఆ

పుస్తకం ఎస్.సి.సెన్‌గారికి చూపించాను. ఆయన ఆ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి ఒక సంవత్సరం ఆపరేషన్స్ రిసెర్చిలో కోర్సులు తీసుకొని నేర్చుకో అని చెప్పారు.

తమ్ముడు శ్రీరాములు 1957–1961 వరకూ కాకినాడ ఇంజనీరింగు కాలేజీలో టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగు చదివి, బాంబే అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఉద్యోగం సంపాదించి బాంబేలో ఉద్యోగం మొదలుపెట్టాడు. చెల్లెలు సరోజిని 1960 ఏప్రిల్‌లో మా మామయ్య (అమ్మ సొంత తమ్ముడు) కేదారిని పెళ్ళి చేసుకొని అతనితో బాంబే వెళ్ళిపోయి అక్కడే నివసిస్తోంది.

నేను ఫుల్ బ్రైట్ గ్రాంటుకి సెలెక్టు అయ్యాను, ఐ.ఎస్.ఐ. నాకు ఒక సంవత్సరం యు.ఎస్.ఎ.లో దినదిన ఖర్చులకు సరిపడ డబ్బు ఏర్పరిచారు, దీనికి నేను తిరిగి వచ్చాక ఎస్.క్యూ.సి. యూనిట్‌లో 3 సంవత్సరాలు పనిచేసేట్లు ఒప్పందం చేసుకున్నాను.

## 11. ఫుల్ బ్రైటు ట్రావెల్ గ్రాంటు మీద నా మొదటి ట్రిప్పు యు.ఎస్.ఎ.కి.

1961, 1962 సంవత్సరాల్లో మా కుటుంబంలో చాలా విశేషాలు జరిగాయి. 1961లో మా తమ్ముడు సాయికి ఆంధ్రా యూనివర్సిటీ, విశాఖపట్టణంలో బి.ఎస్.సి. ఆనర్స్ ఫిజిక్సు చదవడానికి ఫుల్ స్కాలర్ షిప్పు వచ్చింది. ఈ స్కాలర్‌షిప్పు రావడం మా కుటుంబానికి చాలా గర్వకారణం, మా అమ్మా, నాన్నలు చాలా సంతోషించారు. సాయి ఈ ప్రోగ్రాం 1965లో పూర్తి చేశాడు. ఆ తరువాత 1966లో తన ఎం.ఎస్.సి కూడా అక్కడే పూర్తి చేసాడు.

మా నాన్నగారు 1956 నుండి 1960 డిసెంబర్ వరకు హైద్రాబాద్ స్టేట్ ట్రాన్స్‌పోర్టు అథారిటీలో పనిచేసి, 1961లో నెల్లూరుకు ట్రాన్స్‌ఫర్ అయ్యారు. అప్పుడు కుటుంబం అంతా నెల్లూరుకి మారారు. నెల్లూరులో 1962లో తన 55వ ఏట ఉద్యోగం నుంచి రిటైరయి నాన్న కుటుంబాన్ని విజయవాడ ఇంటికి తరలించి, అక్కడ తన రిటైర్డ్ జీవితం మొదలెట్టారు.

అమ్మ దీవెనలందుకొని 1961 జూన్‌లో నేను ఫుల్ బ్రైట్ ట్రావెల్ గ్రాంటుమీద కేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, క్లీవులాండు, ఒహాయోకి బయల్దేరాను.

ఈ గ్రాంటులకు సెలెక్టు అయిన వారందరికీ ఫుల్ బ్రైట్‌వాళ్ళు ముందు బొంబాయిలో ఒక 2 వారాల ఓరియెంటేషన్ కోర్సు ఎరేంజి చేశారు. ఈ కోర్సులో అమెరికన్ యూనివర్సిటీల్లో కోర్సులూ, టీచింగ్ పద్ధతులూ ఎలా ఉంటాయో చెప్పారు, తర్వాత ఇండియన్ కల్చర్, దాని గొప్పతనం మీద చాలా లెక్చర్లు మంచి ఇండియన్ స్పీకర్లతో ఏరేంజి చేశారు. "మీరు అమెరికాలో ఉన్నప్పుడు, మీరు కలుసుకునే అమెరికన్లకు ఇండియన్ కల్చర్ గురించి చెప్పడానికి, మీకు ఈ లెక్చర్లు పెట్టించాం" అని చెప్పారు.

అప్పుడు బొంబాయిలో మా చెల్లెలు సరోజిని కుటుంబం ఉంటోంది. ఫుల్ బ్రైట్ ఓరియంటేషన్ తర్వాత, ఓడమీద బయల్దేరే ముందు ఒకటి, రెండు రోజులు సరోజిని వాళ్ళతో ఉన్నాను, వాళ్ళు అంబర్‌నాథ్ సబర్బులో ఉండేవారు.

ఆ రోజుల్లో ఇండియానుంచి ఆమెరికాకు వెళ్ళడానికి విమానాల్లో ఫ్లైట్సు ఉండేవి కావు. ఫుల్ బ్రైట్‌వాళ్ళు నాకు బొంబాయి నుంచి సౌత్ ఆమ్‌ప్టన్, ఇంగ్లాండుకి పి & ఓ ఓరియంట్‌వాళ్ళ ఓడమీద వాయేజి బుక్ చేశారు. తర్వాత సౌత్ ఆమ్‌ప్టన్ నుంచి న్యూయార్కుకి ఇంకొక ఓడమీద వాయేజి. న్యూయార్కు నుంచి క్లీవులాండ్, ఒహాయోకి రైలు మీద ప్రయాణం.

నేను బొంబాయి నుంచి బయల్దేరవల్సిన రోజున తెల్లవారక ముందే కుంభవృష్టి వర్షం కురవడం మొదలెట్టింది. బొంబాయి ప్రాంతం వర్షాలు నాకు ఆ రోజే మొదటి అనుభవం. కురవడం మొదలెడితే తెరపి లేకుండా చాలా రోజులు కురుస్తూనే ఉంటాయి. మేము ఆ కుంభవృష్టి వర్షంలో బయలుదేరాం నేను తీసుకువెళ్ళే సూట్‌కేసుతో.

బహుశా ఆ రోజుల్లో ఇప్పటిలాగా టాక్సీలు ఉండేవి కాదేమో. అప్పటికే కురిసిన వర్షంతో నేలమీద మోకాలులోతు నీళ్ళు ఉన్నాయి. ఆ నీళ్ళల్లో సూట్‌కేసు తడవకుండా ఉంటానికి దాన్ని తలమీద పెట్టుకొని రైలు స్టేషన్‌కి కనీసం కిలోమీటరు దూరం నడిచాము నేనూ, సరోజిని, కేదారి మామయ్య. మేము రైలుస్టేషన్ చేరే లోపల అందరం తడిసి ముద్దయిపోయాం, సూట్‌కేసూ, దాని లోపలి గుడ్డలు కూడా తడిసిపోయాయి. చివరకు ఇలా తడిసిన గుడ్డలు, శరీరం, సూట్‌కేసుతోనే నేను ఓడలో ఎక్కాను, నాకు ఇదే ఇండియా బయట మొదటి ప్రయాణం.

బొంబాయినుంచి సౌత్‌ఆమ్‌ప్టన్ ఇంగ్లాండుకి 20 రోజుల ఓడ ప్రయాణం. దారిలో ఓడ ఏడెన్, ఏథెన్స్, మెడిటరేనియన్ తీరంలో ఉన్న మరికొన్ని యూరోపియన్ పోర్టుల్లో ఆగింది. ఆగిన చోటల్లా, ఆ నగర దృశ్యాలను చూడడానికి ట్రిప్పులు ఉండేవి, వాటన్నిటిని నేను తీసుకున్నాను.

ఏడెన్ పోర్టులో జరిగిన ఒక ఉదంతం చెప్తాను. ఓడలో నా కేబిన్‌మేటు ఒక యువకుడు. ఏడెన్ పోర్టులో ఒక షాపులో వస్తువులు చూశాం. దాంట్లో ఒక వస్తువు నాకూ, నా కేబిన్‌మేట్‌కీ నచ్చింది. దాని ధర అక్కడ ఉన్న సేల్స్‌మెన్‌తో బేరం చెయ్యడం మొదలుపెట్టాం. ఆ సేల్స్‌మెన్ కూడా ముస్లిం అని తెలుస్తూనే ఉంది. అప్పుడు నా కేబిన్‌మేటు ఆ సేల్స్‌మెన్‌తో ఇలా అన్నాడు "చూడు నేను ముస్లింని, నువ్వు ముస్లిం. కనుక నువ్వు నాకు తక్కువ ధరకు ఇవ్వాలి" అని. దానికి ఆ సేల్స్‌మెన్ ఇచ్చిన జవాబు "నువ్వు నిజంగా ముస్లిం అయితే, నాలాంటి ముస్లిం సేల్స్‌మెన్ కనీస జీవిత అవసరాలు గ్రహించి, నేను చెప్తున్న ధరకే కొంటావు" నన్ను ఆశ్చర్యపరచింది.

ఆగిన నగరాలలోని ముఖ్యమైన చారిత్రాత్మక దృశ్యాలన్నీ నేను ఆ ట్రిప్పులో చూసే అవకాశం, ఆ నగరాల చరిత్ర వివరంగా తెలుసుకోడానికి అవకాశం నాకు లభించింది. నేను హైస్కూలు జాగ్రఫీ, హిస్టరీ క్లాసుల్లో చదువుకున్న సమాచారం అంతా స్వయంగా చూసే అదృష్టం నాకు ఈ ట్రిప్పులో లభించింది.

ఓడమీద ప్రతి రోజు రాత్రి నేను ఆ రోజున దర్శించిన ప్రదేశాల వివరాలన్నీ చక్కగా పెద్ద ఉత్తరంలో అమ్మానాన్నలకు రాసేసి, మరునాడు మెయిల్ చేసేవాణ్ణి. ఈ ఉత్తరాలను అమ్మా నాన్నలూ, తమ్ముళ్ళు, చెల్లెళ్ళూ, ఇతర స్నేహితులూ, బంధువులూ చాలా కుతూహలంతో చదివేవారని నేను తిరిగి వచ్చాక అమ్మ చెప్పింది.

సౌత్ ఆమ్‌ప్టన్ చేరాక, అక్కణ్ణుంచి ఇంకొక ఓడపై అమెరికాలోని న్యూయార్కుకి బయల్దేరాం. అది వారం రోజుల్లో న్యూయార్కు చేరింది. న్యూయార్కు చేరిన తర్వాత ఫుల్‌బ్రైట్ వాళ్ళు న్యూయార్కుకి ఉత్తరంలో ఉన్న

వర్మాంట్ రాష్ట్రంలో ఇంకొక ఓరియెంటేషన్ ప్రోగ్రాం పెట్టారు. తర్వాత అక్కడ నేను ఒక హోస్టు కుటుంబంతో వారం రోజులు ఉండేట్లు ఏర్పాటు చేసారు. ఆ కుటుంబంవాళ్ళు నాతో చాలా స్నేహంగా ఉన్నారు. నా కొరకని ఆవిడ స్పెషల్‌గా వెజిటేరియన్ వంటలు ఆవిడకు తెలిసినవి చేసేది. వాళ్ళు ఇండియా గురించి చాలా ప్రశ్నలు అడిగారు. తర్వాత భవిష్యత్తులో నేను ఏమి చెయ్యాలనుకుంటున్నానో చెప్పమన్నారు. వర్మాంటుని గురించి వాళ్ళని నేను అడిగాను, తమ రాష్ట్రంలో మనుష్యుల కంటే ఆవులు, ఎద్దులు చాలా ఎక్కువ సంఖ్యలో ఉన్నాయని చెప్పిన విషయం నన్ను ఆశ్చర్యపరచింది. ఈ ప్రోగ్రాం తర్వాత రైలుమీద నేను క్లీవులాండు, ఒహాయోకి వెళ్ళాను.

క్లీవులాండు ఇరీ సరస్సు తీరంలో ఉన్న నగరం. ఆ నగరంలో డౌన్‌టౌన్‌కి దూరంగా, ఇరీ సరస్సు తీరానికి దగ్గర్లో శ్రీమతి ఫ్రీమన్ అనే ముసలావిడ తన రెండతస్థుల ఇంట్లో ఉండేది. కింద అంతస్థులో ఆవిడ ఉండేది, పై అంతస్థులోని గదులను విద్యార్థులకు అద్దెకు ఇచ్చేది. నేను క్లీవులాండులో 1961–62 సంవత్సరం ఆవిడ ఇంట్లో ఒక గది అద్దెకు తీసుకొని ఉన్నాను. కేస్ ఇన్‌స్టిట్యూటులో ఒక అండర్ గ్రాడ్ విద్యార్థి రసెల్ అనే అతను నాకు రూమ్‌మేటు అప్పుడు. అంతా అతన్ని రస్ అని పిలిచేవారు. ఇంకొక గదిలో ఇద్దరు విద్యార్థులు కలిసి ఉండేవారు. మేమందరం రోజూ సిటీ బస్సులమీద కేస్ ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్ళి వచ్చేవాళ్ళం.

ఆ రోజుల్లో ఇండియన్స్ చాలా తక్కువమంది కన్పించేవారు అమెరికాలో, అస్సలు ఒక ఇండియన్ ముఖం చూడ్డమే చాలా అరుదుగా ఉండేది. ఎప్పుడైనా ఒక ఇండియన్ ఎదురైతే వెంటనే చేతులు కలిపి ఆప్యాయంగా మాట్లాడుకునేవాళ్ళం, మాకు తెలిసిన ఇండియా వార్తలు చెప్పుకునేవాళ్ళం.

అక్టోబర్ 1961కి వాతావరణం బాగా చల్లగా ఉండడం మొదలయ్యింది. మా ఇంటి ఓనర్ శ్రీమతి ఫ్రీమన్ ఇంట్లో వెచ్చగా ఉండడానికి ఫర్నెస్ ఆన్ చేసింది. వేడి ప్రదేశమైన మద్రాసు రాష్ట్రం నుంచి వచ్చిన నాకు దీన్ని గురించి ఏమీ తెలియదు అప్పుడు. మా గదిలో నా బెడ్ కిటికీకి పక్కనే ఉండేది. మద్రాసు రాష్ట్రంలో కిటికీలు తెరచి ఉంచుకుంటాం గదా, ఆ అలవాటుతో రాత్రిళ్ళు నా బెడ్ ప్రక్కన ఉన్న కిటికీ సగం తెరచి ఉంచేవాణ్ణి, పగలు కేంపస్‌కి వెళ్ళినప్పుడు మూసేవాణ్ణి కాదు. దీనివల్ల ఇంట్లోని ఫర్నెస్ ఎక్కువగా పని చెయ్యడం మొదలెట్టి ఉండవచ్చు, ఇది శ్రీమతి ఫ్రీమన్ గమనించి, మేము లేనప్పుడు మా గదికి వెళ్లి కిటికీ తెరచి ఉండడం చూసి, దాన్ని మూసేసి ఉంచమని నాకు వార్నింగు ఇచ్చింది. కిటికీ తెరచి ఉంచితే చల్లటి బయటి గాలి గదిలోకి వస్తూ ఉంటుంది, దానివల్ల ఫర్నెస్ బయటి గాలినంతా వేడి చెయ్యాల్సి వస్తోంది, అది ఉత్త వేస్టు కదా, కనుక చలికాలం అయిపోయేంత వరకూ ఆ కిటికీ తెరవవద్దు అని గట్టిగా చెప్పింది.

నా రూమ్‌మేట్ రస్ ఓహాయోకి పడమర వైపు ఉన్న మిచిగన్ రాష్ట్రం ఉత్తర భాగంలో ఉన్న గ్రేలింగ్ అనే గ్రామం నుంచి వచ్చాడు. డిసెంబర్ 1961లో ఫాల్‌టర్మ్ ముగిశాక, 10 రోజుల సెలవు ఉంది వింటర్‌టర్మ్ మొదలయ్యే ముందు. రస్ తల్లిదండ్రులు గ్రేలింగ్ నుంచి తమ కారులో అతన్ని సెలవులకి ఇంటికి తీసుకువెళ్ళడానికి వచ్చారు. వాళ్ళు నన్ను తనతోబాటు వాళ్ళ ఇంటికి తీసుకువెళ్తామన్నారు, మళ్ళీ రస్‌తోబాటు వింటర్ టర్మ్‌కి వెనక్కు తీసుకు వచ్చేస్తామని చెప్పారు, నేను ఒప్పుకుంటే ఆ సెలవు రోజుల్లో నాకు స్కీయింగ్ నేర్పిస్తామని చెప్పారు.

నేను అలానే వాళ్ళతో వెళ్ళాను, వాళ్ళ ఊరిలో రస్‌కి ఒక గర్ల్‌ఫ్రెండు ఉంది. వాళ్ళిద్దరూ నన్ను గ్రేలింగ్ స్కీ రిసార్ట్‌కు తీసుకువెళ్ళి నాకు స్కీయింగు నేర్పించారు.

ఒహాయోలో ఎక్కువ స్నో కురిసేది కాదు, కొద్దిగా కురిసినా, అది రెండు మూడు రోజుల్లో కరిగిపోయేది. మొట్టమొదట్లో స్నో పడడం, అది నేలమీదంతా కప్పుకు పోవడం చూసినప్పుడు, నాకు చాలా అద్భుతంగా కనిపించింది. మిచిగన్‌లో, ముఖ్యంగా మిచిగన్ ఉత్తర భాగంలో ఆ రోజుల్లో చాలా స్నో కురిసేది, కురిసిన స్నో చాలా రోజులు ఉండేది. అందుకనే గ్రేలింగ్ ప్రాంతంలో చాలా స్కీ రిసార్టులు ఉండేవి. స్కీ చెయ్యడం నాకు ముందు చాలా భయం వేసింది. కానీ రస్, అతని గర్ల్‌ఫ్రెండు నన్ను బాగా ప్రోత్సహించి, ఒకటి రెండు రోజుల్లో ఆ భయం బాగా తగ్గించారు, నాకు భయం లేకుండా స్కీ చెయ్యడం నేర్పించారు. క్లీవులాండు తిరిగి వచ్చే లోపు నేను భయం లేకుండా స్కీ స్లోప్ మీద స్కీ చెయ్యడం, దాని మజా ఆనందించడం మొదలుపెట్టాను. మా కుటుంబంలో ఇలా స్కీ చేసింది నేను ఒక్కణ్ణే అని చెప్పవచ్చు.

ఈ కొత్త విషయాలన్నీ వివరంగా పొడుగాటి ఉత్తరాలు అమ్మానాన్నలకు మునపటి లాగానే రాసి తెలిపాను. వాళ్ళు నాకు ప్రతి వారం ఇంటి విషయాలు తెలుపుతూ ఉత్తరాలు రాసేవారు.

ఆ 1961–62 ఎకడెమిక్ ఇయర్‌లో కేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఆపరేషన్స్ రిసెర్చి కోర్సులు తీసుకొని సబ్జెక్టు బాగా నేర్చుకున్నాను. రిసెర్చిలో కూడా బాగా ప్రోగ్రెస్ చేశాను. టి.ఎస్.పి. సాల్వ్ చెయ్యడానికి బ్రాంచ్ అండ్ బౌండ్ అనే కొత్త మెథడ్ డెవలప్ చేసాను, కేస్ ఇన్‌స్టిట్యూట్‌లో నా క్లాస్‌మేటు ఒకమ్మాయి ఆ మెథడ్‌కి కంప్యూటర్ ప్రోగ్రాం తయారుచేసింది, దాన్ని వాడి ఆ మెథడ్ టెస్టు చేశాం.

క్లీవ్‌లాండులో కూడా ఫుల్ బ్రైట్‌వాళ్ళు నాకు ఒక హోస్టు ఫామిలీ ఏర్పాటు చేసారు. కనీసం నెలకొకసారి మధ్యాహ్నం లంచ్ టైముకి వాళ్ళు వచ్చి నన్ను తీసుకువెళ్ళి మళ్ళీ సాయంత్రం డిన్నర్ అయిపోయాక డ్రాప్ చేసేవారు. ఫుల్‌బ్రైట్ వాళ్ళు బొంబాయిలో జరిపిన ఓరియెంటేషన్‌లోనే నేను గ్రహించాను నాకు ఇలా అమెరికన్ కుటుంబాల ఆతిథ్యం లభించవచ్చని. అందుకని ఇలా నాకు ఆతిథ్యం ఇచ్చినవారికి ఇవ్వడానికి, మనదేశపు ఆర్ట్ గిఫ్టులు నాతో తెచ్చుకున్నాను, అదృష్టవశాత్తూ అవి చాలా బాగా ఉపయోగపడ్డాయి, వాటిని చూసి నాకు ఆతిథ్యం ఇచ్చినవారు చాలా సంతోషించేవారు.

1962లో తిరుగు ప్రయాణం మొదలెట్టే ముందు, దారిలో యూరప్‌లో ఆగి సైట్ సీయింగు చెయ్యడానికి ఐ.ఎస్.ఐ. నుంచి 2 నెలలు సెలవు తీసుకున్నాను. యూరప్‌లో ఆగి రైలు ప్రయాణాలలో ఇంగ్లాండు, ఫ్రాన్స్, స్వీడన్, నార్వే, డెన్మార్క్, స్పెయిన్, ఇటలీ, జర్మనీ, ఆస్ట్రియా, చెకొస్లవేకియా దేశాల్లో సైట్ సీయింగ్ ట్రిప్పులు తీసుకొని ఐ.ఎస్.ఐ.కు 1962 సెప్టెంబర్‌లో తిరిగి వచ్చి డ్యూటీలో చేరాను.

## 12. నా వివాహం, వివాహ జీవితం మొదలుపెట్టడం.

1962 చివర్లో సెలవు తీసుకొని రిటైరై విజయవాడలో ఉంటున్న నాన్నగారిని, అమ్మనూ చూడడానికి వెళ్ళాను. అప్పుడు నాన్న, పేరక వాళ్ళల్లో దగ్గర బంధువులూ మళ్ళీ అడిగారు వీరబ్రహ్మంగారి పెద్దమ్మాయిని త్వరలో పెళ్ళి చేసుకోమని. "దగ్గర బంధువులు పెళ్ళి చేసుకుంటే, వాళ్ళకు వంకర పాదాలు మొదలైన సమస్యలతో

పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువ ఉంటుంది, అందుకని నాకు దగ్గర బంధువుల అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం ఇష్టం లేదు" అని మళ్ళీ చెప్పాను. అప్పుడు వాళ్ళు గ్రహించారు నేను ఈ పెళ్ళికి ఒప్పుకునేట్లు లేనని, అందుకు మా సంబంధం వదులుకొని ఆ అమ్మాయికి వేరే సంబంధం ఖాయం చేసుకున్నారు. ఇన్నాళ్ళూ జరుగుతున్న మా సంబంధం గురించి చర్చ ఆ అమ్మాయికి చాలా బాధ కల్గించి ఉండచ్చని నాకు తెలుసు, కానీ అది తగ్గించడానికి నేను ఏమీ చెయ్యలేకపోయాను.

1963లో నాకు 27 ఏళ్ళ వయస్సు వచ్చింది. నాకు పెళ్ళి చెయ్యాలని మా అమ్మా, నాన్న ఆదుర్దాగా ఉన్నారు. అప్పుడు విజయవాడ లయోలా కాలేజీలో కర్ణ రాజశేషగిరిరావుగారు హిందీ పంతులుగా ఉండేవారు. ఈయన నక్కలతోటలో మా పక్కఇంటి బళ్ళ కోటనాగయ్యగారి అల్లుడు. ఆయన భార్య శ్యామలాంబ నాకు చిన్నప్పటి నుంచీ తెలుసు, కనుక రాజశేషగిరిరావుగారు (మేము ఈయన్ను "రాజా" అని పిలిచేవాళ్ళం) మా కుటుంబానికి చాలా సన్నిహితంగా ఉండేవారు, తరచూ మేము కలుసుకునేవాళ్ళం. ఈ రాజాగారి హిందీ క్లాసులో కుందెం చినమహాలక్ష్మేశ్వరరావు (అందరూ అతన్ని "చిన్నారి" అని పిలిచేవారు) ఒక విద్యార్థి, అతను రాజాతో క్లోజ్‌గా ఉండేవాడు. ఈ చిన్నారి నన్ను రాజాగారి ఇంట్లో ఒకసారి చూసాడట, రాజాని అడిగాడట "రాజాగారూ! మా చెల్లెలు "మాత" ("మాత" అని వాళ్ళ ఇంట్లో పిలుస్తారు, అసలు పేరు "సూర్య విజయలక్ష్మీరత్నం") ఉంది. తనకు మా నాన్నగారు సంబంధాలు చూస్తున్నారు. గోపాలంగారికి మా సంబంధం సరిపోతుందేమో వాళ్ళ నాన్నగారితో మాట్లాడి కనుక్కోగలరా?" అని. రాజా మా అమ్మా నాన్నలతో చర్చించాడట. "అబ్బాయితో మాట్లాడి కనుక్కుంటాము" అని మా నాన్నగారు అన్నారట దానికి. అప్పుడు మా నాన్నగారు నన్నడిగి, పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తానురా, అమ్మాయిని చూసి నీ అభిప్రాయం చెప్పు అన్నారు.

అప్పుడు ఈ "మాత" తన పెద్దన్నయ్య కుందెం పెదమహలక్ష్మేశ్వరరావుతో అనంతపూర్‌లో ఉంటూ, అక్కడి హైస్కూలులో చదువుకుంటోంది, నేను మద్రాసు ఎస్.క్యూ.సి. యూనిట్‌లో ఒక ప్రాజెక్టు మీద పని చేస్తున్నాను. ఈ ప్రాజెక్టు అనంతపూర్‌కి దగ్గర ఇంకొక ఊర్లో ఉన్న ఒక కంపెనీలో జరుగుతోంది. అప్పుడు నేను కంపెనీని విజిట్ చేస్తున్నాను. అమ్మా, నాన్న అక్కడకు వచ్చారు. మాత పెద్దన్నయ్య ఒక రోజు కారులో వచ్చి మా అమ్మా, నాన్న, నన్ను ఎక్కించుకొని అనంతపూర్‌లో వాళ్ళ ఇంటికి తీసుకువెళ్ళి మాకు పెళ్ళిచూపులు జరిపించారు. తర్వాత తన కారులో వెనక్కు తీసుకువెళ్ళి డ్రాప్ చేసాడు. నాన్న "అబ్బాయితో మాట్లాడి మా అభిప్రాయం చెప్తామండీ" అని చెప్పి ఆయనను పంపించేశారు. "ఆలోచించుచుకొని త్వరలో వాళ్ళకు ఏమి చెప్పమంటావో చెప్పరా" అని చెప్పి అమ్మా నాన్న విజయవాడ వెళ్ళిపోయారు. నేను ఆ రాత్రే కలకత్తాలో నా ఆఫీసుకి వెళ్ళిపోయాను.

వారం రోజుల తర్వాత నాకు ఆఫీసు అడ్రసుకు ఒక ఇన్‌లాండు లెటర్ వచ్చింది. దానిమీద అడ్రసు నాకు తెలిసినవారు ఎవరూ రాసింది కాదు. ఎవరు రాసి ఉంటారా అనుకుంటూ దాన్ని తెరిచి చదివాను. ఇలా ఉంది.

"ప్రియమైన గోపాజీ, మీరు వచ్చి వెళ్ళారు. దానితో మీరు నాకు పెద్ద సమస్యను కల్గించి వెళ్ళారు. కాసేపు నేను అలా కుర్చీమీద కూర్చుంటే మా వదిన "అప్పుడే నీ ప్రియుడిని గురించి పగటి కలలు కంటున్నావా?" అంటూ వెక్కిరిస్తుంది. నా క్లాసు పుస్తకం తెరిచి చదువుకోడం మొదలుపెడితే మా అన్నయ్య "ఇప్పుడైనా బాగా చదివి గోపాలంగారిని ఇంప్రెస్ చేసేద్దామని చూస్తున్నావా?" అంటూ ఎగతాళి చేస్తున్నాడు. మీరు సృష్టించిన

సమస్య నుంచి మీరే నన్ను రక్షించాలి.......” అంటూ రాసి “మీ విజయ” అని సంతకంతో ఉంది.

నేను ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకున్నానో లెక్కలేదు. ఇలాంటి సమయంలో ఇంత చక్కటి ప్రేమలేఖని కంపోజ్ చేసిన ఆ అమ్మాయితో నా జీవితాన్ని ముడిపెట్టుకుంటే బావుంటుంది అని నాకు గట్టి అభిప్రాయం ఏర్పడింది. అందుకనే మా అమ్మా నాన్నలకు “ఈ సంబంధం నాకు బాగా నచ్చింది” అంటూ ఉత్తరం రాసేసాను. దీని తర్వాత విజయతో ప్రతివారం ఉత్తర ప్రత్యుత్తరాలు మాకు పెళ్ళయి తను కాపురానికి వచ్చేంతవరకూ కొనసాగాయి.

మా పెళ్ళి మోరిలో విజయ తల్లిదండ్రుల ఇంట్లో 2 ఫిబ్రవరి 1964 నాడు జరిగింది. మా కార్యం మరుసటి రోజు 3 ఫిబ్రవరిన పెట్టారు. ఆ రోజు ప్రొద్దున్న బయటి వరండా ముందు కట్టిన పందిరి కింద కుర్చీలో కూర్చొని ఉండగా విజయ చిన్న తమ్ముళ్ళు జయబాబు, ప్రసాద్ నా పక్కన కూర్చొని నాతో మాట్లాడడం మొదలెట్టారు. అప్పుడు ప్రసాద్‌కి సుమారు 10 ఏళ్ళు, జయబాబుకి 8 ఏళ్ళు ఉంటాయి. మా సంభాషణ ఇలా సాగింది.

ప్రసాద్, జయబాబు: బావగారూ, ఇవ్వాళ్ల మీ కార్యం చేస్తారండీ.

వాళ్ళను ఆటపట్టిద్దామని నేను ఇలా అన్నాను. ఆ విషయం నాకూ చెప్పారోయ్. నాకు “కార్యం” అంటే ఏమిటో తెలియదు, దానికి నేను ఏమి చెయ్యాలో మీరు చెప్పగలరా?

ప్రసాద్, జయబాబు: “కార్యం” అంటే ఇవ్వాళ రాత్రి అక్క మీ బెడ్‌లోకి వస్తుదండీ, మీరు చెయ్యాలండీ.

నేను: “అదేమిటోయ్, ఎందుకని? మీ ఇంట్లో మా అందరికీ సరిపోయినన్ని బెడ్‌లు లేవా? లేనప్పుడు మమ్మల్ని ఎందుకు పిలిచారోయ్ ??

ప్రసాద్, జయబాబు: అదేంటండీ బావగారూ అలా అంటారూ? ఇవ్వాళ మీ కార్యం గదండీ, మీరు చెయ్యాలండీ.

నేను: మళ్ళీ అదే చెప్తున్నారు, నాకు “కార్యం” అంటే ఏమిటో తెలియదని చెప్పాను గదా? నేను ఏమి చెయ్యాలో అర్థమయ్యేట్లు చెప్పండి ప్లీజ్ !

అప్పుడు వాళ్ళిద్దరూ మాట్లాడడం మానేసి, లోపలికెళ్ళిపోయారు. బహుశా పెద్దవాళ్ళెవరితోనో మాట్లాడడానికి వెళ్ళుంటారేమో అని నేననుకున్నాను.

కాసేపట్లో ఇద్దరూ మళ్ళీ వచ్చి నా పక్కన కూర్చొని ఇలా అన్నారు – బావగారూ, మా అక్కకు తెలిసే ఉంటుంది లెండి, ఇవ్వాళ రాత్రి మీరు మా అక్క చెప్పినట్లే చెయ్యండి.

ఇలా మా పెళ్ళి, కార్యం జరిగిపోయాయి, ఆ మొదటి రోజు రాత్రే మేము ఒకరినొకరిని ఎలా సంబోధించుకోవాలి అనే విషయం గురించి చర్చించుకొని నేను తనని బుల్లి అని, తను నన్ను బుజ్జి అని పిలుచుకునేటట్లు నిర్ణయించుకున్నాము. ఇప్పటికీ అలానే సంబోధించుకుంటున్నాము. తర్వాత నూతన దంపతులం తిరుపతి వెళ్ళి వెంకటేశ్వరస్వామి, అలిమేలుమంగ దైవదంపతులను దర్శించి వారి దీవెనలు పొందాం. అక్కడ శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానంవారి కాటేజీలో కొన్ని రోజులు గడిపాం. తర్వాత అనంతపూర్

వెళ్ళి అక్కడ ఒక హోటల్ గదిలో 2 రోజులు గడిపాం. ఆ రోజుల్లో విజయ హైస్కూలు స్నేహితులను చూసి వారి శుభాకాంక్షలు అందుకున్నాం. ఇంతలో నేను తీసుకున్న సెలవు అయిపోవచ్చింది, అప్పుడు విజయ పుట్టింటికి వెళ్ళిపోయింది, నేను ఒంటరిగా కలకత్తా వెళ్ళిపోయి మళ్ళీ ఎస్.క్యూ.సి. యూనిట్‌లో చేరాను. బారక్‌పూర్ ట్రంకు రోడ్డు మీదే మా ఐ.ఎస్.ఐ. కలకత్తా హెడ్‌క్వార్టర్స్‌కి దగ్గర్లో ఒక 2 బెడ్‌రూముల పోర్షన్ అద్దెకు తీసుకున్నాను.

మే 1964లో మా తమ్ముడు సాయి, అమ్మ కలిసి విజయను నాతో కాపరానికి ఉండడానికి తీసుకువచ్చారు. అప్పుడు సాయి, అమ్మ కొన్నాళ్ళు మాతో ఉన్నారు, అమ్మ విజయకు వంట చెయ్యడం నేర్పించింది అప్పుడు. అలా మా సంసార జీవనం మొదలయ్యింది.

అప్పుడు అమ్మ విజయకు నేర్పించిన వంటలలో ఒకటి, శనగపిండి పచ్చడి, పందిళ్ళపల్లితో పరిచయం లేనివారికి బహుశా తెలియకపోవచ్చు.

మా పెళ్ళి నిశ్చయించినప్పటి నుంచీ, వెంటనే పిల్లలు పుట్టకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అని నేను ఆలోచించాను. ఆ కాలంలో బర్త్ కంట్రోల్ పద్ధతులని గురించి సమాచారం తెలుసుకోవడం చాలా కష్టంగా ఉండేది. అందుకని మొదటినుంచీ నా ఊహకు తట్టిన పద్ధతులని జాగ్రత్తగా వాడడం మొదలెట్టాను సంసారజీవనంలో.

## 13. నాన్నగారి రిటైర్డు జీవితం

1962 చివర్లో సెలవు తీసుకొని రిటైరై విజయవాడలో నివసించడం మొదలెట్టాక, అమ్మా నాన్నలిద్దరికీ ఆధ్యాత్మికచింతన బాగా ఎక్కువ అయ్యింది. కొన్నాళ్ళకు మా నాన్నగారికి “కమిలీ బాబా” అనే ఆయన మీద చాలా గురి కుదిరింది. ఈ కమిలీ బాబాగారికి దగ్గర్లో ఉన్న కొండపల్లిలో ఒక ఆశ్రమం ఉండేది. తర్వాత కొన్నాళ్ళకి అమ్మానాన్నలిద్దరికీ ఈయన నకిలీ బాబా అని అర్థమయింది. ఆ తరువాత రామచంద్రాజీ అనే ఇంకో బాబామీద గురుభక్తి ఎక్కువయ్యింది. ఈ రామచంద్రాజీగారికి యు.పి.లోని షాజహాన్‌పూర్‌లో ఒక పెద్ద ఆశ్రమం ఉండేది. అమ్మా, నాన్నలిద్దరూ ఆ ఆశ్రమం రెండుసార్లు విజిట్ చేసి కొన్నాళ్ళున్నారు. వారి సహజమార్గ పద్ధతిని ఇద్దరూ అనుసరించి ధ్యానం చేసుకుంటుండేవారు.

మా నాన్నగారికి భోజనం చేశాక కాసేపు నడవడం చాలా కాలం నుంచీ ఉన్న అలవాటు. రిటైరయ్యి విజయవాడలో నివసించడం మొదలెట్టాక, మిగతా టైమంతా ఒక కుర్చీలోనో లేక గట్టుమీదో కూర్చొని గడపడం మొదలెట్టారు. అది చూసి అమ్మ ఆయనతో “మీరు అలా కూర్చొని గడపడం ఆరోగ్యానికి మంచిది కాదు. కాసేపు లేచి నడవండి” అంటూ పోరుతుండేది. ఇది 2, 3 సార్లు చూశాక నాకనిపించింది, అమ్మ చెప్తున్నట్లు నేను కూడా ప్రతిరోజూ కొన్ని వ్యాయామాలు చెయ్యడం మంచిదని. అప్పటినుంచి రోజూ పొద్దున్న కాసేపు జాగింగ్ మొదలెట్టాను, తర్వాత క్రమేపీ కొన్ని వ్యాయామాలూ, గోడకుర్చీ మొదలైన వ్యాయామాలూ కూడా రోజూ చెయ్యడం మొదలెట్టాను.

## 14. మా అమ్మాయి వాణి పుట్టుక

విజయ కాపరానికి వచ్చి 2 నెలలు నాతో ఉన్న తర్వాత, తన నాన్నగారు కలకత్తా వచ్చి మమ్మల్ని విజిట్ చేసి, కలకత్తాలో సైట్ సీయింగు చేశాక విజయను పుట్టింటికి తీసుకువెళ్ళారు. అప్పుడు పుట్టింట్లో ఉండగా తను గర్భవతి అని తెలిసింది. నేను వాడిన బర్త్ కంట్రోలు పద్ధతి పని చెయ్యలేదన్నమాట. అప్పుడు విజయకు 17 ఏళ్ళ వయస్సు మాత్రమే. ఇంత చిన్న వయస్సులో తనకు గర్భం కల్గించినందుకు నామీద నాకే చాలా కోపం వచ్చింది.

10 మార్చి 1965న విజయకు పురుడు అయి మా అమ్మాయి కట్టా వాణి శ్రీదేవి పుట్టింది, తనను అందరూ "వాణి" అని పిలవడం మొదలుపెట్టారు.

మేము వాణికి తెలుగులో చక్కగా మాట్లాడడం, రాయడం, చదవడం నేర్పించాము. మా అమ్మా నాన్నలతోనూ, నా తమ్ముళ్ళు, చెల్లెళ్ళందరితోనూ, అలానే విజయ తల్లిదండ్రులతో తేలిగ్గా కలిసిపోయి తెలుగులో అనర్గళంగా మాట్లాడేది, చిన్న వయస్సులో తెగ కబుర్లు చెప్పేది. తను ఎలిమెంటరీ స్కూలు తెలుగు మీడియంతోనే విజయవాడలో మా అమ్మా, నాన్నలతో ఉండి చదువుకుంది.

## 15. మా అమ్మకు మొదటి పుత్రశోకం

1955లో అమ్మకు పుట్టిన కవల పిల్లల్లో చిన్నవాడు, మేమంతా బలరాం అని పిలిచేవాడు అన్ని క్లాసుల్లోనూ చాలా మంచి మార్కులు తెచ్చుకునేవాడు. ఆ కవలల్లో రెండవవాడు, మేము "పెద్దా" అని పిలిచేవాడు, చదువులో అంత రాణించలేదు.

అమ్మకు బలరాం చాలా నచ్చాడు. వాణ్ణి చూపించి "వీడు నా పిల్లలందర్లోకీ చాలా గొప్పవాడవుతాడు చూసుకోండి" అంటూ చెప్తుండేది.

1965లో పురుడు తర్వాత మా ఆవిడ విజయవాడలో ఉండగా, కృష్ణానదిలో తెప్ప తిరణాలు జరుగుతున్నాయి. ఈ తిరణాలలో రెండు పడవల మీద అడ్డంగా వెదురుగడలతో ఒక ప్లాట్‌ఫారంలా తయారుచేసి, దానిమీద సాయిబాబా బొమ్మ ప్రతిష్ఠించి భజన చేస్తూ కృష్ణానదిలో విజయవాడ వైపు నుంచి గుంటూరు వైపుకి వెళ్ళి, తిరిగి విజయవాడ వైపుకి వస్తారు. ఈ తిరణాలలో జరిగే భజనలో పాల్గొనడానికి మా త్రయంబకేశ్వరుడు తాతయ్య విజయవాడలో మా ఇంటికి వచ్చాడు. తిరణాలకు తనతోబాటు బలరాంని తీసుకువెళ్లాడు. వాళ్ళిద్దరూ ఎక్కిన తెప్ప పడవల్లోకి నీళ్ళు వస్తున్నాయని కొందరికి అనుమానం వచ్చి, భయపడి, వాళ్ళు నదిలోకి దూకేశారట. దాంతో ఆ తెప్ప తిరగబడిందట, అలా దూకినవాళ్ళల్లో త్రయంబకేశ్వరుడు తాతయ్య, బలరామ్ కూడా ఉన్నారు. అలా దూకిన వాళ్ళల్లో ఈత రానివాళ్ళు నదిలో మునిగి చచ్చిపోయారు. వీళ్ళల్లో మా బలరాం ఒకడు. తాతయ్య మాత్రం తనకు ఈతవచ్చు గనుక ఈదుకొని ఒడ్డుకి వచ్చి ఈ విషయం మా ఇంట్లో చెప్పాడు. అప్పుడు మా పెద్ద బావ కుందెం పెద మహాలక్ష్మేశ్వరరావు విజయవాడలోనే ఉన్నాడు. ఆయన జాలర్లను తెప్పించి వాళ్ళచేత బలరాం శరీరం కొరకు నదిలో వెదికించాడు. నదికింద భాగం నుంచి వాళ్ళు బలరాం శవాన్ని బయటకు తీశారు. బావ ఆ శవాన్ని తన కారులో మా విజయవాడ ఇంటికి తెచ్చాడు. పడుకొని ఉన్న

బలరాం శరీరం చూస్తే వాడు అప్పుడే స్నానం చేసి విశ్రాంతి తీసుకుంటున్నట్లు ఉందని విజయ వివరంగా ఉత్తరంలో నాకు తెలిపింది. మా అమ్మ ఏడుస్తూ "బలరాం! లే బాబూ, లే బాబూ" అంటూ వాడిని తట్టుతూ చాలాసేపు ఏడ్చిందట.

బలరాం మరణం మా అమ్మను చాలా కృంగదీసింది. చాలా రోజులు వాడిని తలుచుకుంటూ కన్నీరు కార్చేది అమ్మ. ఇలా మేము నా చిన్న తమ్ముణ్ణి కోల్పోయాం. ఇది జరిగిన తర్వాత త్రయంబకేశ్వరుడు తాతయ్య మళ్ళీ మాకు ఎప్పుడూ కనపడలేదు. అదేకాక కప్పలదొడ్డిలో ఉండే ఆయన సోదరులు ఎవ్వరూ మమ్మల్ని ఎప్పుడూ కలవలేదు.

## 16. నేను పి.హెచ్.డి. చదువుకి యు.ఎస్.ఎ. వెళ్ళడం.

1964లో నాకు ఆపరేషన్స్ రిసెర్చిలో పి.హెచ్.డి. చెయ్యాలనే కోరిక మరీ దృఢం అయ్యింది, ముఖ్యంగా నేను కేస్ ఇన్‌స్టిట్యూటులో ఒక కోర్సులో నేర్చుకున్న ఎల్.పి. (లీనియర్ ప్రోగ్రామింగ్) అనే సబ్జెక్టులో. ఎల్.పి.లో అప్పుడు టాప్ ఎక్స్‌పర్టు జార్జి డాంట్‌జిగ్ అనే ఆయన. ఆయన్ని అప్పుడు "ఫాదర్ ఆఫ్ ఎల్.పి." అనేవారు. ఆయన యు.సి.బి. (యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్క్లీ) ఐ.ఇ.ఓ.ఆర్. (ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ అండ్ ఆపరేషన్స్ రిసెర్చి) డిపార్ట్‌మెంటులో ప్రొఫెసర్. కేస్ ఇన్‌స్టిట్యూట్‌లో చాలామంది ప్రొఫెసర్లు ఈయన్ను గురించి ఇలా చెప్పారు. "డాంట్‌జిగ్‌కు ఏ సమస్యను ఇచ్చినా, దాన్ని ఎల్.పి. మోడల్‌గా ఎలా సాల్వ్ చెయ్యవచ్చు అనే ఆలోచిస్తారు".

నేను నా టి.ఎస్.పి. అల్గోరిదంని గురించి చెబుతూ వాళ్ళ డిపార్ట్‌మెంటులో నాకు పి.హెచ్.డి. చెయ్యాలని కోరిక ఉందని ఆయనకు ఉత్తరం రాశాను. నా టి.ఎస్.పి. రిసెర్చిని గురించి ఆయన అప్పుడే విన్నారు. నాకు చాలా ఆశ్చర్యం కలిగిస్తూ వెంటనే ఆయన దగ్గర్నుంచి జవాబు వచ్చింది, 1965 ఫాల్ టర్మ్ రిసెర్చి అసిస్టెంటుగా ఎపాయింట్‌మెంటు చేస్తూ. 1965 సెప్టెంబర్‌కి నేను ఎస్.క్యూ.సి. యూనిట్‌కి 3 సంవత్సరాలు పని చేస్తానని ఇచ్చిన వాగ్దానం పూర్తి అయ్యింది. అప్పుడు నేను ఒక్కణ్ణే యు.సి.బి.కి. బయల్దేరి వెళ్ళాను. "అక్కడ ఎపార్ట్‌మెంటు చూసుకున్నాక తననూ, వాణిని తీసుకువెళ్తాను" అని మా ఆవిడకు చెప్పాను. అమెరికాకి నా ఈ రెండవ ప్రయాణమంతా విమానాలలోనే జరిగింది.

నేను బెర్క్లీలో మొదటి టర్మ్ ఇంకొక రిసెర్చి స్కాలర్‌కి రూమ్‌మేట్‌గా అతని గదిలో ఉన్నాను. మళ్ళీ విద్యార్థి నయ్యాను గదా, కోర్సులు తీసుకుంటూ డాంట్‌జిగ్‌గారితో రిసెర్చి టాపిక్ గురించి చర్చ మొదలు పెట్టాను. "డిపార్టుమెంటులో అందరు ప్రొఫెసర్లతో మాట్లాడి, నీకు నచ్చిన టాపిక్ ఎంచుకో రిసెర్చి చెయ్యడానికి" అని ఆయన అన్నారు.

డిపార్ట్‌మెంటులో మధ్యాహ్నం "కాఫీ అవర్" అని ఉండేది ఆ రోజుల్లో. దానికి విద్యార్థులం అందరం వెళ్ళేవాళ్ళం. చాలామంది ప్రొఫెసర్లు కూడా వచ్చేవారు. ఒక రోజు ఈ కాఫీ అవర్‌లో నన్ను డేవిడ్ గేల్ అనే ప్రొఫెసర్ కలుసుకొని తను అప్పుడు ఆలోచిస్తున్న ఎల్.సి.పి. (లీనియర్ కాంప్లిమెంటారిటీ ప్రాబ్లం)ని గురించి చెప్పి, దానిమీద తన రెండు కంజెక్చర్లు ఇచ్చి "నీకు వీలైతే ప్రూవ్ చెయ్యి" అని అడిగారు. ప్రతి కోర్సులోనూ, ప్రతివారం హోమ్‌వర్క్ ఇచ్చేవారు, అవి చేస్తూనే గేల్‌గారి కంజెక్చర్లను గురించి ఆలోచించడం మొదలెట్టాను.

అదృష్టవశాత్తూ ఒక నెలరోజుల్లో ఒక కంజెక్చర్ ప్రూవ్ చెయ్యగల్గాను. నా ప్రూఫ్ చక్కటి ఇండక్టివ్ ప్రూఫు, అది గేల్‌గారికి చూపించాను. "నీకు ఈ ప్రాబ్లం మీద పి.హెచ్.డి. థీసిస్ చెయ్యాలని ఉందా?" అని అడిగారు ఆయన. అది చాలా ఇంటరెస్టింగ్‌గా ఉన్న జియోమెట్రిక్ ప్రాబ్లము. ఆయనకు అవునని చెప్పి దానిమీద ఇంకా రిసెర్చి చెయ్యడం మొదలెట్టాను.

మొదటి టర్మ్ తర్వాత నాకు మేరీడ్ స్టూడెంటు హౌసింగ్‌లో ఒక ఎపార్టుమెంటు ఇచ్చారు. విజయ, వాణిలను జనవరి 1966కి బెర్క్లీ వచ్చెయ్యమని చెప్పి, వాళ్ళ విమానం టిక్కెట్లు కొని పంపించేశాను.

డిపార్ట్‌మెంటులో రిసెర్చి స్కాలర్లకి ఒక పెద్ద ఆఫీసు గది ఉండేది, ప్రతి స్కాలర్‌కీ ఒక టేబిల్, కుర్చీ. నా టేబిల్ ముందు టేబిల్‌ని వాడేది లారీ బోడిన్ అని ఒక తెల్లతను, మంచి స్నేహితుడయ్యాడు. నాకు అప్పుడు కారు లేదు. ఈ లారీబోడిన్, అతని భార్యా వాళ్ళ కారులో నన్ను ఎయిర్‌పోర్టుకి తీసుకువెళ్ళి, విజయ, వాణిలను పికప్ చేసి మమ్మల్ని మా ఎపార్ట్‌మెంటులో దించారు.

మా ఎపార్ట్‌మెంటుకి దగ్గర్లో ఒక మంచి గ్రోసరీ స్టోర్ ఉండేది. రోజూ నేను యూనివర్శిటికీ వెళ్ళడానికి బస్ సర్వీసు ఉండేది. వీటివల్ల కారు కొనాల్సిన అవసరం లేకుండానే మాకు కాలం గడిచిపోయేది. కారులున్న స్నేహితులు పెద్ద షాపింగు సెంటర్లకు వెళ్తున్నప్పుడు మమ్మల్ని తమతో తీసుకువెళ్ళేవారు. వాణి అప్పుడు చిన్నపిల్ల, అందరూ తనను ఎత్తుకొని ముద్దు చేస్తుండేవారు, తను వాళ్ళతో చక్కగా కబుర్లు చెప్పేది. మా ఎపార్టుమెంటు చుట్టూరా పలు దేశాల నుంచి వచ్చిన ఇతర విద్యార్థుల చిన్నపిల్లలు తనకు ఆడుకోటానికి ఉండేవారు.

నాది థియరెటికల్ రిసెర్చి టాపిక్ గనుక, నేను నా థిసిస్ త్వరగా పూర్తి చెయ్యగల్గాను. 1968 మొదటికి థీసిస్ పూర్తిచేసి పబ్లికేషన్‌కి సబ్మిట్ చేశాను. త్వరలోనే అసిస్టెంట్ ప్రొఫెసర్ జాబ్ ఆఫర్లు వచ్చాయి. నా థీసిస్ ఎడ్వైజర్ డేవిడ్ గేల్‌గారు వాటిలో యు.యం. (యూనివర్శిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ అర్బర్)కి వెళ్ళు, నీకు అక్కడ నచ్చుతుంది అని చెప్పారు, నేను ఆయన సలహా ప్రకారం యు.యం. జాబ్ ఆఫర్ యాక్సెప్ట్ చేసాను.

మేము ముగ్గురం అంచెలంచల మీద విమాన ప్రయాణాలతో బెర్క్లీ నుంచి ఆన్ ఆర్బర్‌కి ప్రయాణం మొదలుపెట్టాం. దారిలో సాల్ట్‌లేక్ సిటీ మొదలైన చాలా నగరాలలో ఆగి సైట్ సీయింగ్ చేసుకుంటూ, ఆన్ ఆర్బర్ సెప్టెంబర్ 1968లో చేరుకున్నాం. అప్పుడు నేను యు.యం.లో ఐ.ఓ.యీ. (ఇండస్ట్రియల్ అండ్ ఆపరేషన్స్ ఇంజనీరింగ్) డిపార్ట్‌మెంటులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాను. అప్పుడు ఒక పాత కారు కొనుక్కొని, దానితో విజయ, నేను డ్రైవింగు నేర్చుకున్నాము.

నేను పి.హెచ్.డి. డిగ్రీ పుచ్చుకొని యు.యం.లో ఫాకల్టీ మెంబర్‌గా చేరడం మా అమ్మా నాన్నలకు చాలా నచ్చింది. 1968 యు.యం.లో టీచ్ చెయ్యడం మొదలెట్టాక, నాకు 2, 3 సంవత్సరాల కొకసారి మాత్రం సెలవుల మీద వెళ్ళి అమ్మా నాన్నలను విజిట్ చెయ్యడానికి అవకాశం లభించేది. చాలా వరకూ ఉత్తరాలద్వారా మా సమాచారాలు వాళ్ళకు తెలిసేవి, వాళ్ళ సమాచారాలు మాకు అందేవి.

## 17. 1968 తర్వాత అమ్మ జీవితం విశేషాలు

1967లో తమ్ముడు శ్రీరాములు పెళ్ళి అయ్యింది. అతను బాంబే అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్‌మెంటులో ఉద్యోగం చేసి 1969లో ఇ.సి.ఐ.ఎల్. (ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్) హైద్రాబాద్‌కి మారి, అప్పటి నుంచీ హైద్రబాద్‌లో నివసించడం మొదలెట్టాడు.

తమ్ముడు సాయి 1966-67 శ్రీకాకుళంలో లెక్చరర్‌గా పనిచేసి, 1967లో ఐ.ఐ.టి. ఢిల్లీలో పి.హెచ్.డి. ప్రోగ్రాం ఇన్ ఫిజిక్సు మొదలుపెట్టి 1971లో పూర్తి చేశాడు. 1971-75 డి.ఆర్.డి.ఒ. సాలిడ్ స్టేట్ ఫిజిక్స్ ల్యాబ్‌లో రీసెర్చర్‌గా పనిచేసి 1975లో ఢిల్లీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్‌లో పని చెయ్యడం మొదలెట్టాడు.

మా రెండవ అమ్మాయి మధుశ్రీ 1978లో పుట్టింది. మధుశ్రీ పుట్టిన వారం రోజుల్లో మాకు ఇక పిల్లలు పుట్టకుండా ఉండడానికి నేను వాసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను.

1975లో సాయికి పెళ్ళయ్యింది. సాయి, అన్నపూర్ణ దంపతులకు ఒక్కతే అమ్మాయి, నిర్ఝరి 1987లో పుట్టింది. శ్రీరాములు, జయలక్ష్మి దంపతులకు ఇద్దరు పిల్లలు, శ్రీనివాస్, శాంతిశ్రీ.

శ్రీరాములు సికింద్రాబాద్ ఇ.సి.ఐ.ఎల్.లో ఉద్యోగం చేస్తూ, అక్కడ వాళ్ళ హౌసింగ్ కాలనీ, ఎ.ఎస్.రావ్ నగర్‌లో సొంత ఇల్లు కట్టించి 1981లో ఆ కొత్త ఇంట్లోకి గృహప్రవేశానికి, అమ్మా, నాన్న, పెద్దాలను పిలిపించాడు. వాళ్ళు అక్కడ ఉండగా నాన్న అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టుతో ప్రాణం విడిచారు. అదయ్యాక అమ్మ పెద్దాతో బాటు విజయవాడకు తిరిగి వచ్చి, వాళ్ళిద్దరూ అక్కడ ఉండడం మొదలెట్టారు.

శ్రీరాములు 1997లో ఇ.సి.ఐ.ఎల్. నుంచి రిటైరయి, సికింద్రాబాద్ తన ఇంట్లో రిటైర్డ్ జీవితం మొదలెట్టాడు.

1983లో అమ్మ విజయవాడ ఇంటిని పెంకుటింటి నుంచి, 2 పోర్షన్లతో ఉన్న ఒక అంతస్థు డాబాగా మార్చింది మా ధన సహాయంతో.

మా నాన్నగారు రిటైరు అయి విజయవాడలో సెటిల్ అయినప్పుడు, మా చెల్లెలు గీత, తమ్ముడు  నిరూప్ అక్కడే చదువుకున్నారు. 1973లో చెల్లెలు గీత విజయవాడలోని మేరిస్టెల్లా కాలేజీలో బి.ఎ. పూర్తి చేసింది. డిసెంబర్ 73న తనకు బెంగుళూరు వాస్తవ్యులు, బండ్ల భానుమూర్తిగారి అబ్బాయి సుదర్శన్‌తో వివాహము జరిగినది. ఆ రోజుల్లో సుదర్శన్ అక్కడ దూర్‌వాణినగర్‌లో ఉన్న ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్‌లో ఇంజనీరుగా పనిచేస్తూండేవాడు.

తర్వాతే వాళ్ళకి ఒక కుమార్తె, హరిత పుట్టినది. సుదర్శన్‌గారికి అమెరికా వెళ్ళాలనే ఆకాంక్ష ఉండేది. దానికి ప్రయత్నాలు చేస్తుండేవారు అవి ఫలించిన తరువాత 1978లో అమెరికాలో మాస్టర్ చేయడానికి సీటు దొరకటంతో అమెరికా వెళ్ళారు. కాని భార్యా, కుమార్తెలను అమెరికా తీసుకువెళ్ళటానికి వీసా దొరకటానికి చాలా ఆలస్యం జరిగినది. చెల్లెలు గీత కొన్నాళ్ళు బెంగుళూరులోని అత్తగారింట్లోను, కొన్నాళ్ళు విజయవాడలో మా అమ్మగారితో ఉంటూ త్వరగా భర్త దగ్గరకు చేరిపోవాలని దేవుళ్ళందరినీ ప్రార్థిస్తుండేది. ఇది ఇలా ఉండగా

1981 ఆగస్టులో తమ్ముడు శ్రీరాములు కొత్తగా కట్టుకున్న ఇంటికి వచ్చిన మా నాన్నగారు అక్కడే పరమపదించారు.

యాదృశ్చికమో ఏమో తెలియదు కాని నాన్నగారు పోయిన కొద్ది రోజులకే గీతకు వీసా వచ్చింది. బహుశా మా నాన్నగారే స్వర్గానికి వెళ్ళి తనకు వీసా త్వరగా వచ్చేటట్లుగా చేశారని అందరితోను కన్నీళ్ళతో చెప్పుకునేది. 1981లోనే గీత, హరిత అమెరికాలోని సుదర్శన్‌గారి దగ్గరకు చేరారు.

మా తోబుట్టువులలో కాని, వారి పిల్లలలో కాని ఇంకెవ్వరూ అమెరికా రావటానికి ఆ తరువాత పాతిక సంవత్సరముల వరకూ ప్రయత్నము కూడా చేయలేదు.

1984లో పెద్దాకి మాధవీలతతో పెళ్ళయి, ఆవిడ కాపురానికి వచ్చింది. ఈ పెళ్ళి మా కుటుంబంలో, మా తరంలో చివరిది. వీళ్ళకు బాలస్వామి, భవ్య ఇద్దరు పిల్లలు, అమ్మ వీళ్ళతో విజయవాడ ఇంట్లో 2006 వరకూ ఉంది.

సాయి ఢిల్లీలోని డిపార్ట్‌మంటు ఆఫ్ ఎలక్ట్రానిక్స్ నుంచి 2006లో రిటైరయ్యాడు. నిర్ఝరి చెన్నైలో ఎతిరాజ్ కాలేజీలో 2005-2008 బి.కాం. చదివింది. మొదటి సంవత్సరం హాస్టల్‌లో ఉంటూ చదివింది. తనకు సహాయంగా ఉండడానికి సాయి 2006లో రిటైరయ్యాక చెన్నై వచ్చి, అక్కడ ఒక ఎపార్ట్‌మెంటు అద్దెకు తీసు కొని ఉండడం మొదలెట్టాడు. అప్పుడు నిర్ఝరి తన అమ్మా, నాన్నలతో ఉంటూ బి.కాం. 2008లో పూర్తిచేసింది. తర్వాత నిర్ఝరి ప్రైవేటుగా చదివి సి.ఎ. (చార్టర్డ్ ఎకౌంటెన్సీ) పరీక్షలు తీసుకోడానికి ప్రయత్నిస్తోంది.

2006 డిసెంబర్‌లో విజయవాడ ఇంట్లో మా తమ్ముడు పెద్దా చనిపోయాడు, మా అమ్మకు రెండోసారి పుత్రశోకం, మాధవీలతకు భర్త వియోగం కల్గిస్తూ. దాని తర్వాత అమ్మ సాయి కుటుంబంతో నివసించడం మొదలెట్టింది.

సాయి కుటుంబం (సాయి, అన్నపూర్ణ, నిర్ఝరి) అమ్మను వార్ధక్యంలో (2006 నుంచి 2016 వరకూ) చాలా బాగా చూశారు. తన ముసలితనంలో తనను చక్కగా చూసుకునే సాయిలాంటి కొడుకూ, అతని కుటుంబం ఉండడం అమ్మ అదృష్టం.

## 18. మతాలతో మరికొన్ని అనుభవాలు

మేము ఆన్ ఆర్బర్‌లో స్థిరపడ్డాక, మతాలతో మరికొన్ని మా అనుభవాలు చెప్తాను. అప్పుడప్పుడూ క్రైస్తవ మిషనరీలు మా ఇంటికి వచ్చి మమ్మల్ని వారి మతానికి మార్చడానికి ప్రయత్నించేవారు. ఇలా ఒకటి రెండుసార్లు జరిగాక, అలా వచ్చినవారికి "మీరు మీ కాలాన్ని వృథా చేస్తున్నారు, మేము క్రైస్తవులమే" అని చెప్పి పంపించడం మొదలుపెట్టాను.

మాకు ఇంకొక భారతీయ స్నేహితుడు ఉన్నాడు, అతన్ని "రబి" అని పిలుస్తాం. ఒక రోజు ఇద్దరు చాలా అందమైన పడుచు అమ్మాయిలు వచ్చి వాళ్ళ తలుపు తట్టారట. అప్పుడు వాళ్ళతో ఇలా సంభాషణ సాగిందట.

అమ్మాయిలు - సారూ, మీరు ఏ మతస్థులో తెలుసుకోవచ్చా?

రవి – మీకు ఆ సమాచారం ఎందుకు కావాలో చెప్పండి?

అమ్మాయి – ఏసుక్రీస్తుగారు చెప్పారు, మీరు క్రైస్తవులయ్యి, మీ జీవితంలో మంచి పనులు చేస్తే, మీరు చనిపోయాక, ఆయన మిమ్మల్ని స్వర్గానికి తీసుకువెళ్తారని, మీరు క్రైస్తవులు కాకపోతే, చనిపోయాక నరకానికి వెళ్తారు. ఈ విషయాలు మీకు చెప్దామని.

రవి – మీ ఇద్దరూ చనిపోయాక స్వర్గానికి వెళ్తున్నారా ?

అమ్మాయిలు – మేము క్రైస్తవులం, అదీకాక మా మతానికి మేము చాలా సహాయం చేస్తున్నాం కదా. మేము తప్పకుండా స్వర్గానికి వెళ్తాం.

రవి – అలా అయితే, మీకేమీ అభ్యంతరం లేకపోతే, మాకు నరకానికే వెళ్ళాలని ఉంది!!!

నేను 1970లో సౌదీ అరేబియాలో ఉండే ఒక ఫ్యాకల్టీ మెంబరుతో కలిసి రిసెర్చి మొదలెట్టాను. అప్పుడు అతను నన్ను వాళ్ళ డిపార్ట్‌మెంటుని కనీసం ఒక సంవత్సరం విజిట్ చెయ్యమని అడిగాడు. ఇలా చేస్తే మనిద్దరం కలుసుకొని రిసెర్చి చేసుకోవచ్చు అని చెప్తూ, వాళ్ళ యూనివర్శిటీలో జాబ్‌కి అప్లికేషను, వాషింగ్టన్ డిసిలో సౌదీ ఎంబసీకి సబ్మిట్ చెయ్యవలసిన వీసా అప్లికేషనూ రెండూ పంపించాడు. ఆ రెండు అప్లికేషన్లలోనూ “మతం” అనే ఐటం ఉంది. అక్కడ ఏమి రాద్దామా అని ఆలోచించాను. వాళ్ళకు ఈ సమాచారం ఎందుకు అవసరమో తెలియలేదు. నేను అక్కడ చెయ్యాల్సిన పనికీ, మతానికి ఏమి సంబంధం లేదు. అక్కడ “ముస్లిం” అని రాద్దామనుకున్నాను, కానీ దాన్ని చెక్ చెయ్యడానికి పురుషాంగం పరీక్షిస్తారేమో అని భయం వేసింది, చివరకు “మేము అన్ని మతాలనూ నమ్ముతాము” అని రాసి, ఆ అప్లికేషన్లు పంపించేశాను.

నెల రోజుల తర్వాత వాషింగ్టన్ డి.సి.లోని సౌదీ ఎంబసీ నుంచి నా వీసా అప్లికేషన్ నిరాకరించబడింది అని తెలుపుతూ ఉత్తరం వచ్చింది. ఈ విషయం సౌదీ అరేబియాలో నా స్నేహితుడికి తెలిపాను. అతను తమ యూనివర్శిటీ రెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పాడు. ఆ రెక్టర్, యు.యం. మా డిపార్ట్‌మెంటులో పి.హెచ్.డి. చేసిన నా విద్యార్థి.

ఇంకొక నెల తర్వాత వాషింగ్టన్ డి.సి.లోని సౌదీ ఎంబసీ నుంచి నా వీసా అప్లికేషన్ మళ్ళీ రివ్యూ చేసి వీసా ఇవ్వడానికి నిశ్చయించామని తెలుపుతూ, వీసాలతో ఉత్తరం వచ్చింది.

సౌదీ అరేబియా వెళ్ళాక నేను ఆ యూనివర్శిటీ రెక్టర్‌ని కలిసినప్పుడు అతను జరిగింది చెప్పాడు. అతను వాషింగ్టన్ డిసిలోని సౌదీ ఎంబాసిడర్‌ని పిలిచి, మూర్తిగారికి వీసా ఎందుకు ఇవ్వలేదు అని అడిగాడట. ఈ “మతం” ఐటంకి ఆయన నేను రాసిన జవాబు చాలా వింతగా ఉంది, ఆయన చాలా వింత మనిషిలా ఉన్నారు, అందుకనే వీసా ఇవ్వలేదు” అని చెప్పాడట. తన సబ్జెక్టులో మూర్తిగారు మంచి రిసెర్చి చేసారు. ఆయన నాకు బాగా తెలుసు, ఆయన సహాయం మాకు చాలా అవసరం, వీసా ఇచ్చెయ్యండి” అని రెక్టర్ వాళ్ళ ఎంబాసిడర్‌కి చెప్పాడట, అప్పుడు వెంటనే వీసా మీకు పంపించేసారు అని చెప్పాడు.

## 19. అమ్మ జీవితంలో చివరి 10 సంవత్సరాలు

2006లో అమ్మకు 84 ఏళ్ళు నిండాయి. ఆ సంవత్సరం చివర పెద్దా చనిపోయాక, అమ్మ చెన్నైలో సెటిల్ అయిన సాయి కుటుంబంతో ఉండడం మొదలుపెట్టింది.

2007లో నేను ఇండియా వచ్చి సాయి వాళ్ళింట్లో అమ్మను చూసినప్పుడు, తను ఇలా చెప్పేది "నాకు ఇప్పుడు 84 సంవత్సరాలు నిండాయి గోపా! జీవితంలో నేను చెయ్యాల్సిన పనులన్నిటినీ చక్కగా చేసేసాను, ఇంక చెయ్యాల్సింది ఏమీ లేదు. దేవుడు నన్ను ఎప్పుడు తీసుకువెళ్తాడా అని ఎదురుచూస్తున్నాను. మరి ఆయన ఎప్పుడు కరుణించి నన్ను తీసుకుపోతాడో కదా?"

దానికి నేను "అదేమిటమ్మా, అలా అంటావు? మాకు అమ్మవు కదా, నిన్ను హాయిగా చూస్తుండడం మాకు ఎంతో సంతృప్తికరం అని నీకు తెలుసు, దేవుడు నిన్ను తీసుకువెళ్ళిపోతే, మాకు ఆ సంతృప్తి ఎలా కల్గుతుంది? కనుక దయచేసి, మళ్ళీ ఎప్పుడూ ఇలా మాట్లాడవద్దు" అని చెప్పేవాణ్ణి.

నేను చూసిన 80 ఏళ్ళ వయస్సు దాటిన వ్యక్తుల్లో చాలా మంది మా అమ్మ ఆలోచించినట్లే ఆలోచిస్తూ ఉంటారని నేను గ్రహించాను.

ప్రభుత్వాలు మానవ జీవితకాలాన్ని పొడిగించే రిసెర్చికి చాలా డబ్బు ఖర్చుపెడ్తున్నారు కదా. ఈ రిసెర్చి సఫలమవడం వల్ల జీవితం చివరి భాగం మాత్రం పొడిగించబడ్తుంది. మరి ఈ భాగం చేరుకున్న మనుష్యులు మా అమ్మ ఆలోచించినట్లే ఆలోచిస్తోంటే, ఈ రిసెర్చికి అంత ప్రాముఖ్యం ఇవ్వడం సబబా అని నాకు అనిపిస్తుంది.

సాయి కుటుంబంతో ఉంటున్నప్పుడు అమ్మకు తరచుగా విజయవాడలో ఉన్న తన ఇంటిని చూడాలనీ, ఆ ఇంట్లో ఉండాలనే కోరిక కల్గేది. "సాయీ, నన్ను విజయవాడ ఇంటికి తీసుకువెళ్ళి అక్కడ వదిలిపెట్టు, నేను ఇక అక్కడే ఉండిపోతాను" అంటూ మాటిమాటికీ అడుగుతుండేది. అప్పుడు సాయి వీలుచూసుకొని తనను విజయవాడ తీసుకెళ్ళి దించి వచ్చేసేవాడు. 2, 3 రోజుల తర్వాత సాయికి ఫోను చేసి "సాయీ! నన్ను చెన్నై మీ ఇంటికి తీసుకుపో, నేను ఇక మీ ఇంట్లోనే ఉండిపోతాను" అంటూ చెప్పేది. ఇలా చాలాసార్లు సాయి అమ్మను అటూ ఇటూ తిప్పాల్సి వచ్చేది.

ఒకసారి (సుమారు 2010 ప్రాంతంలో) అమ్మ ఢిల్లీలో సరోజినితో కొన్నాళ్ళున్నప్పుడు, వాళ్ళిద్దరూ పొద్దుటపూట కాఫీ తాగుతుండగా, అమ్మ సరోజిని తలమీద చెయ్యిపెట్టి నిమురుతూ "నీ పుట్టింటివారి ఇంటి పేరేమిటి తల్లీ" అని నెమ్మదిగా అడిగిందట! అప్పుడు సరోజిని "నువ్వే మా అమ్మవి కదా" అని అంది. "అవును" అంది అమ్మ అప్పుడు. తర్వాత సరోజిని "మీ ఇంటి పేరేమిటో చెప్పు" అని అమ్మను అడిగితే, అమ్మ నవ్వి "కట్టావాళ్ళే కదా" అన్నదట.

నేను తనతో ఫోను చేసి మాట్లాడినప్పుడల్లా "గోపా, నువ్వు ఎక్కడున్నావ్? నిన్ను చూడాలని ఉంది, ఒకసారి వచ్చి నన్ను చూడు" అంటూ అడుగుతుండేది. నేను వెళ్ళి తనను కలుసుకున్నప్పుడల్లా చాటంత నవ్వు ముఖంతో "వచ్చావా గోపా" అంటూ చాలా ఆప్యాయంగా మాట్లాడేది.

2014 జులై వరకూ తనంతట తనే నడవగల్గేది. తరచూసాయి తనను చెయ్యి పట్టుకొని నడిపించుకుంటూ వాళ్ళ ఇంటి బయట గేటు వరకూ తీసుకువెళ్ళేవాడు. అప్పుడు ఒకసారి శ్వాసకోశ సంబంధిత సమస్య వల్ల కొన్నాళ్ళు హాస్పిటల్‌లో ఉండి తిరిగి వచ్చాక, నవంబర్ 2014 నుంచి చివరివరకు వీల్‌చైరూ, తను పడుకునే మంచాలకు పరిమితం అయ్యింది అమ్మ జీవితం.

వీల్‌చైర్‌లోనే కూర్చొని హాలులో టీవీ చూస్తు ఏవేవో మాట్లాడుతూ ఉండేది. ఉదాహరణకు కొన్ని:

ఒకసారి వీల్‌చైర్‌లోనే కూర్చొని అన్నపూర్ణతో ఇలా అందట "వినమ్మా, వాళ్ళు టివిలో నాగురించే చెప్తున్నారు. "కట్టా ఆదిలక్ష్మి పిల్లల కోసం కష్టపడి ఇల్లు కట్టిందట, చెప్తున్నారు చూడు నాగురించే అందరూ చెప్పుకుంటున్నారు".

ఇంకొకసారి మధ్యాహ్నం నిద్రలేచినప్పుడు "నేను విజయవాడలో పి.యు.సి.లో ఫస్ట్‌క్లాసులో పాసయ్యానమ్మా, రిజల్ట్సు వచ్చాయి చూడు" అంటూ నవ్వుతూ ఎంతో సంతోషంతో చెప్పింది. అప్పుడు అన్నపూర్ణ "తర్వాత ఏమి చదువుతారండీ" అని అడిగితే "విజయవాడలో మేరీస్టెల్లా కాలేజీలో యం.ఎ. చేస్తానమ్మా" అంది. "ఆ తర్వాత ఏమి చేస్తారండీ" అని అడిగితే, "పి.హెచ్.డి. చేస్తానమ్మా" అంది. అన్నపూర్ణ "ఎక్కడ చేస్తారండీ" అని అడిగితే, "అమెరికాలో గోపాలం దగ్గరమ్మా" అని చెప్పింది.

తరచూ తనంతట తానే పాటలు పాడేది 'రాకనున్నవి రాకమానవు, పోకనున్నవి పోకమానవు, గడచిపోయిన దినము రాదిక, ఇవి శిలాక్షరములు ....' ఈ పాట తనకు నక్కలతోటలో మా పక్కింటి అమ్మాయి నాగరాజు నేర్పించిందట. ఈ పాట తనకు చాలా ఇష్టం, చాలా బాగా పాడేది.

అలానే 'పావనగుణరామా, పరమ దయానిలయా హరే....' పాట పాడేది. ఈ పాటలో అన్ని చరణాలు తనకు గుర్తు లేవేమో, గుర్తున్న భాగమే మాటి మాటికీ పాడుకుంటూ ఉండేది.

ఒక్కొక్కసారి అన్నపూర్ణతో "టి.వి.లో నా పాటలే చూపిస్తున్నారమ్మా" అనేది. "మీ గురించి వాళ్ళకు ఎలా తెలుసండీ?" అని అన్నపూర్ణ అడిగితే "అక్కినపల్లి సుబ్బారావుగారు మనింటికి వస్తుంటారు కదా, ఆయనకు నా గురించి తెలుసమ్మా, ఆయన్ని అడిగి తెలుసుకునుంటారు" అనేది. ఈ అక్కినపల్లి సుబ్బారావుగారు చాలా మంచి తెలుగు నవలలు రచించిన రచయిత, సాయికి చాలా దగ్గర స్నేహితులు, తరచూ సాయిని విజిట్ చేస్తుండేవారు.

ఇంకొకసారి ఇలా చెప్పిందట "నా పెద్దకొడుకు గోపాలం చాలా పుస్తకాలు రాశాడమ్మా. ఒకసారి అమెరికావాళ్ళు గోపాలాన్ని ఊరేగిస్తామని చెప్పారంట. అప్పుడు గోపాలం అన్నాడంట "నన్నెందుకయ్యా ఊరేగించడం, నా పుస్తకాలను ఊరేగించండి. నాకేమీ అక్కర్లేదు" అన్నాడంట ఆ మహానుభావుడైన నా కొడుకు. వాడిని కన్నతల్లిని నేను, అలాంటి గొప్పవాడిని కన్న గర్భమమ్మా నాది. 9 నెలలు మోసి, కని పెంచానమ్మా నేను" అని.

ఒకసారి అన్నపూర్ణను చూసి "మీ ఆయన ఎక్కడుంటాడమ్మా" అని అడుగుతూ, సాయిని చూపించి "ఇదిగో మా అబ్బాయి సాయిని చూడు" అంటూ చూపించిందట. అప్పుడు అన్నపూర్ణ "మా ఆయన గూడా

అలానే ఉంటారండీ, మా ఆయన పేరు కూడా సాయే" అన్నదట, అప్పుడు "మరి మీ ఆయన ఎప్పుడూ కనపడడేమమ్మా?" అని అడిగిందట అమ్మ.

ఒకసారి చెన్నైలోనే ఒక బంధువుల ఇంటికి భోజనానికి వెళ్ళి తిరిగి వచ్చాక సాయివాళ్ళ ఎపార్ట్‌మెంటు చూసి, "ఎవరిల్లమ్మా ఇది? నేనెప్పుడూ చూడలేదే, నువ్వు ఎవరమ్మా? నేను మీ ఇంటిని ఎప్పుడూ చూసినట్లు గుర్తులేదే" అని అడిగిందట అన్నపూర్ణని.

అప్పుడప్పుడూ "మా అబ్బాయి గోపాలం అమెరికాలో ఉంటాడమ్మా, నేను అమెరికాలో వాడి దగ్గరకు వెళ్ళిపోతాను" అంటుండేదట.

ఒక రోజు అన్నపూర్ణ తలంటుకొని దేవుడికి దణ్ణం పెట్టుకుంటున్నప్పుడు చూసి "ఇవ్వాళ పండగమ్మా, నేనేమీ తిననమ్మా, ఇవ్వాళ పాలు తాగుతానంతే, ఇవ్వాళ మహాశివరాత్రమ్మా" అన్నదట.

ఒకసారి నిర్ఝరి "నానమ్మా, నాకు పెళ్లయిపోయింది కదా! మా పెళ్ళి మీరు దగ్గరుండి చేయించారు. మా ఆయన ఉద్యోగం దుబాయ్‌లో కదా, తను దుబాయ్ వెళ్ళిపోయారు, నా పరీక్షలయ్యాక నేనూ దుబాయ్ వెళ్ళిపోతాను" అని అందట. మరునాడు పొద్దున్న లేచినప్పుడు అమ్మ సాయితో "సాయీ, ఇవ్వాళ సున్నుండలు చెయ్యాలి, నిర్ఝరిని అత్తగారింటికి పంపించాలి ఇవ్వాళ" అందట.

2015 మొదటి నుంచి అమ్మకు నోటితో తిండి తినడం కష్టమయింది. అప్పుడు డాక్టర్ సలహా ప్రకారం అమ్మకు ముక్కుద్వారా వేసిన ప్లాస్టిక్ ట్యూబ్ ద్వారా ఫీడింగ్ మొదలుపెట్టారు, దీని తర్వాత అమ్మ ఎప్పుడూ పక్కమీద పడుకొనిగానీ, కూర్చొని గానీ ఉండేది. కానీ చివరి వరకూ తనని చూడటానికి వచ్చిన బంధువులతో మాట్లాడుతుండేది.

మా ఆవిడ విజయకు భుజాలపైన నొప్పిగా ఉండేది, దానికి కోయంబత్తూరులో ఉన్న ఆయుర్ వైద్య చికిత్సాలయాల్లో మంచి ట్రీట్‌మెంటు లభిస్తుందని తెలిసింది. తన ట్రీట్‌మెంటుకీ, మళ్ళీ మా అమ్మను చూసే అవకాశం వస్తుందనీ మేము 6 జనవరి 2016న చెన్నై వచ్చి, 13 జనవరి 2016 భోగి రోజున ఆ క్లినిక్‌కి వెళ్ళాం. ఆ రోజు మా తమ్ముడు సాయి 70వ పుట్టిన దినం. దీనికి దగ్గర స్నేహితులను పిలిచి విందు చేద్దామని వాళ్ళ అమ్మాయి నిర్ఝరి చెప్పింది. ఆ విందు 31 జనవరి 2016న చేద్దామనుకొని దానికి ప్రయత్నాలు మొదలుపెట్టాం. అప్పటికి విజయ ఇంకా కోయంబత్తూర్‌లో ట్రీట్‌మెంటుతో ఉంటుంది, కనుక తను రాలేదు, కానీ నేను కోయంబత్తూర్ నుంచి 28 జనవరి నాడు తిరిగి వచ్చి విందు అయ్యాక మళ్ళీ విజయకి కంపెనీ ఇవ్వడానికి వెళ్దామని ప్లాను చేసాను.

అప్పుడు మా అమ్మకి రెండు పాదాలు బాగా ఉబ్బినట్లు కనిపించాయి. దానికి ట్రీట్‌మెంటుకని డాక్టర్ సలహాపై అమ్మను హాస్పిటల్‌లో చేర్పించాడు సాయి. క్లినిక్‌లో చేరిన కొన్ని రోజులకే అమ్మ ఆరోగ్యం దిగజారిపోవడం మొదలయ్యింది. కొన్ని రోజుల తర్వాత డాక్టర్ అమ్మను ఐ.సి.యు.కి మార్చాడు. ఐ.సి.యు.లో ఉన్న కొన్ని రోజుల తర్వాత తను కళ్ళు ఎప్పుడూ మూసుకొని ఉండడం మొదలయ్యిందట.

నేను 28 జనవరి 2016న కోయంబత్తూరు నుంచి చెన్నై వచ్చేటప్పటికి అమ్మ కళ్ళు తెరవడం మానేసింది.

కానీ తన ఐ.సి.యు. బెడ్‌పక్క నుంచొని మాట్లాడుతూ తన చెయ్యి నొక్కితే నా చెయ్యి పట్టుకునేది. ఇలా కొన్ని రోజులు సాగింది. రోజూ అమ్మని క్లినిక్‌కు వెళ్ళి చూసేవాళ్ళం.

అమ్మ పరిస్థితి తెలుసుకొని చెల్లెలు గీత కూడా అమ్మను చూసిపోదామని చెన్నై వచ్చింది. మేము కలిసి క్లినిక్‌కి వెళ్ళి అమ్మను చూస్తుండేవాళ్ళం. అప్పుడే అమ్మకు క్లినిక్‌లో ఇంట్రావీనస్ ఫీడింగ్ మొదలెట్టారు. శ్వాస పీల్చుకోవడం కూడా కష్టమవుతుందని, అమ్మకు వెంటిలేటర్ సహాయంతో ఆక్సిజన్ ఫోర్స్‌డ్ బ్రీతింగ్ కూడా మొదలెట్టారు.

ఇలా సాగుతుండగా 10 ఫిబ్రవరి 2016 ప్రొద్దున్న క్లినిక్ వాళ్ళు పిలిచి "మీ అమ్మకు మేము ఇంకేమీ చెయ్యలేము. ఆక్సిజన్ టాంకుతో బాటు మీ ఇంటికి పంపించేస్తున్నాం" అని చెప్పారు.

వాళ్ళు అమ్మను ఎంబులెన్సులో తీసుకువచ్చి, సాయి ఎపార్ట్‌మెంటులో తన పక్క మీద పడుకోబెట్టారు ఆక్సిజన్ ట్యాంక్‌తో సహా. మ॥ 1.45కి నేను, శ్రీరాములు, సాయి, గీత, కోడళ్ళు విజయ, జయలక్ష్మి, అన్నపూర్ణ మనమరాలు నిర్జరి ఆ బెడ్ చుట్టూరా నుంచొని అమ్మను చూస్తున్నాం. సిలిండర్ తన ఊపిరితిత్తుల్లోకి ఆక్సిజన్‌ని పంపిస్తోంది. ఆక్సిజన్‌ని ఊపిరితిత్తుల్లోకి పంపినప్పుడల్లా అమ్మ తల ఊపుతోంది. ఇలా మ॥ 2 గం॥ల వరకు సాగింది. అప్పుడు అమ్మ తల ఆడించడం మానేసింది. మ॥ 2.10 గం॥లకు అమ్మ జీవితం అయిపోయిందని మాకు తెలిసింది.

చివరి క్షణాల్లో, బ్రతికి ఉన్న తన పిల్లలూ, కోడళ్ళు అందరూ, ఒక మనమరాలు తన చుట్టూరా నిల్చొని చూస్తుండగా అమ్మ ప్రాణం విడిచింది.


# రచయిత బయో

జననం 1936లో, ఒక బీద కుటుంబంలో కనుక చిన్నప్పుడు, తను పెద్దయ్యాక, తన నాన్నగారి ఆఫీసులో అందరికంటే ఎక్కువ జీతంగల కలెక్టర్ ఉద్యోగం సంపాదించాలని కలలు గనేవాడు. బందరు హిందూ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు కెమిస్ట్రీ లెక్చరర్ పాఠాలు చెప్పే పద్ధతి చాలా నచ్చి, తను పెద్దయ్యాక ఆయనలాగానే మంచి టీచర్ అవ్వాలనుకోవడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత అమ్మ ప్రోత్సాహంతో మంచి రిసెర్చి చెయ్యాలని ఉవ్విళ్ళూరడం మొదలుపెట్టాడు. మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో బి.ఎస్.సి. ఆనర్ ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ కలకత్తాలో ఎమ్. స్టాట్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బెర్క్లీలో ఆపరేషన్స్ రిసెర్చిలో పి.హెచ్.డి. చేశాక, 1968లో యూనివర్సిటీ ఆఫ్ మిచిగన్, ఆన్ అర్బర్, ఇండస్ట్రియల్ అండ్ ఆపరేషన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంటులో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరి, అక్కడే స్థిరపడ్డారు తన సతీమణి విజయ, అమ్మాయి వాణిలతో.

తన రిసెర్చి ఏరియా "ఆప్టిమమ్ డెసిషన్ మేకింగ్". దీనికి అన్ని రంగాల్లోనూ అప్లికేషన్స్ ఉన్నాయి కనుక, ఇది చాలా ముఖ్యమైన సబ్జెక్టు. తన రిసెర్చి వగైరా వివరాలు తన వెబ్ పేజీలో చూడవచ్చు దీని లింకు.

http://www-personal.umich.edu/~murty/

దీంట్లోనే తన ఎకడెమిక్ బయోకి లింకు లభిస్తుంది. తను 2014లో రిటైరయ్యి ప్రస్తుతం తన సబ్జెక్టులో ఒక టెక్స్ట్ బుక్కు రాయడంలో బిజీగా ఉన్నారు.



చిలకలపూడి పాండురంగని గుళ్ళో పాండురంగని విగ్రహం వద్ద అమ్మ
విగ్రహం ప్రక్కన కూర్చున్నవారు శ్రీ భక్త నరసింహంగారు వీరే ఈ గుడిని కట్టించారు.




**1 & 2. అమ్మా, నాన్నలతో మా కుటుంబ సభ్యులు, 3. ఐదు తరాలు ఉన్న ఫోటో, అమ్మమ్మ, అమ్మ, సరోజిని, సరోజిని కూతురు జ్యోతి, జ్యోతి కూతురు సృజన, తమ్ముడు నిరూప్, మిగతా మనుమలు, మనుమరాళ్ళతో, 4. అమ్మ శ్రీరా కుటుంబం, కేదారి, సరోజినిలతో**

**నన్నయాదుల కన్నతల్లికి సన్నజాజుల మాలలు అర్పిస్తూ**
**ఆంధ్రకేసరి వీరమాతకు సాంద్రకర్పూర హారతులందిస్తూ**
**రాలు కరిగే త్యాగరాజుని రాగసుధలో పరవశిస్తూ**
**కూచిపూడి కళామతల్లికి న్యాంజలులు సమర్పిస్తూ**
**అమెరికాలో తెలుగుతల్లికి సాహిత్యాలంకరణలు చేస్తూ**
**మురిసిపోదాం మనందరం మనందరం తెలుగుభాషాభిమానులం**

1994లో అలా ఒక చిన్న ఊహతో తెలుగు సాహిత్యానికి పెద్దపీట వేసి హ్యూస్టన్ నగరంలో అలా మొదలైన వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా అచిరకాలంలోనే ఆ దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగానే అనేక సాహిత్య కార్యక్రమాలు నిర్వహించి తెలుగు భాషా, సాహిత్యాలకి పర్యాయపదంగా గుర్తింపు పొందింది. మందీ, మార్బలమూ, శాశ్వత నిధి నిక్షేపాలూ లేకపోయినా కేవలం తెలుగు భాషా, సాహిత్యాభిమానుల అండదండలే కొండంత బలంగా తెలుగు సాహిత్యానికి 'చంద్రుడికో నూలుపోగు' సమర్పిస్తున్న లాభాపేక్ష లేని సంస్థ 'వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా'.

**కొనసాగిస్తున్న సాహిత్య కార్యక్రమాలు, సాధించిన విజయాలు**

- 1995 నుండి ప్రతీ ఏటా విదేశీ రచయితల ఉగాది ఉత్తమ రచనల పోటీలు.
- నాలుగు అంతర్జాతీయ కథల పోటీలు.
- 1998 నుండి జాతీయ స్థాయి ద్వైవార్షిక అమెరికా తెలుగు సాహితీ సదస్సులు. (అట్లాంటా, చికాగో, డిట్రాయిట్, న్యూజెర్సీ, ఫ్రెమాంట్ (కాలిఫోర్నియా), ఇండియానాపొలిస్, హ్యూస్టన్)
- 2005లో భారతదేశంలో (హైదరాబాద్) అనుబంధ విభాగ సంస్థాపన.
- 2010 నుండి 'నా మొట్ట మొదటి కథ', 'నా మొట్ట మొదటి కవిత'ల పోటీలు.
- 2006 నుండి నాలుగు దేశాలలో రెండేళ్ళ కొకసారి (భారతదేశం, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, యునైటెడ్ కింగ్‌డం, సింగపూర్) ఐదు ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులు.
- మూడు జాతీయ మహిళా రచయితల సాహిత్య సమ్మేళనాలు (హైదరాబాద్– 2012, 2014, 2016)
- రెండు యువతరం సాహితీ సమ్మేళనాలు (2013–హైదరాబాద్, 2017– కాకినాడ)
- ఉత్తర అమెరికా మొట్ట మొదటి తెలుగు కథ 50వ వార్షికోత్సవాలు (2014, హ్యూస్టన్)
- 2005 నుండి 'నెల తప్పకుండా' 'నెల నెలా తెలుగు వెన్నెల' సాహిత్య ప్రసంగాలు. (హైదరాబాద్)
- అమెరికా తెలుగు కథానిక 13 సంకలనాలతో సహా 72 తెలుగు పుస్తకాల ప్రచురణ.

- వందలాది సాహిత్య, సంగీత, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలకి నిరంతర సహకారం.
- సుమారు 100 మంది భారతదేశ తెలుగు సాహితీవేత్తలకి, కళాకారులకి అమెరికా పర్యటన అవకాశాలు.
- 2005లో సామాజిక సేవా, ధార్మిక కార్యక్రమాలకి విస్తరణ. వేగేశ్న ఫౌండేషన్ వికలాంగుల సంస్థ, (హైదరాబాద్), కాకినాడలో ఉన్న మ్యునిసిపల్ హైస్కూల్, పి.ఆర్. కాలేజ్, జెఎన్‌టియు విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, బాలికల పాఠశాలలు, ఇతర ప్రాంతాలలోనూ సుమారు 20 సంస్థలకి చేదోడు వాదోడుగా ఐదు మిలియన్ డాలర్లపైగా విరాళాల సేకరణ.


వ్యవస్థాపకులు: **వంగూరి చిట్టెన్ రాజు**

E-mail: vangurifoundation@gmail.com

USA Phone: 832 594 9054

శాయి రాచకొండ, హ్యూస్టన్ (సంపాదకులు)

వంశీ రామరాజు (మేనేజింగ్ ట్రస్టీ. భారతదేశ విభాగం)

## వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా ప్రచురణలు

1. అమెరికా తెలుగు కథానిక – మొదటి సంకలనం, 1995
2. అమెరికా తెలుగు కథానిక – రెండవ సంకలనం, 1995
3. అమెరికా తెలుగు కథానిక – మూడవ సంకలనం, 1996
4. 'మదనసుందరి' నృత్యనాటిక, మంచిరాజు వెంకట్రావు రచన, 1996
5. 'మాలకొండ మాట, మంచి మాట' ఉండేల మాలకొండారెడ్డి శతకం, 1996
6. 'మియాండరింగ్ మైండ్' ఇంగ్లీషు పద్యాలు, ఏ.వి. రావు
7. అమెరికా తెలుగు కథానిక – నాల్గవ సంకలనం, 1997
8. 'కించిత్ భోగే భవిష్యతి' – వేమూరి వేంకటేశ్వరరావు కథాసంకలనం, 1997
9. అమెరికా తెలుగు కథానిక – ఐదవ సంకలనం, 1998
10. అమెరికా తెలుగు కవిత – మొదటి సంకలనం, 1998
11. 'మెటా మార్ఫసిస్' వేలూరి వెంకటేశ్వరరావు రచనా సంకలనం, 1998
12. 'తిరుప్పావై' (పద్యకావ్యం) – శ్రీశ్రీశ్రీ లక్ష్మణ యతీంద్రులవారు, పెమ్మరాజు వేణుగోపాలరావు (ఆంగ్లంలో అనువాదం), బాపు రంగుల బొమ్మలు, 1998
13. 'ప్రప్రథమ అమెరికా తెలుగు సాహితీ సదస్సు – సభా విశేష సంచిక', 1999
14. అమెరికా తెలుగు కథానిక – ఆరవ సంకలనం, 2000
15. 'మా ఊరి కథలు' – దామరాజు సచ్చిదానందమూర్తి కథలు, 2000
16. 'అమెరికా ఇల్లాలు' – కమల చిమట రచనా సంకలనం, 2000
17. 'లోకానికి చాటింపు' – పెమ్మరాజు వేణుగోపాలరావు కవితా సంకలనం, 2000
18. 'అమెరికా తెలుగు కథ' – మొదటి సంకలనం, ఇండియా ప్రచురణ, ఫిబ్రవరి, 2002
19. 'రెండవ అమెరికా సాహితీ సదస్సు (ఆగస్టు, 19–20, 2000) సభా విశేష సంచిక', మే, 2002
20. 'గేయ రామాయణం' – చెరుకూరి రమాదేవి, ఆగస్టు, 2002
21. అమెరికా తెలుగు కథానిక – ఏడవ సంకలనం, అక్టోబర్, 2002
22. 'నేనూ – నా రచనలు' – 'కళాప్రపూర్ణ' డా॥ అవసరాల (వింజమూరి) అనసూయాదేవి, డిసెంబర్ 2003
23. అమెరికా తెలుగు కథానిక – ఎనిమిదవ సంకలనం, అక్టోబర్, 2004

24. 'పడమటి గాలులు' (నవల) – వడ్లమాని కార్తీక్, ఆగస్టు 2005
25. అమెరికామెడీ కథలు – వంగూరి చిట్టెన్ రాజు, జూలై, 2006
26. ప్రవాసాంధ్రుల ఆశాకిరణం (కథాసంపుటి) – శ్రీమతి పూడిపెద్ది శేషు శర్మ, ఆగస్టు, 2006
27. శృంగార భర్తృహరి – పెమ్మరాజు వేణుగోపాలరావు – ఆగస్టు, 2006
28. అమెరికా తెలుగు కథానిక – తొమ్మిదవ సంకలనం, అక్టోబర్ 2006
29. గతానికి స్వాగతం – 'కళాప్రపూర్ణ' డా॥ అవసరాల (వింజమూరి) అనసూయాదేవి, జనవరి 2007
30. బాలి కార్టూన్లు – జనవరి 2007
31. అమెరికాలక్షేపం – వంగూరి చిట్టెన్ రాజు, జనవరి 2007
32. అమెరికా తెలుగు కథానిక – పదవ సంకలనం, జూలై, 2008
33. అమెరికామెడీ కథలు – వంగూరి చిట్టెన్ రాజు (అమెరికా ప్రచురణ)
34. అమెరికామెడీ నాటికలు – వంగూరి చిట్టెన్ రాజు, జూలై, 2008
35. మూడవ అమెరికా సాహితీ సదస్సు (డెట్రాయిట్) – సభా విశేష సంచిక – సెప్టెంబర్, 2008
36. నాలుగవ అమెరికా సాహితీ సదస్సు (బ్రిడ్జ్‌వాటర్, న్యూజెర్సీ) – సభా విశేష సంచిక – అక్టోబర్, 2008
37. అమెరికామెడీ కబుర్లు (హాస్యకథా వ్యాసాలు) – వంగూరి చిట్టెన్ రాజు – ఫిబ్రవరి, 2009
38. పరిపరి పరిచయాలు – ఇంద్రగంటి శ్రీకాంతశర్మ – ఫిబ్రవరి, 2009
39. 20వ శతాబ్దంలో అమెరికా తెలుగు కథానిక మరియు అమెరికా సాహితీవేత్తల పరిచయ గ్రంథం – ఫిబ్రవరి, 2009
40. సిప్రాలి – మహాకవి శ్రీశ్రీ స్వదస్తూరీలో – శ్రీశ్రీ శతజయంతి ప్రత్యేక సంచిక – సెప్టెంబర్, 2009
41. అమెరికా ఇల్లాలి ముచ్చట్లు (కథాసంపుటి) – శ్యామలాదేవి దశిక – అక్టోబర్, 2010
42. అమెరికా తెలుగు కథానిక – పదకొండవ సంకలనం, అక్టోబర్, 2010
43. శ్యామ్‌యానా (కథాసంపుటి) – మెడికో శ్యామ్ – అక్టోబర్, 2010
44. తూర్పు గుడి – పడమర బడి (నవల) – కలశపూడి శ్రీనివాసరావు – అక్టోబర్, 2010
45. అమెరి'కాకమ్మ' కథలు – వంగూరి చిట్టెన్ రాజు, అక్టోబర్, 2011
46. అమెరికామెడీ కథలు (మూడవ ముద్రణ) – వంగూరి చిట్టెన్ రాజు, అక్టోబర్, 2011
47. లక్ష్మిన్ టేబిల్ – పి.యస్. లక్ష్మీరావు
48. వర్షించవే నీలిమేఘమా! (కవితా సంకలనం) – ఉమాదేవి పోచంపల్లి గోపరాజు
49. ఒక అమ్మ ఆక్రోశం (నవల) – డా॥ ఉమా ఇయ్యుణ్ణి (ద్వితీయ ముద్రణ – 2014)
50. వంగూరి చిట్టెన్ రాజు చెప్పిన 116 అమెరికామెడీ కథలు – 2013
51. విదేశీ కోడలు – కథాసంపుటి – కోసూరి ఉమాభారతి – 2013

52. అవంతీ కల్యాణం - నవల - లలిత రామ్, 2013
53. ఆత్మార్పణం కవితా సమాహారం, పెమ్మరాజు వేణుగోపాలరావు, 2014
54. మొట్టమొదటి జాతీయ యువసాహితీ సమ్మేళనం - సభా విశేష సంచిక, 2014
55. ఎగిరే పావురమా - సాంఘిక నవల - కోసూరి ఉమాభారతి, అక్టోబర్ 2014
56. అపర్ణ గునుపూడి - కథానికా సంపుటి, అక్టోబర్ 2014
57. అమెరికా తెలుగు కథానిక - 12వ సంకలనం - అక్టోబర్ 2014
58. అమెరికా తెలుగు కథానిక - ఒక సమగ్ర పరిశీలన - తన్నీరు కళ్యాణ్ కుమార్ & వంగూరి చిట్టెన్ రాజు - సెప్టెంబర్ 2014
59. కలికి కథలు - సమగ్ర సంపుటి - వెంపటి హేమ - ఆగస్టు 2015
60. 'అసమాన అనసూయ'- నా గురించి నేను - 'కళాప్రపూర్ణ' డా॥ అవసరాల అనసూయాదేవి ఆత్మకథ - డిసెంబర్ 2015
61. 'అమెరికా ఇల్లాలి ముచ్చట్లు-2'- శ్యామలాదేవి దశిక (కథా సంపుటి- డిశంబర్ 2015
62. 'వేదిక' - కోసూరి ఉమాభారతి నవల, ఆగస్ట్ 2016
63. 'అమెరికలకలం కథలూ - కమామీషులూ' - వంగూరి చిట్టెన్ రాజు - ఆగస్ట్, 2016.
64. 'కవిత్వంలో నేను - మరికొన్ని వ్యాసాలు'- విన్నకోట రవిశంకర్ (నవంబర్, 2016)
65. 'రెండవ జాతీయ యువతరం సాహిత్య సమ్మేళనం' - సభా విశేష సంచిక (ఫిబ్రవరి, 2017)
66. 'తీపి గుర్తులు' - హాస్యబ్రహ్మ శంకర నారాయణ (ఏప్రిల్, 2017)
67. నర్తకి - నవల - సోమ సుధేష్ణ (సెప్టెంబర్, 2017)
68. అమెరికా తెలుగు కథానిక - 13వ సంకలనం (సెప్టెంబర్, 2017)
69. రాధికా నోరి కథలు-మొదటి సంపుటి - రాధికా నోరి (డిసెంబర్ 2017)
70. అమెరి'కట్టు' కథలూ-కమామీషులూ - వంగూరి చిట్టెన్ రాజు (డిసెంబర్, 2017)
71. సరికొత్త వేకువ - కథలు - కోసూరి ఉమాభారతి - 2018
72. నాట్యభారతీయం - కోసూరి ఉమాభారతి - 2018
73. 10వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు (సెప్టెంబర్ 23-24, 2017) సభా విశేష సంచిక, జూన్, 2018 (ఇ-పుస్తకం)
74. అమ్మ జ్ఞాపకాలు - కట్టా గోపాలకృష్ణమూర్తి, సెప్టెంబర్, 2018 (ఇ-పుస్తకం)